

పొదిలి సచివాలయం-2లో పరిస్థితి ఇదీ

ఉదయం 10.44

పొదిలి పట్టణంలోని సచివాలయం-2లో సోమవారం ఉదయం 10.44 గంటలకు సచివాలయ కార్యదర్శి మాత్రమే హాజరయ్యారు. ఆయన వచ్చి తలుపులు తీస్తున్న సమయంలో విజిట్‌కు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రశ్నించగా కొందరు సర్వేలో, మరికొందరు సెలవులో ఉన్నారని సమాధానం ఇచ్చారు. సచివాలయం-3లో కేవలం మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వారు విధులకు రాలేదా అని వారిని ప్రశ్నించగా ఏఎన్ఎం సెలవులో ఉన్నారని, కొందరు సర్వే కోసం ఫీల్డ్‌లోకి వెళ్లారని సమాధానం చెప్పారు. అన్ని సచివాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఒంగోలులో సమగ్ర కుటుంబ సర్వే చేయాలని అధికారులు భావించారు. ఈమేరకు సచివాలయ సెక్రటరీలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలి. ఆ ప్రక్రియ అంతా ఉదయం 7 నుంచి 10గంటలలోపు చేపట్టాలి. ఆ తర్వాత యథావిధిగా సచివాలయాలకు వెళ్లాలి. అయితే సిబ్బంది మాత్రం సర్వేల పేరుతో చెక్కేస్తున్నారు. ప్రతి సచివాలయంలో పది మంది వరకు సెక్రటరీలు ఉండగా వారంతా ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. కార్యాలయంలో ఎవరూ లేకపోతే మరీ బాగుండదు కాబట్టి రోజుకు ఇద్దరు సెక్రటరీలు ఉండాలని నిర్ణయించుకున్నారు. మిగిలిన వారు సర్వేల పేరుతో ఫీల్డులో ఉన్నట్లు చెప్తున్నారు. సోమవారం నగరంలోని వార్డు సచివాలయాలను పరిశీలించగా ఎక్కడ చూసినా ఇద్దరు, లేకపోతే ఖాళీ కుర్చీలు కనిపించాయి.

జిల్లాలో సచివాలయాల పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసి ఐదేళ్లు గడుస్తున్నా గాడిన పడలేదు. జిల్లాలో సచివాలయాల పనితీరును పరిశీలించేందుకు సోమవారం 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ నిర్వహించగా పలుచోట్ల ఉద్యోగులు కనిపించ లేదు. చాలాచోట్ల ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. దీనిపై ఆరా తీయగా కొన్నిచోట్ల హౌస్‌హోల్డ్ సర్వే పేరుతో సిబ్బంది డుమ్మా కొట్టినట్లు బయటపడింది. మరికొన్ని చోట్ల మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమాల కోసం వెళ్లినట్లు తెలిసింది. కొంత మంది సిబ్బంది ఎప్పుడో తీరినప్పుడు విధులకు రావడం కనిపించింది.

ఆంధ్రజ్యోతి విజిట్



మధ్యాహ్నం 12.30

ఒంగోలులోని మైషాసుపత్రి వద్ద ఉన్న గద్దలగుంట సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

సర్వే పేరుతో తాళం వేసిన మార్కాపురంలోని సచివాలయం-4



పామూరు సచివాలయం-1లో పూర్తిస్థాయి ఉద్యోగులు రాకపోవడంతో ఉన్న వారికి సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు

ఉదయం 11 గంటలు

విధులకు అతిథులు కాలానికి అతీతులు

గ్రామ, వార్డు సచివాలయాలు వెలవెల

- ఏళ్లు గడుస్తున్నా గాడిన పడని నిర్వహణ
- పర్యవేక్షణ అంతంతమాత్రమే!
- నియంత్రణ లేక ఇష్టారీతిన వ్యవహరిస్తున్న సిబ్బంది
- సమయానికి రాకపోవడంతో జనం అవస్థలు
- సర్వే పేరుతో కొందరు, శిక్షణ కోసం మరికొందరు
- కార్యాలయాల్లో నామమాత్రంగానే ఉంటున్న వైనం

ఒంగోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలు మొక్కుబడిగా నడుస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారం అంతా ఇష్టారాజ్యంగా మారింది. సమయ పాలన పాటించడం లేదు. సర్వేలు, ఇతర క్షేత్రస్థాయి పనుల పేరులతో విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇందుకు సోమవారం 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ సందర్భంగా సచివాలయాల్లో కనిపించిన దృశ్యాలే నిదర్శనం. గత వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయగా ఐదేళ్లు గడుస్తున్నా అవి ఇంకా గాడిన పడలేదు. జిల్లాలో మొత్తం 719 సచివాలయాలు ఉండగా గ్రామాల్లో 14 మంది, పట్టణాల్లో 11 మంది వంతున దాదాపు 8వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. సగటున ప్రతి ఐదు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసిన అప్పటి ప్రభుత్వం అందులో అడ్మిన్ సెక్రటరీ పర్యవేక్షణలో హెల్త్, ఇంజనీరింగ్, రెవెన్యూ, సర్వేయర్, సంక్షేమ, గ్రామ పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్యుత్ ఇలా పలుశాఖల సిబ్బందిని

మిగతా 6వ పేజీలో

వారం నుంచి తిరుగుతున్నా..



బ్యాంకులో రుణం తీసుకునేందుకు అవసరమైన 1బీ, అడంగల్ కోసం వారం రోజుల నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. పెదయిర్లపాడు సచివాలయానికి వెళ్తే పేపర్లు లేవన్నారు. వెంగళాయపల్లి వెళ్లినా అక్కడా అదే మాట చెప్పారు. ఈ రోజు చింతగుంపల్లి సచివాలయానికి వస్తే ఇక్కడ ఆ ఉద్యోగే లేరు. పేపర్లు కూడా లేని సచివాలయాలు ఎందుకు?

గూడూరి మాల్యాద్రి, మెట్లవారిపాలెం, పీసీపల్లి మండలం

పాసుబుక్ కోసం ఏడాదిగా ప్రదక్షిణలు చేస్తున్నా..



మా అమ్మ పేరుపై ఉన్న భూమికి పట్టాదారు పాసుబుక్ కోసమని ఏడాది నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. ఎప్పుడు వచ్చినా సంబంధిత ఉద్యోగి అందుబాటులో ఉండటం లేదు. ఒకవేళ ఉన్నా.. చూద్దాం అంటూ మాటలు చెప్పడంతోనే సరిపోయింది. ఇప్పటికే చాలాసార్లు అర్జీలు ఇచ్చాను. అయినా ప్రయోజనం లేదు.

కుంచాల సాయి, చంద్రపాడు, చీమకుర్తి మండలం

పింఛన్ కోసం నెలల తరబడి..



నా భర్తకు గతంలో పింఛన్ వచ్చేది. ఆయన 2023లో మృతి చెందారు. ఆ పింఛన్ నాకు ఇప్పించాలని మార్కాపురం-17వ సచివాలయం చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా. తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ ఉందంటున్నారు. అక్కడకు వెళితే ఇక్కడ పెండింగ్ అంటున్నారు. ఇంత వరకూ పింఛన్ ఇవ్వలేదు.

పి.సత్యవతి, మార్కాపురం

రఘురామ కేసులో సాక్షులను విచారించిన ఎస్పీ

ఒంగోలు క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రఘురామకృష్ణరాజు కస్టోడియల్ వేధింపుల కేసులో సోమవారం ఐదుగురు సాక్షులను విచారణాధికారి అయిన ఎస్పీ దామోదర్ విచారించారు. గుంటూరు జీజీహెచ్‌లో ట్రిపుల్‌ఆర్‌కు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ల బృందాన్ని ఆయన ఎంక్వయిరీ చేశారు. అప్పట్లో ఏమి జరిగిందన్న దానిపై సమాచారం రాబట్టినట్లు తెలిసింది. రిపోర్టు గురించి ఆరా తీశారని సమాచారం. అదేసమయంలో అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.

మీ కోసం మార్పులు



మీకోసంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా, శాఖల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్ల వద్ద అధికారులు, ఉద్యోగులు

- శాఖల వారీగా టేబుళ్ల ఏర్పాటు
- రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- సంబంధిత అధికారులు పరిశీలించిన తర్వాతే కలెక్టర్ వద్దకు
- అర్జీదారుల కోసం సహాయకులు

7

నేడు డీసీల ఎన్నికలు

- జిల్లాలో 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు
- అన్నీ ఎన్నెస్పీ పరిధిలోనే..
- 342 డబ్ల్యూయూఏలలో మూడు మినహా అన్నిచోట్లా కమిటీల ఎన్నిక పూర్తి



ఒంగోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోగదారుల సంఘాల్లో రెండో స్థాయిలో ఉండే డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)ల ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో పది డీసీలు ఉండగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాగునీటి వనరులను మూడు విభాగాలుగా చేసి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తోంది. సాగర్, కేడబ్ల్యూడీ తరహా వాటిని భారీ నీటిపారుదల విభాగంలో, కంభం చెరువు, మోపాడు రిజర్వాయర్ వంటి వాటిని మధ్యతరహా, గ్రామాల్లోని సాగునీటి చెరువులు చిన్న తరహా విభాగాల్లో ఉన్నాయి. చెరువులకు డబ్ల్యూయూఏలు ఉండగా ఎన్నెస్పీలో డీసీలు, ఆపైన ప్రాజెక్టు కమిటీ ఉంది. మీడియం ఇరిగేషన్‌లో డబ్ల్యూయూఏలపైనా ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. జిల్లాలో ఎన్నెస్పీలో 88, మీడియంలో 14, మైనర్ విభాగంలో 240 వెరసి 342 డబ్ల్యూయూఏలు ఉండగా ఈనెల 14న వాటికి ఎన్నికలు నిర్వహించారు. మూడింటిలో వివిధ కారణాలతో ఆగిపోగా మిగిలిన చోట్ల జరిగాయి. మొత్తం 342 డబ్ల్యూయూఏల పరిధిలో 2,659 ప్రాదేశికాలు(టీసీ) ఉండగా ఎన్నెస్పీలో రెండో స్థాయి అయిన డీసీల ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. జిల్లాలో దర్శి ఎన్నెస్పీ డివిజన్ పరిధిలో నాలుగు, చీమకుర్తి

మిగతా 6వ పేజీలో

దొంగసొత్తు కొన్నవ్యక్తి అరెస్టు

- రూ.15.50లక్షల విలువైన వెండి, బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలలో దొంగతనం చేసిన వస్తువులను కొని తిరిగి విక్రయిస్తున్న శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన కాకినాడ కృష్ణారావు అలియాస్ రామకృష్ణను ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.15.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్.దామోదర్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఈ ఏడాది జనవరిలో నాగులుప్పలపాడు మండలం చదలవాడలోని రఘునాయకస్వామి దేవాలయం తాళాలు పగులకొట్టి వెండి, బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకెళ్లారు. బి.నిడమనూరు సాయిబాబా గుడిలోనూ చోరీ చేశారు. రెండు చోట్లా చోరీకి పాల్పడింది ఒకే ముఠా. ఈ ముఠా దొంగిలించిన వస్తువులను కృష్ణారావు కొనుగోలు చేశాడు. ఈ దొంగల ముఠాలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సవర సివన్న అలియాస్ రవి, సవర బోగేష్, తెలంగాణలోని మెదక్ జిల్లాకు చెందిన బత్తిన శ్రీకాంత్‌లను గతనెల 24న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఈ ముఠా వద్ద నుంచి కృష్ణారావు 100 దేవాలయాలకు సంబంధించిన 300 కిలోల వెండి కొనుగోలు చేశాడు. ఆదివారం రాత్రి కృష్ణారావు శ్రీకాకుళం నుంచి హౌరా రైలులో దొంగ సొత్తుతో చెన్నై వెళుతుండగా ఒంగోలులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 15 కిలోల వెండి, 4 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ.15.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్, పక్కన డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్సై శ్రీకాంత్

అమ్మకు ఆసరా

వృద్ధురాలిని ఇంటికి తీసుకెళ్లిన కుమారుడు



వృద్ధురాలి గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకుంటున్న ఎస్సై వెంకటేశ్వరనాయక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొమరోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో దీనావస్థలో ఉన్న వృద్ధురాలు లక్ష్మమ్మను ఆమె కుమారుడు ఇంటికి తీసుకెళ్లారు. 'అయ్యో.. అమ్మ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి కొమరోలు ఎస్సై వెంకటేశ్వరనాయక్ స్పందించారు. వెన్నంపల్లి వెళ్లి వృద్ధురాలి పరిస్థితిని తెలుకొని ఆమె ముగ్గురు కుమారులను కొమరోలు స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో చిన్న కుమారుడు తల్లిని వెంట తీసుకెళ్లేందుకు ముందుకు వచ్చారు. లక్ష్మమ్మను కొమరోలులోని ఇంటికి తీసుకెళ్లారు.

విధులకు అతిథులు.. కాలానికి అతీతులు

(5వ పేజీ తరువాయి)

నియమించారు. అయితే ఆ సిబ్బంది రోజువారీ పనితీరు, పర్యవేక్షణ అంతా గందరగోళంగా ఉంది.

వస్తారో రారో తెలియదు..

సచివాలయాల్లోని ప్రధాన శాఖల సిబ్బంది ఆయా శాఖల జిల్లా, మండల స్థాయి అధికారుల సూచనలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. అడ్మిన్ సెక్రటరీల్లో పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు, గ్రామాల్లోని వారు ఎంపీడీవో పర్యవేక్షణలో ఉన్నారు. ఎంపీడీవో, కమిషనర్ల ద్వారా జీతభత్యాల చెల్లింపులు జరుగుతాయి. అదేసమయంలో రోజువారీ పనులు ఆయా శాఖల వారీ ఉంటున్నాయి. దీంతో సచివాలయాల్లో సిబ్బంది పర్యవేక్షణ క్రమపద్ధతిలో ఉండటం లేదు. ఈ కారణంగా ఏ సిబ్బంది ఎక్కడకు వెళ్లారు, ఆఫీసుకు వస్తారా.. రారా? అన్న విషయం కూడా తోటి సిబ్బంది చెప్పే పరిస్థితి ఉండటం లేదు. ఇదేవిషయం సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో మరోసారి స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సోమవారం కలెక్టర్ నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందరూ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజా విజ్ఞప్తులను స్వీకరించి వాటికి పరిష్కారం చూపాలి. అయితే జిల్లాలోని సచివాలయాల్లో అత్యధిక చోట్ల ఆ పరిస్థితి కనిపించలేదు.

కార్యాలయాలకు డుమ్మా..

ఆంధ్రజ్యోతి బృందం సుమారు 50కిపైగా సచివాలయాలను విజిట్ చేయగా 90శాతం సచివాలయాల సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాలేదు. ప్రస్తుతం జిల్లాలో హౌస్‌హోల్డ్ సర్వే జరుగుతుండగా ఆ పేరు చెప్పి అనేకమంది సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటల వరకు సర్వే నిర్వహించి పదిన్నరకు కార్యాలయాల విధులకు హాజరుకావాల్సి ఉంది. అయితే అత్యధిక ప్రాంతాల్లో సర్వే పేరుతో ఆఫీసుకు డుమ్మా కొట్టారు. మరికొన్ని సచివాలయాల సిబ్బంది మండల కార్యాలయాల్లో శిక్షణ తరగతుల పేరుతో హాజరు కాలేదు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా పైఅధికారులు అలాంటి రోజు శిక్షణ పేరుతో సిబ్బందిని కార్యాలయాలకు పిలవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలా ఒకవైపు సర్వే పేరుతో, మరోవైపు శిక్షణ పేరుతో అధికభాగం సిబ్బంది కార్యాలయాలకు రాలేదు. మిగిలిన వారు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో జిల్లాలోని పలు సచివాలయాలు వెలవెలబోయాయి. వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు, సిబ్బంది లేక అవస్థలు పడాల్సి వచ్చింది.

నేడు డీసీల ఎన్నికలు

(5వ పేజీ తరువాయి)

డివిజన్ పరిధిలో ఆరు డీసీలు ఉన్నాయి. దర్శి డివిజన్ పరిధిలో త్రిపురాంతకం, కురిచేడు, దర్శి, ముండ్లమూరు సబ్ డివిజన్లలో డీసీలు ఉండగా చీమకుర్తి పరిధిలో చీమకుర్తిలో రెండు, ఎస్ఎన్‌పాడులో రెండు, ఒంగోలులో 1, దర్శి సబ్ డివిజన్‌లో మరొకటి ఉన్నాయి అధికారపార్టీ నేతల సూచనలకు అనుగుణంగా డీసీల ఎన్నిక కూడా ఏకగ్రీవం కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో మర్యాదగా నడుచుకోవాలి

డీఎస్పీ మహ్మద్ మొయిన్

వేటపాలెం/చీరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని డీఎస్పీ మ హ్మద్ మొయిన్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం ఆయన వేటపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపౌరుడు యూనిఫాం లేని పోలీసేనని, అపరాధ పరిశోధనలో ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. అందుకు అనుగుణంగా స్నేహ పూర్వక వాతావరణాన్ని మలుచుకోవాల ని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

పంగులూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తక్షణమే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ సింగారావుకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, జాన్, సుబ్బారావు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మార్టూరు : రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టు బాటు ధరలు కల్పించి గ్రామాలలోనే కొనుగోలు చేయాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మార్టూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నేతలు ధర్నా చేసి అనంతరం తహసీల్దార్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రాంబాబు, హనుమంతురావు, సాంబశివరావు పాల్గొన్నారు

ఇంకొల్లు : స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేసి తహసీల్దార్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో యర్రం గోవిందరెడ్డి, భానుప్రసాద్, అన్నెం ఆదయ్య, మాదాల అంజియ్య, రైతులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి పశువుల కాపరి మృతి

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి పశువుల కాపరి మందా పిచ్చయ్య (30) సోమవారం మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు వల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మందా రోశయ్య కుమారుడు తనకు ఉన్న పశువులను తీసుకుని మేతకు పొలాలకు వెళ్లాడు. ఉపాధి పథకం కింద గతంలో తీసిన నీటి కుంటలోకి పశువులు నీటి కోసం వెళ్లాయి. వాటిని బయటకు తోలేందుకు పిచ్చయ్య కుంటలోకి దిగడంతో లోతు ఎక్కువగా ఉండటంతో అయన నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. పిచ్చయ్యకు వివాహం కాలేదు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలు అరెస్ట్

పొదిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి వాటిలోని రాగి తీగల చోరీకి పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను సోమవారం అరెస్ట్ చేసినట్లు దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేష్, ఎస్ఐ వేమనలతో కలిసి సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు, గంజాయి ముఠాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం పొదిలి సీఐ, ఎస్ఐలు పట్టణంలోని పిచ్చిరెడ్డి తోట సమీపంలో తనిఖీ చేయగా కొంతమంది అనుమానస్పదంగా కనిపించారన్నారు. వారిలో పొదిలికి చెందిన ఇట్లా దుర్గారావు, పోలా రాఘవ, గురునాధం, బొజ్జా కామాక్షి, పోలా మార్తమ్మ, షేక్ బడేషా, అర్జున్, కట్టా పవన్‌కుమార్, చాపల్లి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

కమలమ్మలను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వీరు పొదిలి, కొనకనమిట్ల, హనుమంతునిపాడు, మర్రిపూడి, సంతనూతలపాడు మండలాలల్లో పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పగల కొట్టి అందులోని రాగితీగలను చోరీచేసినట్లు తెలిపారు. వీరివద్ద నుంచి 210 కిలోల రాగితీగను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వీరికి గురునాథం శివ అనే వ్యక్తి 1.2 కిలోల గంజాయి తీసుకొచ్చి నిందితలకు ఇచ్చి అమ్మిచ్చే ప్రయత్నం చేశారన్నారు. వీరి వద్ద నుండి రూ.1.80 లక్షల విలువైన రాగితీగను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగతనాలకు వినియోగించిన ఆటోను సైతం సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే ప్రధాన నిందితుడు శివ పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈ కేసును చేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. సిబ్బంది షబ్బీర్, రాంభూపాల్, కోటేశ్వరావు, అమీర్‌వలి, బాలమురళి, కృష్ణ, సలీం, గౌతంకుమార్‌లను రివార్డుకు సిఫార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

నీరిచ్చేదాకా తగ్గేదేలే!

● 'రాళ్లపాడు' వద్ద కొనసాగిన రైతుల ఆందోళన ● రెండు రోజుల్లో దెబ్బతిన్న గేటు తొలగిస్తాం : సీఈ

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాళ్ళపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము నుంచి త్వరగా నీరిచ్చి ఆదుకోవాలని కోరుతూ రెండవ రోజు సోమవారం కూడా రైతులు ఆందోళన కొనసాగించారు. ఉదయం 11 గంటలకు చినపవని, పెదపవని, అన్నెబోయినపల్లి, భీమవరప్పాడు, శాయిపేట, మక్కెనవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. రూ.లక్షలు పోసి సాగు చేసిన వరినార్లు, వరినాట్లు ఎండి పోతున్నాయని, త్వరగా నీరివ్వాలంటూ అధికారులతో వాదనకు దిగారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అక్కడున్న ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మితో వాదనకు దిగారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రోడ్డుకు బైక్‌లను అడ్డుపెట్టి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బస్సుల్లోని ప్రయాణికులు తాము ఇబ్బంది పడుతున్నామని రైతులతో అనగా, వారు ఆందోళన విరమించారు.

● నివేదిక సిద్ధం చేయండి : దివి శివరాం

అంతకముందు ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తూము వద్ద జరుగుతున్న



రోడ్డుపై వాహనాలు అడ్డుపెట్టి ఆందోళన చేస్తున్న రైతులు



'ప్రకాశం' ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఒంగోలు ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే కాలువకు సాగునీరు ఇవ్వాలని కోరడంతోపాటు అధికారులు, సిబ్బంది లేకుండా ప్రాజెక్టు నిర్వహణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు ఏమేమి అవసరమో జాబితా తయారు చేసి తనకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేస్తే, తాము సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

● కాలువలో వంద క్యూసెక్కుల నీరు

అయితే కుడి కాలువ తూములో దెబ్బతిన్న గేటు పైకి రాకపోవడంతో ఎస్ఈ వరలక్ష్మి ఆధ్వర్యంలో డీఈఈ ఎం వెంకటేశ్వర్లు ఇతర అధికారులు, సిబ్బంది కంప్రెషర్ ద్వారా దెబ్బతిన్న స్టాప్‌లాక్ గేటుకు, సర్వీసు గేటు మధ్యలో ఉన్న గోడలను పగలగొట్టారు. దీంతో నీరు తూములోని బావిలోకి వెళ్లి అక్కడ నుంచి కాలువలోకి పారుతోంది. అలాగే సైఫన్ పద్ధతిలోనూ నీరు పంపిస్తుండగా, ప్రస్తుతం కాలువలో 90 నుంచి 100 క్యూసెక్కుల మేర నీరు ప్రవహిస్తున్నట్లు డీఈఈ తెలిపారు. కాగా, సాయంత్రం 6 గంటల సమయంలో ప్రకాశం జిల్లా సీఈ శ్యాంప్రసాద్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థ బెకామ్ సాంకేతిక నిపుణులు పరశురాంరెడ్డి, మరికొందరు సాంకేతిక నిపుణులు కుడి కాలువ తూము గేట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ రెండు రోజుల్లో దెబ్బతిన్న గేటును తొలగించి నీరిస్తామన్నారు.

వరికి తుఫాన్ దెబ్బ

» గాలులకు పడిపోయిన పంట » కాపాడే పనిలో రైతులు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షా లు, గాలులతో పడిపోయిన వ రి పంటను రక్షించుకొనే పనిలో రైతులు ని మగ్నం అయ్యారు. మండలం వల్లాపల్లిలో ఏబీసీ కాలు వ దిగువ భాగంలో వరి పంట కోత దశలో ఉంది. పంట కోత కోయకుండానే గాలులు, వర్షాలకు పంట మెత్తం నేలకరించింది. దీం తో రైతులు వరి దుబ్బులను పైకిలేపి వరి గడ్డితో కడుతున్నారు. నేలపై ఉంటే వరి విత్త నాలు నల్లగా వస్తాయని అందుకే ఇలా కొంత పంటను కాపాడుకుంటున్నామని రైతులు తెలిపారు. పంట కోత దశలో ఉండడం వలనే పంట పడిపోయిందని రైతులు తెలిపారు. పడి పోయిన వరి పొలంలో దుబ్బులను పైకి లేపడంతో కొంత విత్తనాలు రాలి పోతున్నాయని కొందరు రైతులు తెలిపారు.

మరోసారి అల్పపీడన హెచ్చరిక రైతుల్లో దడ పుట్టిస్తోంది. వానలు పడితే బోరు బావుల కింద వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టాలు తప్పవు అని వారు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి ఉదయం నుండే నల్లగా కారుమబ్బులు కమ్మడంతో రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు. పొలాల మీద కొందరు రైతులు వరి పంటను కోత కోసి నూర్పిడి చేసేందుకు సిద్ధం అవుతుండగా కొందరు రైతులు కోత కోసి ఉంచారు. కొందరు కోత దశలో ఉన్న పంటను వర్షాలు లేకుంటే కోసేందుకు సిద్ధం అవుతున్నారు.



వల్లాపల్లి వద్ద వర్షాలకు పడిపోయిన వరి పంట

నాణ్యతతో హైవే పనులు పూర్తి చేయాలి

» రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

» అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి ఆదేశం

పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్న హైవే నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పిడుగురాళ్ల - ఓడరేవు హైవే పనులకు సంబంధించి పెండింగ్ వివరాలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో భాగంగా రైతుల వద్ద నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పలు సమస్యలను అధికారులు వివరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఏలూరి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు చూపుతో నిర్మాణాలను చేపట్టాలన్నారు. తిమ్మరాజుపాలెం, కారంచేడు గ్రామాల పరిధిలో హైవే అండర్ డ్రైనేజీ పటిష్టంగా ఉండాలని రైతులు కోరిన విధంగా మూడు మీటర్ల నుంచి పది మీటర్లకు పెంచాలని అధికారులను ఆదేశించారు. వరదలు సంభవించినప్పుడు రైతుల పంట భూములకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో హైవే ప్రాముఖ్యతను వివరించి ఈప్రాంత అభివృద్ధికి దోహదం చేసే అంశాలను తెలియజేసి రైతుల సమ్మతితో భూములను తీసుకోవాలని సూచించారు. హైవే పక్కన వరద కాలువ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వరద కాలువ నిర్మాణం చేపడితే రోడ్డు కూడా పటిష్టంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ పరంగా ఉన్న సమస్యలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ప్రతి గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిమ్మరాజుపాలెం సబ్‌స్టేషన్ వద్ద అండర్ డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉప్పుటూరు వద్ద సువిశాలమైన వెహికల్ అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నల్లమడ నుంచి రొంపేరు వరకు డ్రైన్‌లను ఆధునికీకరిస్తామని ఏలూరి స్పష్టం చేశారు. భూములను కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. కార్యక్రమంలో హైవే అథారిటీ డీఈ, ఈఈ, జేఈలు పాల్గొన్నారు.



హైవే అథారిటీ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి



కొండాయపాలెంలో తారు రోడ్డుపై నిలిచిన నీరు

ఇది వాగు కాదు.. తారు రోడ్డు

కొండాయపాలెంలో దారిలో నిలిచిన నీరు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ప్రదాన రోడ్డు వాగులను తలపిస్తోంది. వ్యర్థ నీరు రోడ్డుపై నిలిచి అలానే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెన్నుపల్లి అనంతవరం రోడ్డులో ఉన్న కొండాయపా లెం గ్రామంలోని బీసీ కాలనీ ఎదురుగా తారు రోడ్డుపై నీరు వాగులను తలపిస్తోంది. సైడు కాలువలు లేకపోవడం వలన వర్షాలతో కురిసిన నీరు రోడ్డుపైనే ఉంటుందని ప్రజలు తెలిపారు. ఈ రోడ్డులో ప్రయాణించే ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు వెంటనే నడి రోడ్డుపై నిలిచి ఉన్న నీటిని సైడుకు పంపేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేస్తున్న జనసేన నేతలు

సింగరాయకొండ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ అన్సారియాను కోరిన జనసేన నేతలు

● పంచాయతీ నిధులు రూ.50లక్షలు దుర్వినియోగం చేశారని ఆరోపణ

సింగరాయకొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీలో రూ.50 లక్షల వరకూ అవినీతికి పాల్పడిన సర్పంచ్ తాటిపర్తి వనజపై చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. ఈమేరకు ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ అవినీతిని సాక్ష్యధారాలతో పలు పర్యాయాలు అధికారులకు అందజేశామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఆమెపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదని వివరించారు. ఆమె చెక్ పవర్‌ను పూర్తిగా రద్దుచేయాలని, ప్రజాధనాన్ని లూటీ చేసినందుకు క్రిమినల్ కేసు నమోదుచేయాలని కోరారు. దుర్వినియోగం చేసిన ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయాలన్నారు. అనంతరం జనసేన నేతలు విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోతే వచ్చే సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మనోజ్‌కుమార్ సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల అధ్యక్షులు ఐనాబత్తిన రాజేష్, గూడా శశిభూషణ్, జనసేననాయకులు పాల్గొన్నారు.

సోలార్ బ్యాటరీ చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోలార్ బ్యాటరీల చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఆ మేరకు వివరాలను సీఐ సీహెచ్ ప్రభాకరరావు సోమవారం వెల్లడించారు. విశాఖపట్నంలోని జేకే వీధికి చెందిన పి.రామకృష్ణ, కాకినాడ జిల్లా గండెపల్లి గ్రామానికి చెందిన కె.ప్రసన్నకుమార్ నాయుడులు పలుచోట్ల సోలార్ పానళ్లు, బ్యాటరీలో చోరీ చేశారు. మండలంలోని పాలుట్ల, గుట్టలచేను గూడేలలో శ్రీశైలం ఐటీడీఏ ద్వారా విద్యుత్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ నుంచి సుమారు 600 బ్యాటరీలను నిందితులు చోరీ చేశారు. వాటిని హైదరాబాద్‌లో అమ్ముకున్నారు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేశారు. వీరిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరిచారు. అదేవిధంగా వీరి వద్ద నుంచి రూ.3 లక్షలు రికవరీ చేశారు. ఈ చోరీల వ్యవహారంలో ఎర్రగొండపాలెం, పాలుట్ల గ్రామాలకు చెందిన వారి హస్తం కూడా ఉన్నట్లు తెలిసిందని ఆ కోణంలో విచారిస్తున్నట్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా చేధించిన పోలీసులను సీఐ అభినందించారు. సమావేశంలో ఎస్ఐ పి చౌడయ్య ఉన్నారు.

ఇంధన పొదుపుతో భవిత సురక్షితం

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపుతోనే సురక్షితమైన భవిత సాధ్యమని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖాధికారులు సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా తర్లుపాడు రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ర్యాలీని సబ్‌కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాటిని విచక్షణా రహితంగా వినియోగిస్తే భవిష్యత్తు తరాలు అంధకారమవుతాయన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది కార్యాలయం నుంచి కంభం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ షియానాయక్, ఏఈలు నాగేంద్రరెడ్డి, హనుమానాయక్, సురేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

టంగుటూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు కోరారు. కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఓటు కోసం దరఖాస్తు చేసుకోని యువతీయువకులు 7వేల మంది వరకు ఉన్నారన్నారు. అందులో మండలానికి చెందిన వారు వెయ్యిమంది వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వారంతా బీఎల్వోలను కలసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కారంచేడు వాటర్ ట్యాంక్ మరమ్మతులు

ఎమ్మెల్యే చొరవతో రూ.15లక్షల పనులు



పూజచేసి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు

కారంచేడు/పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారంచేడు మంచి నీటి పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ఈవిషయాన్ని తెలుగుదేశం పార్టీ నేతలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే దానికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.15లక్షల వ్యయంతో దెబ్బతిన్న వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం అధికారులు, పార్టీ నేతల సారథ్యంలో పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రంలో ఎంపీడీవో నేతాజీ, ఈవో సూర్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ కుమార్, సర్పంచ్ శివపార్వతి, ఎంపీటీసీ సభ్యుడు శేషారత్నం, నాయకులు శ్రీరాములు, ప్రహ్లద పాల్గొన్నారు.

నేరాలను విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలి

చీరాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలని చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చీరాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ పరిధిలోని ముగ్గురు పాత నేరస్థులను సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏడాదికి రూ.లక్షకు బైండోవర్ చేసినట్లు వివరించారు.

అర్జీలను పరిష్కరించాలి

ఇంకొల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అందజేసిన అర్జీలలో సమస్యల పరిష్కరించే దిశగా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ వెంకటరత్నం అన్నారు. సోమవారం వీఆర్వోలు సంబంధిత అధికారులతో సమావేశం ని ర్వహించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలలో అందిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు అందినట్లు చెప్పారు.





శాఖల వారీగా టేబుళ్లు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

దివ్యాంగ బాలుడిని అధికారి వద్దకు తీసుకెళుతున్న ప్రత్యేక సహాయకురాలు

మీ కోసం మార్పులు!

ఫిర్యాదులు పరిష్కరించేందుకు కలెక్టర్ వినూత్న ఒరవడికి శ్రీకారం

ప్రజా ఫిర్యాదుల వేదిక (మీ కోసం) సమూలంగా మారిపోయింది. ఫిర్యాదుదారులు గంటల తరబడి వేచిచూసే పనిలేకుండా పోయింది. శాఖల వారీగా టేబుళ్లు, సహాయకులతో కొత్తరూపు దాల్చింది. ఈ మేరకు కలెక్టర్ నూతన ఒరవడికి నాంది పలికారు. నిరంతరం అధికారుల చుట్టూ తిరగకుండా ఉండేలా అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అందుకు సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'మీకోసం'లో ఈ మార్పులు చేపట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో గ్రీవెన్స్‌లపై దిశానిర్దేశానికి అనుగుణంగా అన్సారియా తన మార్కు మార్పు చూపుతున్నారు.

- ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి)

- శాఖల వారీగా టేబుళ్లు ఏర్పాటు
- రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించాకే కలెక్టర్ వద్దకు..
- ఎప్పటికప్పుడు అర్జీలను ఆన్‌లైన్ చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు
- అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా సయకుల ఏర్పాటు

ప్రత్యేక ప్రొఫార్మా ఏర్పాటు

● ఒంగోలు, కనిగిరి, మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లకు సంబంధించి కూడా ఆయా డివిజన్ల పరిధిలోని అర్జీదారులు ఆయా టేబుళ్ల వద్దకు వెళ్లేలా ఏర్పాటు చేశారు. అర్జీదారునితో మాట్లాడిన అనంతరం కలెక్టర్ వద్దకు పంపుతున్నారు. ● అయితే అర్జీదారుని సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రొఫార్మాను ఏర్పాటుచేశారు. సమస్య ఏమిటి? పరిష్కారం అవుతుందా? కాదా? గతంలో అర్జీ ఇచ్చి ఉంటే ఎందుకు పరిష్కారం కాలేదు? తదితర అంశాలన్నింటినీ పరిశీలించాక సంబంధిత అధికారి ఆ ప్రొఫార్మాలో రాసి కలెక్టర్‌కు పంపుతున్నారు. ● కలెక్టర్ ఆ అర్జీతో పాటు ప్రొఫార్మా పరిశీలించి ఇంకా ఏదైనా అనుమానం ఉంటే ఆ అధికారిని అక్కడికి పిలిపించి వివరణ తీసుకుంటున్నారు.

భరోసా కల్పించేలా చర్యలు



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న ప్రత్యేక సిబ్బంది

● సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారులకు కలెక్టరేట్ ప్రాంగణంలో బ్యానర్ల ఏర్పాటుతోపాటు ఉచితంగా అర్జీలు రాసి ఇచ్చేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ● సహాయ సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ అమలు పరిచారు. ● గ్రీవెన్స్ హాలు సమీపంలో వచ్చిన ప్రజానీకం కూర్చునేందుకు టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ● ఆ టెంట్‌లోకి వచ్చిన అర్జీదారులు తమ అర్జీ ఏ శాఖకు సంబంధించినదో సహాయకులు పరిశీలించిన తర్వాత గ్రీవెన్స్‌హాలులోని ఆ టేబుల్ వద్దకు తీసుకెళ్తారు. ● దివ్యాంగులు వస్తే వారిని మూడు చక్రాల సైకిల్‌పై సహాయకులు సంబంధిత అధికారుల వద్దకు తీసుకెళ్తారు. ఆ శాఖ అధికారులు అర్జీని పరిశీలించిన అనంతరం కలెక్టర్, జేసీ వద్దకు తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ● మొత్తం శాఖలు 80 ఉండగా ప్రధానమైన రెవెన్యూ, జిల్లా పంచాయతీ, ఇతర ముఖ్యమైన శాఖల కోసం 33 టేబుళ్లను ఏర్పాటు చేశారు.



మీ కోసం ఫిర్యాదులను ఆన్‌లైన్ చేస్తున్న ప్రత్యేక సిబ్బంది


అర్జీల ఆన్‌లైన్.. పక్కాగా ఏర్పాట్లు

అధికారులు, కలెక్టర్ పరిశీలించిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్ చేసే దిశగా ప్రత్యేకంగా కంప్యూటర్లను కూడా ఏర్పాటుచేశారు. ఇలా గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీదారుల అర్జీల సమస్యల పరిష్కారంతోపాటు జవాబుదారీతనం పెంచే విధంగా చర్యలు తీసుకున్నారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌సెల్‌ను జరిగిన ఈ సన్నివేశాలు నూతనంగా కనిపించాయి. అర్జీదారులు ఆయా శాఖల అధికారుల వద్ద కూర్చొని తమ సమస్యను చెప్పిన వెంటనే సంబంధిత క్షేత్రస్థాయి అధికారులకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలుసుకొంటున్నారు. ఆ వివరాన్ని అర్జీదారునికి చెప్పడమే కాకుండా అందులో పొందుపరుస్తున్నారు. సమస్యల పరిష్కార తీరును పరిశీలించేందుకు ప్రత్యేకంగా అధికారులను కూడా ఏర్పాటు చేశారు. కార్పొరేట్ స్థాయి కార్యాలయాల్లో ఉండేవిధంగా కలెక్టర్ తీసుకున్న చర్యలతో అర్జీదారుల్లో కూడా నమ్మకం ఏర్పడింది.



పంచాయతీలకు స్వర్ణ కవచం

● అక్రమాలకు కళ్లెం ● ప్రజలకు చేరువలో సేవలు



స్వర్ణ పంచాయతీ వెబ్

సంతనూతలపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు, అవినీతికి తావులేకుండా చేయడంతో పాటు ఆస్తుల పరిరక్షణ, ప్రజలకు ఉత్తమసేవలను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌కు రూపకల్పన చేసింది. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులు పక్కదారిపడుతున్న నేపథ్యంలో ప్రజలే నేరుగా ఇంటర్నెట్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించే విధానాన్ని తీసుకొచ్చింది. దీనికి సంబంధించి ఈనెలాఖరుకు సర్వే పూర్తి చేయాలని ఆదేశించడంతో వివరాల సేకరణ పనుల్లో సిబ్బంది తలమునకలై ఉన్నారు. ఈ ప్రక్రియ పూర్తైతే ఇంటర్నెట్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్నుల చెల్లింపు విధానం జనవరి నుంచి అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సంతనూతలపాడు నియోజకవర్గంలో చీమకుర్తి, మద్దిపాడు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాలకు సంబంధించి 87 పంచాయతీల్లో పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ దాదాపు పూర్తైనట్లు అధికారులు తెలిపారు.

ఆదాయ వివరాలు ఇలా ..

పంచాయతీలకు వచ్చే ఆదాయ వనరుల వివరాలను స్వర్ణ కవచం వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటి విస్తీర్ణం, హద్దులు, ఇంటి యజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు, కుళాయి కనెక్షన్ తదితర వివరాలను సేకరిస్తున్నారు. పంచాయతీలకు సంబంధించి చెరువులు, దుకాణాలు (షాపింగ్ కాంప్లెక్సులు), స్థలాల లీజులు, టవర్లు, సెల్ టవర్లు, పరిశ్రమలు, రోజు వారీ వ్యాపారుల నుంచి వసూలు చేసే రశీదు, తదితర ఆదాయ వనరుల వివరాలను పూర్తిస్థాయిలో పొందుపరుస్తున్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు పంచాయతీ సేవలు మరింత చేరువకానున్నాయి. ఇంటిపన్ను చెల్లింపులు, వ్యాపార అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువపత్రాలు, తదితర అన్ని రకాల సేవలు సులభంగా అందనున్నాయి.

అక్రమాలకు తావుండదు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టబోతున్న స్వర్ణ కవచం వెబ్‌సైట్ ద్వారా పంచాయతీల్లో అక్రమాలకు తావుండదు. సేవల్లో పారదర్శకతతో పాటు ప్రజలు ప్రభుత్వానికి పన్నులు, ఇతర ఏమైనా చెల్లించాలంటే ఆన్‌లైన్‌లో స్వర్ణ వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చు. ప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రతి పంచాయతీ వివరాలను సిబ్బంది స్వర్ణ కవచం వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

- డి.సురేష్‌బాబు, ఎంపీడీవో, సంతనూతలపాడు



దొనకొండలో పేరు మార్చకుండా ఉన్న రైతు భరోసా కేంద్రం

...అయినా పేరు మారలేదు!

గ్రామాల్లో రైతులకు సేవలందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. కూటమి అధికారంలోకొచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం జరిగి ఐదు నెలలైనా దొనకొండలో రైతుభరోసా కేంద్రాల పేరు మార్చలేదు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఆరోగ్య సేవలందించేందుకు ఏర్పాటైన భవనాలను వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లుగా గత వైసీపీ ప్రభుత్వం నామకరణం చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం ఆ భవనాలకు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌గా పేరు మార్పు చేసింది. అయినా దొనకొండలో ఆ భవనాలపై వైఎస్సార్ విలేజ్ క్లినిక్ అనే పేరు దర్శనమిస్తోంది. - దొనకొండ, (ఆంధ్రజ్యోతి)



దొనకొండలో పేరు మార్చకుండా ఉన్న వైఎస్సార్ విలేజ్ క్లినిక్

అనన్య ప్రేమభక్తికి తార్కాణం గోదాదేవి

● ఆరంభమైన ధనుర్మాసం ● పలు దేవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు

ఒంగోలు(కల్చరల్), డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే ధనుర్మాసం సోమవారం ప్రారంభమైంది. దీంతో నగరంలోని పలు దేవాలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు శ్రీకారం చుట్టుకున్నాయి. భోగి పండుగ వరకు 30 రోజులపాటు తిరుప్పావై ప్రవచనాలు ఉంటాయి. శ్రీకృష్ణుని మీద అనన్య ప్రేమతో గోదాదేవి రచించిన 30 పాశురాలను రోజుకు ఒక పాశురం చొప్పున ఈ 30 రోజులు భక్తులకు వినిపిస్తారు. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో స్థానిక గాంధీరోడ్డులోని గీతా మందిరంలో సోమవారం ఉదయం ప్రముఖ ప్రవచకులు పొన్నూరి వేంకట శ్రీనివాసులుచే తిరుప్పావై ప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో గీతామందిర భక్తబృంద సభ్యులు కృష్ణ, సురేఖ, మువ్వల సుబ్బారావు, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి, అనిత, రాధ, సీత, శ్రీదేవి తదితరులు పాల్గొని పొన్నూరి వేంకట శ్రీనివాసులును శేషవస్త్రంతో సత్కరించారు. అటు బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలోని గడియారం వారి వీధి అనంత కోదండ రామస్వామి దేవస్థానంలో సైతం తిరుప్పావై ప్రవచనాలు సోమవారం నుంచి ప్రారంభమైనాయి. తితిదే నాలాయిర్ దివ్య ప్రబంధ అధ్యాపకులు భాగవతుల శ్రీనివాస చక్రవర్తి తిరుప్పావై పారాయణ, ప్రవచనం చేశారు.

అన్న క్యాంటీన్‌లో ఆహారం నాణ్యత తనిఖీ

● ఎలాంటి ఇబ్బందీ లేదని వెల్లడించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు అతి తక్కువ ధరకే ఆహారం అదించేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లను ఆహార భద్రత తనిఖీ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఒంగోలులోని అన్న క్యాంటీన్‌లలో అన్నం సరిగా ఉండటం లేదని కొందరు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు నగరంలోని పలు అన్న క్యాంటీన్‌లలో అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. ఈ మేరకు నేరుగా భోజనం చేసి, అందులో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ, అండ్ కంట్రోల్ అధికారి గరికపాటి ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఆహారం తయారీలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. వంట చేసిన అనంతరం వేడిగా ఉండే అన్నంను అలాగే బాక్సుల్లోకి నింపడం ద్వారా ఆవిరి పోకపోవడం వలన కొంత మెత్తగా ఉన్నట్లు తెలిపారు. అయితే వండిన తర్వాత కొద్దిసేపు ఆరేలా చూడాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు రావని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. అంతే తప్ప క్యాంటీన్‌లలో ఇతర ఆహారపదార్థాల తయారీలో ఎలాంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు.



మూసివేసిన గేట్లు దూకి వెళుతున్న క్రీడాకారులు

మినీ స్టేడియం గేట్లు ఎప్పుడూ మూతే..!

● అవస్థలు పడుతున్న క్రీడాకారులు

క్రీడాకారుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన అతి పెద్దదైన ఆనంద్ మినీ స్టేడియానికి వాస్తు దోషం పట్టింది. క్రీడాకారుల కోసం ఆధునిక హంగులతో నిర్మించిన స్టేడియంలోని క్రీడా మైదానంలో ఆటలాడుకునేందుకు క్రీడాకారులకు, వ్యాయామం చేసుకునేందుకు వాకర్స్‌కు అవస్థలు తప్పడం లేదు. స్టేడియానికి తూర్పు వైపు ప్రధాన గేటు పాడైపోయి ఉండగా, దక్షిణం వైపు ఉన్న గేటు మాత్రం ఏళ్లతరబడి తెరుచుకోవడం లేదు. స్టేడియం ప్రారంభించినప్పటి నుంచి ఆ వైపు మూత వేయడంతో లోపలికి వెళ్లేందుకు క్రీడాకారులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే ఇదే విషయాన్ని కొందరు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి (డీఎస్‌డీవో) దృష్టికి తీసుకెళ్లి గేట్లు తీయమని కోరినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అదేమంటే ఆ వైపు గేట్లు తీస్తే డీఎస్‌డీవో ఉద్యోగానికి ఇబ్బంది వస్తుందని ఓ జ్యోతిష్యుడు చెప్పినందుకే ఇలా మూసివేశామని, ఆ విషయాన్ని పలువురు వద్ద ఆ అధికారి నేరుగానే చెప్పినట్లు పలువురు క్రీడాకారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి స్టేడియంకు అన్ని వైపులా ఉన్న గేట్లు తెరిపించి, క్రీడాకారులు లోపలికి వెళ్లే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

ఇంధనం పొదుపు భావితరాలకు వెలుగు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● ఒంగోలులో విద్యుత్ శాఖ సిబ్బంది ర్యాలీ

ఒంగోలు(క్రైం)డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఇంధనం పొదుపు చేసి భావితరాలకు వెలుగు నిద్దాం అని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. సోమవారం జాతీయ ఇంధనపొదుపు వారోత్సవాలను పురస్కరించుకొని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ వద్ద ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రకాశం భవన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానహారంగా ఏర్పడ్డారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలలో విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ రంగమైనా అభివృద్ధి చెందాలంటే విద్యుత్ అవసరం అన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు.అందుకోసం యల్ఈడీ బల్బులు, స్టార్‌రేటెడ్ గృహోపకరణాలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ భవన్ నుంచి నిర్వహించిన ర్యాలీలో ప్లకార్డులు చేబూని పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు ఈకార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈ ఏ.హరిబాబు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

అవీ..ఇవీ



అయ్యప్పస్వామి పడిపూజలో శిద్దా కుటుంబీకులు

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, లక్ష్మీపద్మావతి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఒంగోలు లాయర్‌పేటలోని ఆయన నివాసం వద్ద ఏర్పాటుచేసిన ఈ పడిపూజ కోసం అరటిబోదెలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మండపాలు భక్తులకు కనువిందు చేశాయి. ముందుగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రం నుంచి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని శిద్దా సుధీర్ కుమార్, మన్యం ఫణికుమార్‌లు ఊరేగింపుగా ఒంగోలుకు తీసుకువచ్చారు. అనంతరం వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం గోపాల్ గురుస్వామి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి పాటలు, దేవతా వేషధారణ ప్రదర్శన, పెద్ద కృష్ణ గురుస్వామి బృందం ఆలపించిన అయ్యప్ప పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి.



నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన రాజ్యసభసభ్యులతో రాజ్యసభ చైర్మన్, కేంద్ర మంత్రులు, ఎంపీలు

రాజ్యసభ సభ్యులను అభినందించిన మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అభినందించారు. రాజ్యసభ సభ్యులుగా సోమవారం ప్రమాణస్వీకారం చేసిన బీద మస్తాన్‌రావు, సానా సతీష్ , బీజేపీ నుంచి ఆర్. కృష్ణయ్యలు ప్రమాణస్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులను రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రామ్మోహన్‌నాయుడు, సహచర పార్లమెంట్ సభ్యులు అభినందించారు.



రక్తదాన శిబిరం నిర్వహస్తున్న క్విస్‌ఫార్మసీ సిబ్బంది

క్విస్ ఫార్మసీలో రక్తదానం

ఒంగోలు విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఫార్మసీ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఫార్మసీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ క్రాస్ ఒంగోలు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫార్మసీ, ఫార్మ్‌డీకి చెందిన 40 మంది విద్యార్థులకు రక్తదానం చేశారు. రక్తదానంప్రాణదానంతో సమానమని, అందరిలో అవగాహన కలిగి రక్తం ఇచ్చేందుకు ముందుకు రావాలని ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్ బాబు అన్నారు. రక్తదానం చేయడం వల్ల అనేక ఇబ్బందులు తొలగిపోతాయని రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ కృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు, బి ఫార్మసీ హెచ్‌వోడీ డాక్టర్ రేవతి, డాక్టర్ జాలయ్య, డాక్టర్ అశోక్, స్టెప్ సిబ్బంది రాజా, పావని, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ధనమూర్తి ఉన్నారు.



దివ్యాంగుడి కోసం ఏర్పాటు చేసిన కూల్‌డ్రింక్ దుకాణం

దివ్యాంగుడి జీవనోపాధికి చేయూత

ఒంగోలు(కల్చరల్),డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన దివ్యాంగుడి జీవనోపాధికి స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ చేయూతను అందించింది. గొల్లపూడి శ్రీనివాసరావు రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోగా అయన కుమారుడు రెండు సంవత్సరాల కిందట బ్రెయిన్‌స్ట్రోక్‌తో మరణించాడు. దీంతో జీవనోపాధి భారంగా మారిన శ్రీనివాసరావు ట్రస్ట్ నిర్వాహకుడు షేక్ సర్దార్ బాషను సంప్రదించగా సుమంత్ బొద్దులూరి సాయంతో రూ.38 వేల ఖర్చుతో కూల్‌డ్రింక్, పాన్‌షాపును ఏర్పాటుచేసినట్లు సర్దార్ బాష తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఒకేషనల్ యాజమాన్యం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆంధ్రకేసరి నగర్‌లోని జేకే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా వి. విజయరత్నం, ఉపాధ్యక్షులుగా సూర్య రమేష్, జిల్లా కార్యదర్శి డాక్టర్ నవీన్ చంద్, ఉప కార్యదర్శి ఎ.కిష్టఫర్, కోశాధికారిగా రమణలను ఎన్నుకున్నారు.

సర్వేల పేరుతో సేవలకు డుమ్మా..!

సచివాలయాల్లో కనిపించని సెక్రటరీలు

ఒకటో తేదీ పింఛన్ల పంపిణీకే పరిమితం

ఫీల్డ్ వర్క్‌పేరుతో రోజులతరబడి ఆఫీసులకు రాని సిబ్బంది

ఆంధ్రజ్యోతి విజిట్‌లో వెల్లడి

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పౌర సేవలను పారదర్శకంగా అందించడంతోపాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాల్సిన సచివాలయాలు సిబ్బంది పనితీరుతో ఖాళీగా దర్శనమిస్తున్నాయి. నగరంలో సుమారు 70 సచివాలయాలు ఉండగా, ఒక్కో సచివాలయానికి అడ్మిన్, ప్లానింగ్, శానిటేషన్, వెల్ఫేర్. డిజిటల్ ఆపరేటర్, ఎమినిటీ సెక్రటరీ, మహిళా పోలీస్, వీఆర్వో తోపాటు పలువురు సెక్రటరీలతో కలుపుకుని పది మంది వరకు ఉన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్ల వ్యవస్థతో తాము చేయాల్సిన విధులన్నీ వారిచేత చేయించి, మొక్కుబడి సేవలకు పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థను తొలగించి, అన్నీ సేవలను సచివాలయ సెక్రటరీలకే అప్పగించడంతో పనిచేయడానికి బద్ధకించి మొండికేస్తున్నారు. కొందరు సెక్రటరీలు ఉన్నత ఉద్యోగాల కోసం చదువుకోవాలంటూ సెలవులు పెట్టి వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా, మరి కొందరు ఫీల్డ్ వర్క్ పేరుతో కార్యాలయం ముఖం చూడటమే మానేస్తున్నారు. ఉదయం పదిగంటలకు వచ్చి ముఖహాజరు వేసి వెళ్లిపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పే వారు కరువైపోతున్నారు. సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించగా, దాదాపు అన్నీ సచివాలయాల్లోనూ సిబ్బంది లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఒక్కో సచివాలయంలో మాత్రం సమాధానం చెప్పేందుకు ఒకరు, ఇద్దరు మాత్రం సీట్లలో కనిపించారు. ప్రతి నెలా మొదటి తారీకున పింఛన్ల పంపిణీ రోజు మాత్రం పూర్తిస్థాయిలో విధుల్లో కనిపించే సెక్రటరీలు ఇతర రోజుల్లో మొక్కుబడి సేవలకే పరిమితం అవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి.



విజయనగర్ కాలనీ 47వ సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీ మినహా ఖాళీగా ఉన్న కుర్చీలు

సచివాలయాల మెట్లెక్కని ప్రజలు

ఒంగోలు కార్పొరేషన్‌కు అనుసంధానంగా కొనసాగుతున్న వార్డు సచివాలయాల్లో పౌర సేవలు పట్టించుకునేవారు కరువయ్యారు. వాస్తవానికి వారి జాబ్ చార్ట్ ప్రకారం ఫీల్డ్ వర్క్ ఉదయం 7గంటల నుంచి పదిగంటల లోపు పూర్తి చేసుకుని పదిన్నర తర్వాత కార్యాలయంలో పౌరసేవలకు అందుబాటులో ఉండాలి. పెన్షన్, రేషన్ కార్డు, రెవెన్యూ సేవలు, వీధి లైట్ల సమస్యలు ఇలా ప్రజల నుంచి వచ్చే సమస్యలను వారు సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలి. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే జరగాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం సర్వే పేరుతో సచివాలయాలకు డుమ్మా కొడుతూ ప్రజల సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో రాను రాను సచివాలయ సేవలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుండగా, సచివాలయం మెట్లు ఎక్కేవారే కనిపించడం లేదు.

దీంతో శానిటరీ సెక్రటరీలు పారిశుధ్య పనుల పర్యవేక్షణలో మాత్రమే కనిపిస్తుండగా, ఇతర సెక్రటరీలు ఎప్పుడు వస్తారో ? ఎప్పుడు వెళతారో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇదిలా ఉంచితే ఎప్పుడు వెళ్ళినా సచివాలయాల్లో సెక్రటరీలు అందుబాటులో ఉండకపోవడంతో దాదాపు జనం సచివాలయాలకు వెళ్ళడమే మానేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం మంజూరు చేసే పలు ధ్రువీకరణ పత్రాలకు ప్రయివేట్ ఆన్‌లైన సేవలను ఆశ్రయిస్తున్నట్లుగా స్పష్టమవుతోంది.

సచివాలయాల పనితీరు అధ్వానం

శివప్రసాద్ కాలనీలో ఒకరు మాత్రమే సమయానికి హాజరు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఒంగోలులో సచివాలయాల పనితీరు అధ్వానంగా ఉంది. ఆయా సచివాలయాలకు ఉద్యోగులు చుట్టపు చూపుగా వచ్చిన పోతున్నట్లుగా కనిపించింది. ఒంగోలు నగరంలోని శివప్రసాద్ కాలనీ, గాంధీనగర్ సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా ఈవిషయం బహిర్గతమైంది. సచివాలయాలకు ఉద్యోగులు ఉదయం పది గంటల నుంచి పదిన్నర లోపు వచ్చి ముఖ హాజరు వేయాలి. కానీ శివప్రసాద్ కాలనీ సచివాలయానికి ఒక ఉద్యోగి 10.15 గంటలకు రాగా, మరో ఉద్యోగి 10.27 నిమిషాలకు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరు, ముగ్గురు వచ్చి అక్కడ ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగిపోయారు. కనీసం అక్కడ ప్రభుత్వ కార్యాలయం ఉందనే విషయం కూడా ప్రజలు నమ్మలేని విధంగా ఉంది. 10.40 కి కూడా ఇంకా ఏ ఉద్యోగి అక్కడకు వచ్చిన పరిస్థితి లేదు. ఇక గాంధీనగర్ సచివాలయం అయితే ఒక మహిళా ఉద్యోగి కార్యాలయం తలుపు తీసి బయట ఫోన్‌లో మాట్లాడుకుంటూ కనిపించింది. కార్యాలయంలో ఒక ఉద్యోగి కూడా లేని పరిస్థితి కనిపించింది. సిబ్బంది లేరా అని అడిగితే వస్తారు, సర్వేకు వెళ్లారు అనే సమాధానం చెప్తున్నారే తప్ప ఎందుకు వచ్చారు, సమస్య ఏమిటి అని అడిగే వారు లేకుండా పోయారు. కాగా సచివాలయ పరిధిలో 300 మీటర్లలో ఎక్కడి నుంచైనా ముఖ హాజరు వేసుకొనే అవకాశం ఉండటంతో ఆ పరిధిలోని సంబంధిత ఉద్యోగులు ముఖ హాజరువేసి తిరిగి వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఉపాధి పనుల లక్ష్యాలను పూర్తిచేయాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఉపాధి పనులపై నిరంతరం పర్యవేక్షణతో పాటు కూలీలకు సరాసరి వేతనం ఎక్కువ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రధానంగా ఎంపీడీవోలు, ఏపీడీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉపాధి పనులను పర్యవేక్షించాలన్నారు. కేటాయించిన మేరకు ఉపాధి పనుల లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి పథకం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫారంపాండ్ నిర్మాణాలను కూడా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 3,800 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2,003 పూరి అయ్యాయని, మిగిలిన వాటిని కూడా సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు సంబంధించి నూరుశాతం గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు నూరుశాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు శ్రీనివాసప్రసాద్, చిరంజీవి,జోసఫ్ కుమార్, వెంకట నాయుడు, బాల శంకరరావు, శ్రీనివాసరావు, రవికుమార్, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

మీకోసంలో వచ్చేఅర్జీలను సహేతుకంగా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసంలో వచ్చే అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రీవెన్స్‌సెల్‌లో 267 అర్జీలు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. మొక్కుబడి సమాధానాలు చెప్పి అర్జీదారులను పలుమార్లు కార్యాలయాలచుట్టూ తిప్పుకుంటే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ కూడా సహేతుకంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేత

ఒంగోలుకు చెందిన షేక్ బాషా అనే దివ్యాంగుడికి కలెక్టర్ తమీమ్ అన్సారియా మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో బాషా మూడు చక్రాల సైకిల్ ఇవ్వాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు .దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత శాఖ అధికారి అర్చనను మూడు చక్రాల సైకిల్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో వెంటనే బాషాకు మూడు చక్రాల సైకిల్‌ను ఏర్పాటు చేయగా దానిని కలెక్టర్ అన్సారియా అందజేశారు.

మోసగాళ్ల పై చర్యలు

ప్రజాఫిర్యాదుల వేదికలో ఎస్పీ

ఒంగోలు(క్రైం)డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్‌దామోదర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 73 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని మోసం చేసిన కేసులు, నగదు తీసుకొని సమాధానం చెప్పకుండా బెదిరించడం లాంటి కేసులు వీలైనంత వేగంగా చట్టానికి లోబడి పరిష్కరించాలని సూచించారు.

ఉద్యోగం పేరిట మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నెల్లూరు జిల్లా కావలి కచేరి మెట్టుకు చెందిన వ్యక్తి రూ. 1.10 లక్షలు నగదు తీసుకొని మోసం చేశాడని పేర్నమిట్టకు చెందిన యువకుడు ఫిర్యాదు చేశాడు.

టంగుటూరు మండలం కాకుటూరు పాలెంనకు చెందిన ఓ రైతు పచ్చాకు పనిచేయించుకొని రూ.4.5 లక్షలు కూలీ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడని కొరిశపాడు మండలం రావినూతలకు చెందిన పచ్చాకు మేస్త్రి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్ బాబు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఎస్సైలు రజియా సుల్తాన్, ప్రభాకరరెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రజాఫిర్యాదుల వేదికలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

రూ.6 కోట్లతో కాకతీయ సేవాసమాఖ్య బాలికల వసతి గృహం నిర్మాణం

ఒంగోలు(రూరల్)డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రూ. 6కోట్ల రూపాయలతో కాకతీయ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో బాలికల వసతి గృహనిర్మాణం చేపట్టనున్నామని ఆసేవాసమాఖ్య రాష్ట్రకార్యదర్శి బెజవాడ వెంకటరావు అన్నారు.ఒంగోలు నగరం దక్షిణ బైపాస్ రోడ్డులోని ఆస్థానా రెస్టారెంట్‌లో సోమవారం వసతి గృహనిర్మాణానికి సంబంధించి భూమిపూజ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దక్షిణ బైపాస్ రోడు కొత్త మామిడిపాలెం పరిధిలో ఈ నెల 22వతేదీ ఉదయం 7.45 గంటలకు భూమిపూజ జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాలోనిఎమ్మెల్యేలతో పాటు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, నాయకులు పాల్గొంటారని తెలిపారు.

వీధిలైట్ల ఏర్పాటు

ఒంగోలు విద్య, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భాగ్యనగర్‌లోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్సీఎస్టీ హాస్టల్ పరిసరప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ స్తంభాలు, కేబుల్ లైన్లు, వీధి దీపాలకు ఎల్ఈడీ లైట్లు మంగళవారం ఏర్పాటు చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ, విద్యుత్‌శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ లైట్లు వేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి కళాశాల ప్రిన్సిపాల్ కల్యాణితో పాటు ఇతర అధ్యాపకులు తీసుకెళ్లారు.దీంతో ఎమ్మెల్యేచొరవ తీసుకొని వెంటనే మేయర్‌గంగాడ సుజాత, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, విద్యుత్ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు,డీఈ హరిబాబు, ఏఈ వెంకటేశ్వర్లు సహకారంతో ఈ ప్రక్రియ జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యుత్ లైట్లు వేయించిన ఎమ్మెల్యే, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు సచివాలయం- 2లో 12 గంటలకు అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

సచివాలయాల్లో సమయపాలన శూన్యం

- ఇష్టానుసారంగా విధులకు హాజరు

మద్దిపాడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. మద్దిపాడు మండలం నేలటూరు, పెద్దకొత్తపల్లి, వెల్లంపల్లి సచివాలయాల్లో సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ చేసి పరిశీలన చేయగా పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెద్దకొత్తపల్లి, నేలటూరు సచివాలయాల్లో ప్రజలకు సక్రమంగా సేవలు అందటం లేదు. కొంతమంది ఉద్యోగులు రెగ్యులర్‌గా హాజరవుతున్నా, మరికొందరు హాజరు కోసమే వస్తున్నారు. సోమవారం వెల్లంపల్లి సచివాలయంలో 10.30గంటలకు వీఆర్వో పూజిత, వెటర్నరీ అసిస్టెంట్ నరసింహారావు, ఎనర్జీ అసిస్టెంట్ చెన్నకేశవులు, వెల్ఫేర్ అసిస్టెంట్ యామిని, హెల్త్ అసిస్టెంట్ శ్రీదేవి హాజరు కాగా, డిజిటల్ అసిస్టెంట్, పోలీస్ అసిస్టెంట్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామ సచివాలయంలో ఉద్యోగులు ఉదయం, మధ్యాహ్నం సాయంత్రం బయోమెట్రిక్ వేయాలి. కొందరు సాకులు చెబుతూ తిరిగి రావడంలేదు. ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు ఉన్నారు. మహిళా పోలీస్‌కు జాబ్‌చార్ట్ లేదు. ప్లానింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులకు వెళ్లారు. ఇక నేలటూరు, పెద్దకొత్తపల్లి సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పలు సమస్యలపై వచ్చిన అర్జీదారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. మద్దిపాడు మండలంలో శిక్షణ కార్యక్రమానికి హాజరైనట్లు సచివాలయ ఉద్యోగులు తెలిపారు.

జాడ లేని అధికారులు

నాగులుప్పలపాడు : మేజర్ గ్రామ పంచాయతీ ఉప్పుగుండూరు - 1 సచివాలయంలో వీఆర్వో, మరో ఇద్దరు అధికారులు తప్ప మిగిలిన వారి జాడలేదు. సచివాలయం - 2 లో వీఆర్వో రెవెన్యూ సదస్సుకు వెళ్లారు.మరో ఇద్దరు తప్ప మిగిలిన వారు కనిపించలేదు. నాగులుప్పలపాడు సచివాలయంలో వీఆర్వో రెవెన్యూ సదస్సుకు వెళ్లినట్లు అక్కడున్న ఆశ కార్యకర్తలు తెలిపారు.వారు తప్ప మిగిలిన సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అదే కోవలో ఈదుమూడి,చదలవాడ,కనపర్తి,బి.నిడమానూరు,తిమ్మసముద్రం,మద్దిరాలపాడు తదితర గ్రామాలలో సచివాలయ అధికారులు,సిబ్బంది కార్యాలయాలలో కనిపించలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు.

సర్వేలతో సరి

చీమకుర్తి : ఎంతో ఆశతో తమ సమస్యల పరిష్కారం కోసం సచివాలాయానికి వచ్చిన ప్రజలు కనీసం సంబంధిత ఉద్యోగి కనపడకపోవటంతో ఉసూరుమంటూ వెనక్కి వెళ్తున్నారు.ఎక్కడికి వెళ్లారని అడిగితే సర్వేలకు వెళ్లారని,ట్రైనింగ్‌కి వెళ్లారని జవాబు ఇస్తున్నారు.సచివాలయంలో కీలకమైన పోస్టులు భర్తీకి నోచుకోక ఖాళీగా ఉన్నాయి.ఈ అంశాలన్ని సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో తారసపడ్డాయి. చంద్రపాడు సచివాలయంలో పదకొండు మంది ఉద్యోగులుండగా వారిలో కేవలం మహిళా పోలీస్ మాత్రమే సచివాలయలో ఉన్నారు.వీఆర్ఓ,ఎనర్జి అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా మిగిలిన వారు శిక్షణ నిమిత్తం చీమకుర్తికి వెళ్లారు. చీమకుర్తి పట్టణంలోని ఏడో వార్డు సచివాలయంలో ఒకే ఒక్క ఉద్యోగి డేటా ప్రాసెసింగ్ సెక్రటరి సేవలందిస్తు కనిపించారు. మిగతా ఉద్యోగులు సర్వేకు, శిక్షణకు వెళ్లారు.



ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న చంద్రపాడు సచివాలయం

అస్తవ్యస్తంగా సచివాలయ పాలన

ఒంగోలు(రూరల్) : మండలంలోని మండవవారి పాలెంలో సచివాలయ పాలన అస్తవ్యస్తంగా ఉంది. సోమవారం సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. కొందరు ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే శిక్షణకు వెళ్లగా మరికొందరు తాపీగా విధులకు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి ఆలస్యంగా రావటంలో కార్యాలయ ఉద్యోగులు కూడా వారి ఇష్టం వచ్చినప్పుడు మాత్రమే వస్తున్న పరిస్థితి కనిపించింది.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస ఆరంభపూజలు

చీమకుర్తి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఆరంబ పూజలు సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.పట్టణంలోని హరిహరక్షేత్రంలో జరిగిన విశేషపూజల్లో శిద్దా లక్ష్మీపద్మావతి,శిద్దా పాండురంగారావు దంపతులు పాల్గొన్నారు.మండలంలోని కె.అగ్రహారంలో వేంచేసి ఉన్న ప్రసన్న వేంకేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసపూజలు ప్రారంభించారు.శిద్దా భరత్ కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేశారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. వినోదరాయునిపాలెం, దాసరివారిపాలెం గ్రామాలలో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తెలిపారు. కాగా సదస్సులో వివిధ రెవెన్యూ సమస్యలపై 39 అర్జీలు అందినట్లు తెలిపారు.

ఘనంగా క్యాండిల్స్ ర్యాలీ

ఒంగోలు(రూరల్)డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావన గార్డెన్స్ కాలనీలో సోమవారం రాత్రి క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ చైతన్య ప్రభుకుమార్ మాట్లాడుతూ ఏసుప్రభు బోధనలు ప్రతిఒక్కరూ ఆచరించాలన్నారు.

క్రైం సమాచారం

బాలుడిని అపహరించిన ఇరువురి అరెస్టు

ఒంగోలు(క్రైం)డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): పదినెలల బాలుడిని అపహరించిన ఇరువురిని అరెస్టు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం త్రోవగుంట సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న స్థానిక బాలాజీనగర్‌కు చెందిన దయామణి, మణికంఠలను అదుపులోకి తీసుకోని విచారించగా వారు పదినెలల బాలుడిని అపహరించినట్లు అంగీకరించారు. గుడ్లూరులోని మామిడి తోటలలో పోలీసులను చూసి బాలుడిని వదిలి పరారీ అయినట్లు తెలిపారు. దయామణికి ముగ్గురు పిల్లలు, భర్త ఉన్నారు. అయితే భర్తను వదిలేసిన దయామణి మణికంఠతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ స్థానిక ప్రగతి కాలనీలోని ఓ ఇంటిలో పనులు చేస్తూ జీవిస్తోంది. అ పక్కనే ఉన్న పదినెలల బాబును అపహరించాలని చాల కాలంగా పథకం రూపొందించిన దయామణి ఈనెల 14 న అపహరించుకొని ఎలాంటి ఆధారాలు దొరకకుండా ముందు నుంచే జాగ్రత్త పడి మణికంఠను వెంట బెట్టుకొని పరారీ అయ్యారు. వారి ఇరువురినీ విచారించి ,బాలుడిని అపహరించినట్లు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని,న్యాయ్యమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాల తీగ చోరీపై ఫిర్యాదు

సంతనూతలపాడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలపై అల్యూమినియం వైరు చోరీపై ఆదివారం రాత్రి వాకా సంజీవరెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఒంగోలు మండలం వెంగముక్కలపాలెంకు చెందిన వాకా సంజీవరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఉంటాడు. దీనిలో భాగంగా మంగమూరులో సర్వేనెంబరు 197లో వెంచర్ వేసి ప్లాట్‌లకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేయించాడు. ఆదివారం మంగమూరులో తను వేసిన వెంచర్ వద్దకు వచ్చి చూడగా స్తంభాలపై ఉన్న సుమారు రూ.లక్షరూపాయలు విలువచేసే అల్యూమినియం వైరు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆదివారం రాత్రి సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం సమాచారం

అప్రమత్తతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

● డీఎస్పీ నాగరాజు



ఆటోలకు స్టిక్కర్లు అంటించి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మార్కాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే అప్రమత్తత ఒక్కటే పరిష్కారమార్గం అని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆటోలకు స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కొద్ది రోజులుగా సైబర్ నేరాలు తీవ్రమయ్యాయన్నారు. చివరికి పోలీసుల ఫోన్‌లను కూడా హ్యాక్ చేసి సైబర్ నేరగాళ్లు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. చాలామంది అవగాహన లేమితోనే సైబర్ దాడులకు గురవుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ సైబర్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. నేరగాళ్లు పలుమార్గాల ద్వారా ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తుంటారన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ఆటోలపై స్టిక్కర్లు ఏర్పాటు చేసి సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసులు, ఆటోడ్రైవర్లు అందరూ కలిసి స్థానిక కంభం బస్టాండ్ నుంచి దోర్నాల బస్టాండ్, సెవెన్‌హిల్స్, రాధాటాకీస్, తూర్పువీధి, రథంబజార్, మెయిన్‌బజార్ మీదుగా గడియారస్తంభం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ పి.సుబ్బారావు, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, రాజమోహనరావు, అంకమ్మరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అందె నాసరయ్య, ఖాశీం, ఏలూరి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మార్కాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లం ఊటను పెద్దారవీడు పోలీసులు సోమవారం ధ్వంసం చేశారు. ఎస్సై పి.అనిల్‌కుమార్ కథనం మేరకు మండలంలోని కలనూతల గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమా చారం పోలీసులకు అందింది. దీంతో అప్రమత్తమైన పెద్దారవీడు పోలీసులు గ్రామంలోని అటవీ సమీపంలో నాటుసారా తయారీ కోసం సిద్ధం చేసిన బెల్లం ఊటను గుర్తించారు. సుమారు 600 లీటర్ల మేర ఉన్న ఊటను సిబ్బంది ధ్వంసం చేశారు. గతంలో రెండుసార్లు ఈ గ్రామంలోనే 800 లీటర్ల మేర బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్‌కుమార్ మాట్లాడుతూ అటవీ సమీప గ్రామాల్లో ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. నిఘా పెంచి తయారీదారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌బీ ఏఎస్సై మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొమరోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని యర్రపల్లి సమీపంలోని లక్ష్మీదేవి గుడి సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకొంది. సోమవారం రాత్రి ఓ వ్యక్తి మోటారుసైకిల్‌పై కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలో కడప జిల్లా పోరుమామిళ్ల వెళుతున్నాడు. ఈ క్రమంలో స్థానిక లక్ష్మీదేవి గుడి సమీపంలో వృద్ధుడు (75)ను ఢీకొన్నాడు. దీంతో వృద్ధుడు అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న కొమరోలు ఎస్సై వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని విచారిస్తున్నాడు. మోటారుసైకిలిస్టు కూడా గాయపడడంతో ఆయన్ను గిద్దలూరు ఆస్పత్రికి తరలించినట్లు ప్రాథమికంగా తెలిసింది. ఇక మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. తెల్లపంచె, తెల్లచొక్కా వేసుకుని ఉన్నాడని పోలీసులు వివరించారు.

చుట్టపు చూపుగా వస్తూ.. ఇళ్లను దోచేస్తూ

● గుర్రపుశాల గ్రామంలో చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

● వివరాలు వెల్లడించిన సీఐ ప్రభాకరరావు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్తగారి ఊరికి వెళ్లి ఆ ఊరిలో తాళాలు వేసిన ఇళ్లలో చోరీ చేసిన దొంగను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సోమవారం వివరాలు సీఐ సీహెచ్.ప్రభాకరరావు వివరాలు వెల్లడించాడు. మండలంలోని కొలుకుల గ్రామానికి చెందిన ముండ్ల రామయ్య గుర్రపుశాలకు చెందిన యువతిని నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలోనే స్థానిక ఎస్సీ పాలెం కాలనీకి చెందిన కుటుంబాలు పనుల నిమిత్తం హైదరాబాదు, కొండపి ఇతర ప్రాంతాలకు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. దీంతో కాలనీలో తాళాలు వేసిన నివాసాలను లక్ష్యంగా చేసుకొని నిందితుడు రామయ్య వారం వ్యవధిలో వరసగా 12 నివాసాల్లో చోరీ చేశాడు. చుట్టుపక్కల నివాసం ఉండే వారు గమనించి నవంబరు 29న పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ సిబ్బందితో ఎస్ఐ పి.చౌడయ్యలు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. బాధితుడు ఏసోబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు రామయ్య ఈ చోరీలకు పాల్పడినట్లు తేలడంతో కొలుకుల రోడ్డులో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి రూ.6.74లక్షలు రికవరీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి ఇలాంటి పనులు చేస్తుంటాడని విచారణలో తెలినట్లు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ ఎస్సై బాబుకు అంత్యక్రియలు



మృతిచెందిన బాబుకు నివాళి అర్పిస్తున్న ఎస్సై

కొమరోలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పొట్టిపల్లి గ్రామానికి చెందిన బైళ్ల బాబు జమ్ముకాశ్మీర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ ఎస్సైగా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతిచెందారు. మృతదేహాన్ని స్వగ్రామమైన కొమరోలు మండలంలోని పొట్టిపల్లి గ్రామానికి తీసుకొచ్చి ప్రభుత్వ లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో భాగంగా స్థానిక ఎస్సై వెంకటేశ్వరనాయక్ పూలమాల వేసి పోలీసు గౌరవ వందనం చేశారు. మృతిచెందిన బాబుకు భార్యా, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సమీక్షలు, సర్వేలతో బిజీ!

● సచివాలయాల్లో కనిపించని సిబ్బంది ● ఖాళీ కుర్చీలతో వెలవెల ● ఆంధ్రజ్యోతి విజిట్‌లో వెల్లడి



మార్కాపురం సచివాలయం-17లో 11 గంటల సమయంలో ఖాళీ కుర్చీలు

మార్కాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సచివాలయాల్లో ఉద్యోగులు సర్వేలు, సమీక్షల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారు. ఒక్కో సచివాలయంలో పదిమంది ఉద్యోగులు పనిచేస్తున్నా వారిలో ఒకరిద్దరు మినహా మిగిలిన వారు ఏదో ఒక సాకు చూపి కార్యాలయానికి రావడం లేదు. ఉదయం వచ్చి రిజిష్టర్ సంతకాలు చేసి వెళ్లిన వాళ్లు మళ్లీ మరుసటి రోజు ఉదయం మాత్రమే విధులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈ, హౌస్‌హోల్డ్ జియో ట్యాగ్, మిస్సింగ్ సిటిజన్ సర్వేల విధుల్లో కొందరు ఉన్నారు. మరికొందరు శిక్షణల పేరుతో సచివాలయాలకు దూరంగా ఉంటున్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని 19, 20 సచివాలయాలను పరిశీలిస్తే ఒకదాంట్లో ఇద్దరు, మరొకదాంట్లో నలుగురు మాత్రమే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజలు ఎక్కువగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తిరుగుతున్నారు. కొందరు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వాళ్లు కూడా 1బీ, అడంగల్‌ల కోసం పట్టణంలోని సచివాలయాలకు వస్తున్నారు. మరికొందరు ఆధార్‌లో సవరణల కోసం కూడా సచివాలయాల వద్దకు వస్తున్నారు. మొత్తంగా సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా విధుల్లో ఉండక అవసరార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇద్దరే హాజరు

బేస్తవారపేట : మండలంలోని సచివాలయం-2ను 'ఆంధ్రజ్యోతి' సోమవారం ఉదయం విజిట్ చేయగా 10.30 గంటల వరకు తాళాలు తీయలేదు. ఆ సమయంలో వీఆర్వో ఇండ్లా శేఖర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే హాజరయ్యారు. ఏఎన్ఎం, మత్స్యశాఖ, సర్వేయర్ ఫీల్డ్‌కు వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. సిబ్బంది లేకపోవడంతో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఆధార్‌కార్డుల సవరణల కోసం



ఆధార్‌కార్డులో సవరణల కోసం వేచి ఉన్న ప్రజలు

కంభం : కంభం-2, కందులాపురం-3 సచివాలయాలలో సిబ్బంది 10.30 గంటలకు కార్యాలయానికి వచ్చారు. కందులాపురం-3లో ఆధార్‌కార్డు అప్‌లోడ్ చేసుకునేందుకు డిజిటల్ అసిస్టెంట్ వద్ద ప్రజలు క్యూలో నిలబడి కనిపించారు. కంభం-2 సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్‌వోలు మినహా మిగిలిన సిబ్బంది ఉన్నారు.

గిద్దలూరు : పట్టణంలోని 9వ సచివాలయాన్ని, నరవ గ్రామంలోని సచివాలయాన్ని సోమవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలోని 9వ సచివాలయంలో ఉదయం 11 గంటలకు సచివాలయ అడ్మిన్ రాగా వీఆర్‌వో కనిపించలేదు. 11 గంటలకు వచ్చిన అడ్మిన్‌ను ఈ విషయంగా ప్రశ్నించగా తహసీల్దార్ కార్యాలయంలోనే వీఆర్‌వో ఉంటున్నారన్నారు. దీంతో ప్రజలు క్యాస్ట్, ఇన్‌కం, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

త్రిపురాంతకం : గ్రామ సచివాలయాల్లో సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడం పరిపాటిగా మారింది. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సచివాలయాల విజిట్‌లో త్రిపురాంతకం-2 సచివాలయాన్ని పరిశీలించగా 10.30 గంటలకు గ్రామ సర్వేయరు, వీఆర్వో మాత్రమే హాజరయ్యారు. 10.45కు డిజిటల్ అసిస్టెంట్, హార్టికల్చరల్ అసిస్టెంట్ హాజరయ్యారు. మిగిలిన సిబ్బంది సెలవులో ఉన్నారు. కాగా పలు రకాల పనులు, ధ్రువీకరణ పత్రాల పనుల కోసం వచ్చిన ప్రజల నుంచి వీఆర్వో దరఖాస్తులు స్వీకరించారు. కాగా సచివాలయం-1లో మాత్రం సిబ్బంది అంతా సమయానికే విధులకు హాజరయ్యారు.

11 గంటలకు కనిపించని అధికారులు



వేములకోటలో 11 గంటలకు ఖాళీగా ఉన్న కుర్చీలు

మార్కాపురం రూరల్ : మండలంలోని వేమలకోట 1, చింతగుంట్ల, కోలభీమునిపాడు గ్రామ సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' సోమవారం విజిట్ చేసింది. వేమలకోట-1వ సచివాలయాన్ని విజిట్ చేసిన 11 గంటల సమయానికి సచివాలయంలో ఒక్క అధికారి కూడా తమ విధులకు హాజరుకాలేదు. ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సచివాలయం ప్రక్కన ఉన్న విలేజ్ క్లినిక్ లో పనిచేసే వైద్య సిబ్బంది మాత్రమే ఉన్నారు. వేమలకోట పంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్ సర్వే నిమిత్తం గ్రామంలోని వెళ్లినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సర్వేయర్ ఫీల్డ్‌కు ఉదయాన్నే సచివాలయానికి వచ్చి సంతకం చేసి సమయంలో ఫీల్డ్‌కు వెళ్లినట్లు తెలిపారు. చింతగుంట్ల గ్రామంలో ఉన్న సచివాలయాన్ని విజిట్ చేయగా అక్కడ ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌లు తమ విధులకు హజరయ్యారు. కోలభీమునిపాడు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే తమ విధులకు హాజరయ్యారు. మండల స్థాయి అధికారిని వివరణ కోరగా కొంత మంది ఉద్యోగులు శిక్షణలో ఉన్నట్లు తెలిపారు.

ఎప్పుడు వస్తారో..ఎప్పుడు పోతారో

మార్కాపురం వన్‌టౌన్ : సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉండగా, వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు రారో తెలియని పరిస్థితి నెలకొంది. మార్కాపురంలో పలు సచివాలయాల్లో సిబ్బంది కార్యా లయాలకు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లోపమే సచివాలయాల దుస్థితికి కారణం. మార్కాపురం పట్టణంలోని తూర్పు వీధిలోని 4వ సచివాలయం సర్వేల పేరుతో తాళం వేశారు. 13వ సచివాలయంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ మహిళా పోలీస్, ఇమ్యూనిటీ సెక్రటరీ మాత్రమే విధులకు హాజరయ్యారు. సచివాలయం అడ్మిన్, శానిటరీ సెక్రటరీ నెల నుంచి సెలవుల్లో ఉన్నారు. షోకాజ్ నోటీసులు, మెమోలు జారీ చేసినా హాజరు కాకపోవడం గమనార్హం. మినా మస్జీద్ సమీపంలోని 17, 18 సచివాలయాలలో 11 గంటలు దాటినా హాజరు కాలేదు. దీంతో వివిధ పనులకు వచ్చిన ప్రజలు వేచి ఉన్నారు.

ఇద్దరు అధికారులే హాజరు



సీతానాగులవరంలో విధుల్లో ఉన్న సిబ్బంది

తర్లుపాడు : తర్లుపాడు సచివాలయంలో ఉదయం 10.45 గంటలకు మహిళా పోలీస్, ఏఎన్ఎం మాత్రమే సచివాలయంలో ఉండగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఫీల్డ్‌కు వెళ్లగా పంచాయతీ కార్యదర్శి, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఎంపీడీవో కార్యాలయంలో మీటింగ్‌కు వెళ్లినట్లు తెలిపారు. మిగతా సిబ్బంది గురించి తమకు తెలియదని సమాధానం ఇచ్చారు. సీతానాగులవరం సచివాలయంలో కూడా ఉదయం 11.15గంటలకు మహిళా పోలీస్, ఏఎన్ఎం మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇక్కడ కూడా పంచాయతీ కార్యదర్శి, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు మీటింగ్‌కు వెళ్లినట్లు తెలిసింది. మిగతా సిబ్బంది ఎప్పుడు వస్తారో, పోతారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది.

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

కొనకనమిట్ల : మండలంలోని చినారికట్ల, సిద్ధవరం గ్రామాల్లోని సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. అయితే చినారికట్ల గ్రామంలోని సచివాలయం ఉదయం 10.20కి తాళలాలు వేసి ఉంది. 10.30కి మహిళా పోలీస్ వచ్చి సచివాలయం తాళాలు తీశారు. వెంటనే డిజిటల్ అసిస్టెంట్ హాజరయ్యారు. మిగిలిన సిబ్బంది గురించి ఆరాతీయగా వస్తున్నారని సమాదానం చెప్పారు. మధ్యాహ్నం సమయానికి వెల్ఫేర్ అసిస్టెంట్ విధులకు హాజరయ్యా రు. పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ఇన్‌చార్జ్ కావడంతో హాజరు కాలేదు. గ్రామ సర్వేయర్ సెలవులో ఉన్నారు. అదేవిధంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ ఫీల్డ్ విజిట్‌లో ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఎంపీడీవో ఆఫీస్‌లో మీటింగ్‌కు వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. సిద్ధవరం సచివాలయంలో సాయంత్రం 4.20 గంటలకు అగ్రికల్చర్ అసిస్టెంట్ గంగయ్య మాత్రమే ఉన్నారు. మిగిలిన సిబ్బంది లేక ఖాళీ కుర్చీలు దర్శనం ఇచ్చాయి.

ఖాళీ కుర్చీలను దర్శించాల్సిందే



నరసాయపాలెంలో సెల్‌చూసుకుంటున్న డిజిటల్ అసిస్టెంట్

ఎర్రగొండపాలెం రూరల్ : సచివాలయంలో సిబ్బంది లేక వెలవెలబోతూ ఖాళీ కుర్చీలు దర్శనం ఇస్తున్నాయి. సోమవారం మండలంలోని నర్సాయిపాలెంలో గ్రామంలోని సచివాలయాన్ని విజిట్ చేసిన సమయంలో ఖాళీ కుర్చీలే కనిపించాయి. డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే కార్యాలయంలో ఉన్నాడు. సిబ్బంది వివరాలను అడగగా పంచాయితీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారని తెలిపారు. అలాగే మహిళ పోలీసు, సర్వేయర్‌లు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణకు వెళ్లారు. వీఆర్‌వో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు.

పుల్లలచెరువు : మండలంలోని సచివాలయం ఉద్యోగులు ప్రభుత్వ శిక్షణ కార్యక్రమానికి వెళ్లారు. దీంతో ప్రజలు వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శి కోసం వివిధ పనులను వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' మర్రివేముల గ్రామ సచివాలయాలను 11 గంటలకు విజిట్ చేయగా డిజిటల్ అసిస్టెంట్ మినహా మిగిలిన అధికారులు లేరు. పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండగా, మిగిలిన అధికారులు పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణకు హాజరయ్యారని ఎంపీడీవో వసంతరావు నాయక్ తెలిపారు.

పొదిలి: మండలంలో మొత్తం 16 సచివాలయాలు ఉండగా, ప్రభుత్వం సమయం ఉదయం 10గంటలకు అధికారికంగా ప్రతి ఉద్యోగి విధులకు హాజరు కావాలి అయితే కొంతమంది సచివాలయ సిబ్బంది 11 నుండి 11.30 గంటలకు కూడా హాజరు కావడం లేదు. సచివాలయానికి వచ్చిన ప్రజలు ఇదేమిటని ప్రశ్నించినా ప్రభుత్వం రకరకాల సర్వేలు లాంటివి పెట్టి తమను ఒత్తిడి పెడుతోందని చెబుతూ తప్పుకుంటున్నారు.





ఉదయం 10.20కి తాళం వేసిన చినారికట్ల సచివాలయం, బేస్తవారిపేటలో ఇద్దరే ఉద్యోగులు ఇలా

ప్రభుత్వ ఆస్తులను నష్టపరిస్తే సహించం

సచివాలయ ప్రారంభ సభలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



సచివాలయం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్తులను నష్టపరిస్తే చూస్తూ ఉరుకునేది లేదని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని సూరవారిపల్లి-బాదినేనిపల్లి గ్రామాల మధ్య చాలాకాలంగా ప్రారంభానికి నోచుకోని సూరవారిపల్లి సచివాలయం భవనాలను సోమవారం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలసిరావాలని పిలుపునిచ్చారు. గతంలో దురుద్దేశ్యపూర్వకంగా సూరవారిపల్లి సచివాలయాన్ని నిర్మించినా ప్రారంభించలేదన్నారు. సూరవారిపల్లి, బాదినేనిపల్లి గ్రామ పంచాయతీలు తన సొంత గ్రామాలుగా భావించి గతంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో 2027 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేసి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సాగునీటి కష్టాలను తీరుస్తామన్నారు. కొమరోలు పట్టణానికి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చొరవతో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాంభించిన సచివాలయానికి ప్రహరీగోడను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. నియోజక వర్గంలో వర్షాలకు దెబ్బతిన్న పైర్లను గుర్తించాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మండలంలో రూ.15 కోట్లతో సిమెంటు రోడ్లు వేసి నిర్ణిత సమయం లో పూర్తి నాణ్యతతో పూర్తి చేయించిన డీఈ సుబ్బారెడ్డిని అభినందించారు. బాదినేనిపల్లి గ్రామానికి సంబంధించి ఎంపీపీ అడిగిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ కామూరి అమూల్య మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా వెనుకబడ్డ కొమరోలు మండలాన్ని ప్రత్యేకంగా చూసి ఆదుకోవాలన్నారు. పాయలపల్లి గ్రామానికి సరైన రహదారిలేక గ్రామంలోని పిల్లలు విద్యకు దూరమవుతన్నారని ఆగ్రామానికి రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏడీ బాలాజీనాయక్, డీఈ సుబ్బారెడ్డి, ఈవోపీఆర్‌డీ బ్రహ్మయ్య, ఏవో రాజశ్రీ, ఎంఈవో బోర్రా వెంకటరత్నం, వైద్యాధికారులు చైతన్యదీపక్, రజియా సుల్తానా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ బోయిళ్ల సుమిత్ర, టీడీపీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, నాయకులు బిజ్జాల తిరుమలరెడ్డి, వెంకట్రామిరెడ్డి, పులకుర్తి వెంకటేశ్వర్లు, బాలిరెడ్డి, ముత్తముల యల్లారెడ్డి, యడవల్లి బాదరయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలో యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంటును టీడీపీ నాయకులు అంబవరపు శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, నిత్యం ప్రాక్టీస్ చేయడం ద్వారా, శిక్షణ పొందడం వలన నైపుణ్యం ఉన్న ఆటగాళ్లగా ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ పాలుగుళ్ల నారాయణరెడ్డి, వైస్‌చైర్మన్ షేక్ గఫూర్, టీడీపీ బీసీ సెల్ ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యకళాశాల నిర్మాణ పనులు పునఃప్రారంభించాలి

● వైద్యుల బదిలీలను నిలుపుదల చేయాలి

● ప్రభుత్వానికి సీపీఎం నాయకుల వినతి



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

మార్కాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో నిర్మాణంలోవున్న వైద్యకళాశాల పనులను నిలివేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య అన్నారు. వైద్యకళాశాల పనులు ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఇప్పటికే సరైన వైద్యసదుపాయాలు లేక పశ్చిమ ప్రకాశ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. జబ్బు వస్తే వైద్యం చేయించుకోవడానికి వందల కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రస్తుతం నిర్మాణంలో కళాశాల పనులు నిలిపివేయడం సమంజసం కాదన్నారు. కళాశాలకు కేటాయించిన వైద్యులను కూడా 32 మందిని ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిందన్నారు. ఈ చర్యలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రభుత్వ హయాం లో మంజూరై నిర్మాణంలో ఉన్న అన్ని వైద్య కళాశాలలను ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించాలని యోచిస్తోందన్నారు. దీని వలన పేదల కు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అనం తరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. కార్య క్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య, నాయకులు పి.రూబెన్, జవ్వాజి రాజు, షేక్ నన్నేషా, జె.నాగరాజు, కాశయ్య, వై.సురేష్, కట్టా సుబ్బారావు, పొదిలి మల్లిఖార్జున, వై.ఏసేబు తదితరులు పాల్గొన్నారు.

20, 21 తేదీలలో మహిళల కబడ్డీ పోటీలు

గిద్దలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఈనెల 20, 21 తేదీలలో రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పోటీల కమిటీ అధ్యక్షులు కడియం శేషగిరిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మినేటి వెంకటేశ్వర్లు, కమిటీ కన్వీనర్ జాషువా డానియేలు ఒక ప్రకటనలో తెలిపారు. ముండ్లపాడులోని సెయింట్ జాకబ్స్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో జరుగనున్న ఈ పోటీల్లో మొదటి విజేతకు రూ.40వేలు, రెండవ విజేతకు రూ.30వేలు, మూడవ విజేతకు రూ.20వేలు, నాల్గవ విజేతకు రూ.10వేలు బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.500 ఎంట్రీ ఫీజుతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9676109792, 9705197448 ఫోన్ చేయాలని తెలిపారు.

నేడు పెన్షనర్ల దినోత్సవం

పొదిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు ఏ.బాదుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు సంబంధించిన పెన్షనర్లు పాల్గొనాలని కోరారు. అదేవిదంగా 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లను సన్మానించనున్నట్లు చెప్పారు. ప్రతి పెన్షన్‌దారు తప్పక హాజరు కావాలని కోరారు.

సమన్వయంతో గ్రామాభివృద్ధి చేసుకుందాం

● ఎంపీడీవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధుల అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీవో బి.శ్రీనివాసులు కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో గ్రామాల సుస్థిరాభివృద్ధి సోమవారం మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం మొదటి రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాన్నారు. బాల్యవివాహాలు, లింగవివక్షత వంటి వాటిపై అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు తోడ్పడాలని తెలిపారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా అహ్లాదకరంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వాటి కృషికి ప్రయత్నించాలని తెలిపారు. వెలుగు ఏపీఎం పిచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను కల్పించుకుని కుటుంబాలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయత్నిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో వై.భాగ్యవతి, పీఆర్ ఏఈ మోహన్‌రాజ్, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి నివాళి



అక్షర చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వి.అక్షర అనే విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. అక్షర చిత్రపటానికి జడ్పీటీసీ బుడత మధుసూదన్, హెచ్ఎం పోలా.నాగభూషణ్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ బాలునాయక్, పాఠశాల కో-ఆప్షన్ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు అక్షర చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. బాలిక కుటుంబీకులను పరామర్శించారు.

ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు

తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొద్దికూరపాడు గ్రామ పరిధిలోని చింతలపాలెంలో కొందరి వల్ల ప్రాణహాని ఉందంటూ గ్రామ ఎస్సీ కులానికి చెందిన బదుల బైగర్ సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పోటు కోటేశ్వరరావు, వెంకటనారాయణ, పందెల సుబ్బారావు, రమేష్ అనే వారు తనకు చెందిన భూమిని ఆక్రమించారన్నారు. దీనిని ప్రశ్నించినందుకు కులంపేరుతో దూషించటంతో పాటు చంపుతానని బెదిరించారని ఫిర్యాదులో తెలిపారు.

పెన్షనర్ల సభను విజయవంతం చేయాలి

కనిగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల సభను విజయవంతం చేయాలని ఆయా సంఘం నాయకులు నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం సందర్భంగా కనిగిరిలోని కాస్మోపాలిటన్ క్లబ్ ఆవరణలో మంగళవారం ఉదయం 9గంటలకు సభ జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని విశ్రాంత ఉద్యోగులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతు సంక్షేమానికి పాటుపడాలి

పామూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికన వారందరూ రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేసి వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. మోపాడు రిజర్వాయర్ పరిధిలోని కంభాలదిన్నె నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన చుంచు కొండయ్యతో పాటు టీడీపీ శ్రేణులు కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లోని ఉగ్ర క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రను కలిసిన వారిలో కంభాలదిన్నె నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఉడుత కిశోర్, సిద్ధవరం నీటి సంఘం అధ్యక్షుడు యరగొర్ల రమేష్, వరదనేని వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కమ్మ బాలకృష్ణ, గద్దె వెంకటేశ్వర్లు, సనుమూరి వెంకటేశ్వర్లు, ఉన్నారు.

ప్రజల మనిషి శ్రీరాములు

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



పూలమాల వేస్తున్న లక్ష్మీ

దర్శి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన రాజకీయాలు చేసి ప్రజల అభ్యున్నతికి చివరివరకు పనిచేసి మంచి నాయకుడిగా దివంగత నారపుశెట్టి శ్రీరాములు ప్రజల్లో గుర్తింపు పొందారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు 28వ వర్ధంతి సందర్భంగా గడియార స్తంభం సెంటర్‌లోని దివంగత ఎన్టీఆర్, శ్రీరాములు విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే పాపారావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.23 లక్షలు

సీఎస్‌పురం/పామూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం హుండి ఆదాయం రూ.1,23,032 వచ్చినట్లు దేవస్థాన ఈవో నరసింహబాబు తెలిపారు. టికెట్ల అమ్మకం ద్వారా రూ.53,450, లడ్డూ ప్రసాదం అమ్మకంద్వారా రూ.18,820, శాశ్వత అన్నదానానికి వచ్చిన విరాళం రూ.48,242, మహాప్రాకార నిర్మాణానికి రూ.2,520 వచ్చాయన్నారు. అన్నదానానికి హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు చెందిన వీరంరెడ్డి రత్నారెడ్డి రూ.10,116 అందచేశారని తెలిపారు.

సమన్వయంతో లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలని జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి చెప్పారు. స్థానిక ఎంపీపీ సమావేశం మందిరంలో పేదరిక నిర్మూలన- గ్రామపంచాయతీ లక్ష్యాలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, సర్పంచ్‌లు మారం ఇంద్రసేనారెడ్డి, కాలేషావలి, శ్యాంసన్, కోట శివలక్ష్మి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, ఏవో ఎస్.సత్యం, ఏపీఎం దేవరాజ్ పాల్గొన్నారు.

ఉమ్మడి భూమిని రక్షించాలి

తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగంగవరం శివారు నాగంబొట్లపాలెం సర్వే నంబర్ 229లోని 190.50 ఎకరాల ఉమ్మడి భూమిని రక్షించాలని తూర్పుగంగవరం గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కె.సంజీవరావుకు వినతిపత్రం అందజేశారు. ఆ భూమిలో గ్రామంలోని ఏడుగురు పెద్దల పేర్ల పట్టాలు ఇచ్చి రికార్డుల్లో కూడా రాయించారన్నారు. ప్రస్తుతం ఆ భూమిలో గ్రావెల్ తవ్వకాలకు అనధికారికంగా అనుమతి ఇవ్వడానికి యత్నాలు చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కనిశెట్టి రామలక్ష్మయ్య, వల్లభనేని సుబ్బయ్య, జాష్టి గిరిబాబు, గుజ్జుల చినరామిరెడ్డి, గుజ్జుల తిరుపతిరెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



11.08 గంటలకు చింతగుంపల్లి సచివాలయంలో ఖాళీగా కుర్చీలు

సచివాలయాలు.. విధులకు పంగనామాలు

- సిబ్బంది పనితీరు లోపభూయిష్టం
- ఫీల్డ్‌లో ఉన్నామంటూ బుకాయింపు
- చాలాచోట్ల ఎంపీడీవో ఆఫీస్‌ల్లో ఉద్యోగులకు శిక్షణ
- ఆ పేరుతో మిగిలిన వారూ విధులకు డుమ్మా
- కొన్నిచోట్ల పనిచేయని ప్రింటర్లు
- సచివాలయాల్లో కానరాని జవాబుదారీతనం
- ఆంధ్రజ్యోతి విజిట్‌లో విస్మయకర విషయాలు వెలుగులోకి

కనిగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి మండలం, మున్సిపాల్టీ పరిధిలో 32 సచివాలయాలు ఉన్నాయి. ఆంధ్రజ్యోతి సోమవారం నిర్వహించిన ప్రత్యేక పరిశీలనలో దాదాపు అన్ని సచివాలయాల్లోనూ సిబ్బంది, అధికారులు పూర్తి స్థాయిలో లేరు. ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనే అత్యధిక సచివాయాల్లో విధులు ఉన్నారు.

మున్సిపాల్టీ పరిధిలోని 6వ సచివాలయంలో...

సచివాలయ అడ్మిన్ సెలవుపై ఉండటంతో డేటా ప్రాసెసింగ్ సెక్రటరీనే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇంకా వార్డు ఎమినిటీ, వార్డు ప్లానింగ్, వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు శానిటేషన్, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ (లైన్‌మెన్) అందరూ ఫీల్డ్‌లో ఉన్నారు. మున్సిపాల్టీ పరిధిలో ఎక్కడా రోడ్డు విస్తరణ పనులు జరగటం లేదు. అలాగే కరెంటు మరమ్మతులు చేయకున్నా ఆ పేరుతో విధులకు పంగనామం పెట్టారు. చిన్నతరహా పరిశ్రమలు, షాపులు వంటి వాటిపై సర్వే నిర్వహిస్తున్నారని ఎడ్యుకేషన్ సెక్రటరీలు సమాధానమిచ్చారు. సచివాలయాలకు సిబ్బంది అందరూ వచ్చి రిజిస్టరులో సంతకం, హాజరు తంబ్ వేయాల్సి ఉంది. ఎక్కడా ఇలాంటి నిబంధనలు పాటించటం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రజ్యోతి విజిట్‌లో 6వ వార్డు సచివాలయంలోని రిజిస్టరును ఎడ్యుకేషన్ సెక్రటరీ దాచే ప్రయత్నం చేయటం గమనార్హం. ఆయా సచివాలయంలో ప్రింటర్ కూడా పనిచేయటం లేదు. ప్రింటర్ పనిచేయకపోవటంతో విద్యుత్ బిల్ చెల్లించేందుకు వచ్చిన ఓ వృద్ధురాలికి మరో సచివాలయానికి వెళ్లాలని సూచించారు.

కాశిరెడ్డి కాలనీలో... 7వ సచివాయలంలో కూడా ప్రింటర్ పని చేయకపోవటంతో దరఖాస్తులు తీసుకువచ్చేందుకు వెళ్లారని సమాధానమిచ్చారు. 7వ సచివాయంలో కూడా వార్డు అడ్మిన్, ఎడ్యుకేషన్ సెక్రటరీలే ఉన్నారు. మిగతా వారందరూ ఫీల్డ్ ఉన్నారని సమాధానమిచ్చారు. వివిధ పనులపై సచివాలయలకు వచ్చే ప్రజలకు సచివాలయాల్లో జవాబుదారీతనమే లేదని పెదవి విరుస్తున్నారు. సచివాలయాల సేవలు పేరుకే కానీ ఎక్కడా పూర్తి స్థాయిలో అందటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



ముండ్లమూరులోనూ అంతే...

ముండ్లమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిపాడు, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు గ్రామ సచివాలయాలను విజిట్ చేయగా పులిపాడులో 10.52 గంటల సమయంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఒక్కరే విధుల్లో ఉన్నారు. ముండ్లమూరులో ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న ఎల్ఎస్‌డీజీ ట్రైనింగ్‌కు వెళ్ళినట్టు అగ్రికల్చర్ అసిస్టెంట్ తెలిపారు. 11.45 గంటలకు కెల్లంపల్లి గ్రామ సచివాలయంలో ఒక్కరూ లేరు. ఖాళీ కుర్చీలు మాత్రమే ఉన్నాయి. 12.05 గంటలకు పెద ఉల్లగల్లు గ్రామ సచివాలయంలోనూ అదే పరిస్థితి. 12.25 గంటలకు పసుపుగల్లు గ్రామ సచివాలయంలో కేవలం ఇంజనీరు అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగతా వారు అందరూ ముండ్లమూరు శిక్షణకు వెళ్లినట్టు తెలిపారు. ఒంటి గంటకు ముండ్లమూరు సచివాలయాన్ని విజిట్‌గా చేయగా పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరు అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు.

11.08గంటలైనా ఖాళీ కుర్చీలే

పీసీపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినవరిమడుగు, వెంగళాయపల్లి, చింతగుంపల్లి, పెదయిర్లపాడు సచివాలయాలలో సిబ్బంది బాధ్యతారాహిత్యం స్పష్టంగా కనిపించింది. ఉదయం 10.36గంటలకు చినవరిమడుగు సచివాలయానికి వెళ్లగా అక్కడ పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో విధులకు హాజరుకాలేదు. వెల్‌ఫేర్, వెటర్నరీ అసిస్టెంట్ ఇరువురే ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లారని చెప్పారు. ఆ తరువాత 10.50గంటలకు వెంగళాయపల్లి సచివాలయానికి వెళ్లగా వీఆర్వో, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం ముగ్గురే ఉన్నారు. ఇతర సిబ్బంది కనిపించలేదు. వెల్‌ఫేర్ అసిస్టెంట్ స్కూల్ తనిఖీ అని మూమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లారు. స్కూల్ హెచ్ఎంతో మాట్లాడగా అలాంటిదేమీ లేదని చెప్పారు. 11.08గంటలకు చింతగుంపల్లి సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ ఇద్దరే ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు ఎవరూ లేరు. వీఆర్వో రెవెన్యూ సదస్సుకు వెళ్లినట్టు చెప్పారు.

కురిచేడులో...

కురిచేడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : కురిచేడు-1 సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు కూడా ఏ ఒక్క సచివాలయ సిబ్బంది రాలేదు. ఆ తరువాత నిదానంగా ఒక్కొక్కరుగా విధులకు హాజరయ్యారు. కురిచేడు సచివాలయం-2లో 10.15 గంటల నుంచి ఒక్కొక్కరుగా సిబ్బంది విధులకు హాజరయ్యారు. సమస్యలపై పెద్దగా ప్రజలు సచివాలయాలకు రాలేదు. గృహనిర్మాణ శాఖకు దరఖాస్తులు చేయడానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం కావడంతో ఎక్కువమంది వాటి కోసం దరఖాస్తు చేయడానికి వచ్చారు.

ఖాళీగా కార్యాలయాలు

దొనకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది దొనకొండ ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా తరగతులకు హాజరయ్యారు. దీంతో సచివాలయ కార్యాలయాలు కాళీగా దర్శనమిచ్చాయి. దొనకొండ-2 సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం కార్యాలయంలో విధుల్లో ఉండగా వీఆర్వో రెవెన్యూ సదస్సుకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సిమెంట్ రోడ్డు కొలతలకు వెళ్లారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, ఎనర్జీ అసిస్టెంట్లు, మహిళా పోలీస్‌లు శిక్షణ కార్యక్రమంకు హాజరయ్యారు.

నాలుగింటికి ఒక సచివాలయమే వర్కింగ్

పామూరు, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : పామూరులోని 4 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 1వ సచివాలయంలో కేవలం ఇద్దరు అధికారులే ఉన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ కోసం, క్యాస్ట్ ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం లబ్ధిదారులు ఎక్కువ మంది వచ్చారు. 2 సచివాలయంలో హెల్త్ సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉండగా 3, 4 సచివాలయాల్లోని సిబ్బంది అందుబాటులో లేరు.



కనిగిరిలోని 6 సచివాలయంలో కరెంటు బిల్లు కట్టేందుకు రావడంతో ప్రింటర్ చెడిపోయిందని, వేరే సచివాలయానికి వెళ్లాలని సిబ్బంది చెప్పడంతో వెనుదిరిగి వెళుతున్న వృద్ధురాలు నిమ్మకాయల కొండమ్మ

తాళ్లూరులో...

తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు-1, -2, విఠలాపురం, మాధవరం, తూర్పుగంగవరం, శివరాంపురం గ్రామ సచివాలయాల్లో డొల్లతనం కనిపించింది. పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీస్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, జేఎల్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాళ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యాక్రమాని వెళ్లారు. సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మాధవరం వీఆర్‌వో బెల్లంకొండవారిపాలెంకు ఇంచార్జిగా ఉండటంతో రెవెన్యూ సదస్సుకు వెళ్లారు. ఫీల్డ్ విజిట్ పేరుతో వెటర్నరీ అసిస్టెంట్‌లు వెళ్లగ డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. గ్రీవెన్ సెల రోజున సచివాలయాలందు అధికారులు అందుబాటుల్లో ఉండాలి.



కురిచేడులో ఉద్యోగులు రాక ఖాళీగా ఉన్న కుర్చీలు



పెద ఉల్లగల్లు సచివాలయంలో...



సిబ్బంది లేక వెలవెలబోయిన మాధవరం సచివాలయం

గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి పనులు

- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో మొదలైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- పీసీపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గ్రామల్లో మౌలిక వసతులు కల్పనను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విమర్శించారు. పీసీపల్లిలో రూ.82లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఆయన మాట్లాడుతూ సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలికవసతులు కల్పించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎక్కడా తట్టమట్టి కూడా పోయలేదని విమర్శించారు. మండలంలో ఇప్పటికే ఫేజ్ 1లో 3కోట్ల రూపాయలతో 11గ్రామాల్లో సీసీరోడ్లు వేశామన్నారు. ఫేజ్2లో 2.45కోట్లతో ఎస్సీకాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఎంపీడీవో ప్రభాకరశర్మ, మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, పువ్వాడి నాగరాజు, వడ్డెంపూడి వెంకట్(చిన్నా), జనసేన నాయకులు మాదాసు రమేష్, బండారు రాజు, టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు బద్దిపూడి ఎబినేజరు, గుదేవారిపాలెం, నేరేడుపల్లి సర్పంచ్‌లు కనపర్తి శ్యాంసన్, పల్లా మల్లికార్జున్, సత్యంరెడ్డి, లింగారెడ్డి, జోసఫ్, బ్రహ్మారెడ్డి, చిన్నా, వీరయ్య, యోగయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



కనిగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

విద్యుత్, ఇంధనం ఆదా భవిష్యత్తుకు ఎంతో మేలు

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌తోపాటు ఇంధనం ఆదా చేస్తే భవిష్యత్తు తరాలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖాధికారులు సోమవారం పట్టణంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీకి ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ విద్యుత్‌ను ఎంతో పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వీరయ్య, డీఈఈలు ఆర్ ఉమాకాంత్, కృష్ణారెడ్డి, ఏఈలు పవన్‌కుమార్, నవీన్‌కుమార్, రాజేష్, మణికంఠ, జిలాని, రసూల్ పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి పాటుపడాలి

పామూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాగునీటి చెరువుల అభివృద్ధికి నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సాగునీటి సంఘాల అధ్య ఉపాధ్యక్షులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి చెరువుల అభివృద్ధికి నిధులు విడుదల చేయకుండా రైతు సంక్షేమాన్ని విస్మరించిందన్నారు.సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, ఎం హుసేన్‌రావు యాదవ్, మన్నం రమణయ్య, దేవరపు మాల్యాద్రితో పాటు నీటి సంఘాల చైర్మన్లు చుంచుకొండయ్య, కమ్మ మహేష్, ఎం నరసిశింహారావు, పాలపర్తి రమణయ్య, ఇర్రి వెంకటేశ్వర్లు, తుమ్మ ఆంజనేయరెడ్డి, వై రమేష్ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

పామూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల ద్వారా రైతు సమస్యలను పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని నుచ్చుపొద గ్రామంలో సర్పంచ్ పిన్నిక రమణమ్మ, తూర్పుకోడిగుడ్లపాడు గ్రామంలో సర్పంచ్ దారపనేని కొండబాబు అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నుచ్చుపొదలో 20 అర్జీలు, కోడిగుడ్లపాడులో 25 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంఆర్ఐ మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో చెన్నకేశవులు, మాజీ సర్పంచ్ మల్లెబోయిన గురుబ్రహ్మం, ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, మల్లెబోయిన బాలబ్రహ్మయ్య, ఆవుల రమణమ్మ, కొలూరి ఖాజారహంతుల్లా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

దొనకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రబాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ రమాదేవి పాల్గొని రైతుల నుంచి 13 అర్జీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వీఆర్వో మాచర్ల పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖరరెడ్డి, మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్, సర్వేయర్ కోటంరాజు, వీఆర్‌వోలు సీహెచ్ బ్రహ్మతేజ, గురవయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలో 10 అర్జీలు

కురిచేడు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం పడమర వీరాయపాలెంలో సోమవారం రెవెన్యూ గ్రామసభ తహసీల్దార్ రజనీకుమారి అధ్యక్షతన జరిగింది. మొత్తం 10 అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగంగవరంలోని సాయి ఫెర్టిలైజర్ దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి బిప్రసాదరావు సోమవారం తనిఖీ చేశారు. షాపులోని డీఏపీ 18-46-0శ్యాంపిల్స్‌ను తీసి విశాఖపట్నం రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపుతున్నట్లు ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నాగరాజు పాల్గొన్నారు.

దరిశి రాము ఆర్థిక సహకారంతో అన్నదానం

పామూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప భక్తులకు నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఏఎంసీ వైస్ చైర్మన్ దరిశి రాము దంపతుల ఆర్థిక సహకారంతో అయ్యప్పలకు సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, దేవస్థాన చైర్మన్ గుత్తి రాజా, రాచూరి సురేష్, ఓగూరి నరసింహారావు, కంభాల రోశయ్య, వాయినేని మాల్యాద్రి, పోసం నరసింహారావు, గద్దె రత్తయ్య పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో ఆక్రమణల తొలగింపు

కాలువల్లో పూడికతీత పనులు

తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగంగవరం గ్రామంలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన సైడు కాలువల ఆక్రమణలను తొలగిస్తున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా దర్శి-చీమకుర్తి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలపై అక్రమ కట్టడాలను నిర్మించిన వాటిని ఎక్స్‌కవేటర్‌తో తీయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి మంత్రి శిద్దా రాఘవరావు చొరవతో గ్రామంలో సీసీరోడ్లు, సైడు కాలువలు నిర్మించారు. అయితే వ్యాపారులు, గృహయజమానులు తమ ఇష్టానుసారం సైడు కాలువలను దాటి రోడ్డును ఆక్రమంచి కట్టడాలు చేపట్టారు. కొందరు ప్రభుత్వ స్థలాన్ని దుకాణాలకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. సైడు కాలువలను పూడ్చి రోడ్డుపైకి రావటంతో మురుగునీరు కిందకు ప్రవహించక రోడ్లపై నిలుస్తూ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో రాకపోకలకు నరకయాతనంగా ఉండడంతో ఎంపీడీవో కె.సుందరామయ్య స్పందించి గ్రామసర్పంచ్‌తో మాట్లాడారు. సైడు కాల్వలపై ఉన్న అక్రమకట్టడాలను తొలగిస్తున్నారు. అలాగే కాలువ పూడికతీత పనులు చేయించాలని సర్పంచ్ చాట్ల నాగమణి, పంచాయతీ కార్యదర్శి అజయ్‌కీర్తిలకు సూచించారు. ఆ మేరకు సైడు కాలువలపై ఉన్న అక్రమకట్టడాలు తొలగిస్తూ పూడికతీత పనులు చేయిస్తున్నారు.




కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

దర్శి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, అదే ప్రగతికి మలుపు అని దర్శి విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసులు చెప్పారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా దర్శి ఏపీ మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఎస్ స్టార్ రేటెడ్ ఎక్యుప్‌మెంట్‌ను వాడాలని, అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆపాలని, తక్కువ విద్యుత్ వాడకంతో ఎక్కువ పనితనం ఇచ్చే పరికరాలను వాడి విద్యుత్ పొదుపు చేయాలని సూచించారు. ఇళ్లపై సోలార్ ప్లేట్లు అమర్చుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని, పీఎం సూర్యఘర్ పథకం కింద ఒక్కో కిలోవాట్‌కు రూ.30వేలు సబ్సిడీగా పొందవచ్చని, 3 కిలోవాట్లకు రూ.78వేలు సబ్సిడీ పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్స్ అంకబాబు, వేణుగోపాల్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ శ్రీనివాసులు





తొలి స్నాతకోత్సవానికి ఎయిమ్స్ ముస్తాబు

- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి హాజరు
- నలుగురికి బంగారు పతకాలు
- పాల్గొంటున్న గవర్నర్, సీఎం



మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి భవన సముదాయం

మంగళగిరి ఎయిమ్స్ ఎంబ్లమ్

మంగళగిరి ఎయిమ్స్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ పూర్తి చేసుకుని పట్టాలను పొందుతున్న 47 మందిలో 17 మంది మహిళా విద్యార్థినులు కాగా, మిగిలిన 30 మంది పురుషులే! మొత్తం 47 మందిలో నలుగురికి మాత్రం ఎయిమ్స్ యాజమాన్యం బంగారు పతకాలను ప్రకటించింది. ఈ నలుగురిలో ముగ్గురు మహిళలు కాగా ఒక్కరు మాత్రమే పురుషుడు. లియా ఆజీ, సుప్రభా సిన్హా, వీకే ఆధీరా, దాసరి దివ్యాన్ను అనే నలుగురికి బంగారు పతకాలను ప్రకటించారు.

నలుగురికి బంగారు పతకాలు

మంగళగిరి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి బ్యాచ్ మెడికోలు తమ గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి స్నాతకోత్సవాన్ని పాలకవర్గం మంగళవారం మధ్యాహ్నం వేడుకగా జరిపేందుకు సన్నద్ధమైంది. ఈ వేడుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర ఆయుష్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఎయిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో ప్రారంభమై గంటన్నరపాటు కొనసాగుతుంది. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము స్నాతకోత్సవ ప్రసంగంచేసి ప్రతిభ చూపిన నలుగురు వైద్య విద్యార్థులకు బంగారుపతకాలను అందజేస్తారు. అలాగే, ఎంబీబీఎస్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న 47 మందితోపాటు పోస్టు డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసుకున్న మరో నలుగురు విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తారు.

విభజన వరాల్లో ఒకటి

రాష్ట్ర విభజన వరాలలో ఒకటిగా మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రి ఏర్పాటయింది. గతంలో ఒక్క దేశ రాజధాని ఢిల్లీకి మాత్రమే పరిమితమై ఉన్న అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ సేవలను దేశ ప్రజలందరికీ అందించాలన్న బీజేపీ ప్రభుత్వ సంకల్ప కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు ఎయిమ్స్ ఆసుపత్రుల స్థాపన దశలవారీగా ఆరంభమైంది. ఇందులో... ఫేజ్-4లో భాగంగా ఏపీకి రూ. 1618 కోట్ల వ్యయంతో ఎయిమ్స్ ఆస్పత్రిని మంగళగిరిలో ఏర్పాటు చేసేవిధంగా (మిగతా 6వ పేజీలో)



స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

- పెరుగుతున్న శ్వాసకోశ సమస్యలు!
- జలుబు, దగ్గు లక్షణాలతో పిల్లలు విలవిల
- ఇన్ఫ్లుయెంజా వైరస్ కారణమంటున్న వైద్యులు
- ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలకు పెరుగుతున్న చిన్నారులు



చిన్నారులపై.. చలి పంజా

వాతావరణంలో కొద్ది కాలంగా చలి పెరిగింది. ఉదయం పొగ మంచు కురుస్తోంది. మారిన వాతావరణ పరిస్థితులు చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి వాతావరణంలో ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ప్రబలుతుండటంతో చిన్నారులు జలుబు, దగ్గు, ఆయాసం, జ్వరం, శ్వాస కోశ సమస్యలతో సతమతమవుతున్నారు. ఆయా సమస్యలతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శిశు వైద్య విభాగంతో పాటు నగరంలోని పలు ప్రైవేటు చిన్న పిల్లల ఆసుపత్రులుకు వస్తున్న బాధిత పిల్లల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఏడాదిలోపు బుజ్జాయిల్లో బ్రాంకైటిస్, ఆయాసం, దగ్గు, డొక్కలు ఎగరేస్తూ ఇబ్బందిపడుతున్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని చిన్న పిల్లల విభాగం ఓపీకి వస్తున్న పిల్లల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. గతంలో రోజుకు 150 మంది వరకు ఓపీ విభాగానికి వస్తుంటే, వ్యాధుల ప్రభావంతో ప్రస్తుతం ఓపీ సంఖ్య 200కు చేరినట్లు పీడియాట్రిక్ వైద్యులు చెబుతున్నారు.



గుంటూరు మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చలి పెరడగంతో ఇన్‌ఫ్లుయెంజా ఏ, అడెనో వైరస్, వంటివి విజృంభిస్తున్నాయి. పది రోజులుగా వీటి ప్రభావంతో దగ్గు, జలుబు, ఆయాసంతో పాటు ఊపిరితిత్తుల్లో గాలి గొట్టాల వాపుతో చిన్నారులు విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న ఓపీలో 80 శాతం మంది చిన్నారుల్లో ఈ ఇబ్బందులే కనిపిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. గుంటూరు నగరంలో సుమారు 40 వరకు చిన్న పిల్లల ఆసుపత్రులు ఉన్నాయి. ఒక్కొక్క చోట ప్రతి రోజూ 60 నుంచి 100 వరకు ఓపీలు నమోదవుతున్నాయి. ఇదే అదనుగా కొన్ని ఆసుపత్రుల్లో ఓపీలు పెంచడంతో పాటు కార్డు పని చేసే కాల వ్యవధిని 15 రోజుల నుంచి పదికి, పది రోజుల నుంచి వారానికి కుదించేస్తున్నారు. పరీక్షలకు సంబంధించి ప్రైవేటు ల్యాబుల్లో రూ.వేలు ఖర్చవుతున్నాయి.

మధ్యస్థ తరహా వ్యాధి లక్షణాలు..

ఇన్‌ఫ్లుయెంజాను ముక్కు, గొంతు, ఊపిరితిత్తుల్లో సమస్యలు సృష్టించే వైరస్‌గా చెప్పవచ్చు. దీన్నే సీజనల్ ఫ్లూ గాపిలుస్తారు. ఇందులో (మిగతా 6వ పేజీలో)

ఎస్ఏ -1 గణితం
పరీక్ష రద్దు



- ప్రశ్నా పత్రాలు.. యూట్యూబ్‌లో ప్రత్యక్షం
- ప్రశ్నా పత్రాలన్నీ పోలీసుస్టేషన్‌కు తరలింపు

పోలీసు స్టేషన్‌లో ప్రశ్నాపత్రాల బాక్సులు

గుంటూరు విద్య, డిసెంబరు 16 ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో సోమవారం జరగాల్సిన ఎస్ఏ-1 ప్రశ్నాత్రాలు ముందుగానే యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో సోమవారం జరగాల్సిన పరీక్షల్ని విద్యాశాఖ రద్దుచేసింది. రాష్ట్రంలో ఏ జిల్లా నుంచి ప్రశ్నాపత్రం లీక్‌అయిందనే విషయం విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు ఈనెల నుంచి ఎస్ఏ-1 పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్షలకు 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులు హాజరవుతున్నారు. తాజాగా సోమవారం జరగాల్సిన పది గణితం ప్రశ్నాపత్రం ఆదివారం రాత్రి నుంచే యూట్యూబ్‌లో ప్రత్యక్షమైంది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర స్థాయి అధికారులు గణితం పరీక్ష రద్దుచేస్తున్నట్లు ఉదయం డీఈవోలకు సమాచారం పంపారు. వెంటనే డీఈవోలు సమాచా రాన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పంపడంతో సోమవారం పరీక్ష రద్దు అయింది.

ప్రశ్నాపత్రాల బాక్సులు పోలీస్ స్టేషన్లకు....

ఎస్ఏ-1 పరీక్షలకు సంబంధించి ఇంకా మూడు సబ్జెక్టుల పరీక్షలు జరగల్సి ఉంది. ప్రశ్నాపత్రాల లీకేజీపై ఎంఈవోల స్థాయిలో సోమవారం సాయంత్రం హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రశ్నా పత్రాలను సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించా లని విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిం ది. ఒక్కో పాఠశాలకు వచ్చిన ప్రశ్నాపత్రాల బాక్సులు మూడు, నాలుగు ఉన్నాయి. ఆయా బాక్సుల్ని స్టేషన్‌కు తరలించడానికి హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. ప్రతిరోజు ఉదయం వాటిని స్టేషన్ నుంచి తీసుకురావడం మరలా పరీక్షలు నిర్వహించడం ఓ ప్రహసనంగా మారిందిని, ఇందుకు అయ్యేరవాణా ఖర్చులు తాము భరించాల్సి వస్తోందని వారు వాపోయారు.

ప్రతిసారి ఎలా లీక్‌అవుతున్నాయో?

పాఠశాలల్లో జరిగే పరీక్షలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రశ్నా పత్రాలు సిద్ధం చేసి వాటిని జిల్లాకామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు పంపుతారు. అక్కడి నుంచి ఎంఈవో కార్యాలయాలకు, తరువాత స్కూల్ కాంప్లెక్సులకు ఇవి సరఫరా చేస్తారు. అయితే గత ప్రభుత్వం ప్రశ్నాపత్రాల సరఫరాపై తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కొన్నిసార్లు పరీక్షకు ఒకరోజు ముందు వాట్సప్‌లోపెట్టడం వాటని డౌన్‌లోడు చేసుకుని ఉపాధ్యాయులు బోర్డుపై రాయడం లేదా జిరాక్స్ తీసి పంపిణీ చేయడం చేశారు. ఫలితంగా అనేకసార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. అయినా పట్టించుకోకుండానే పరీక్షలు నిర్వహించారు. ఇటువంటి అవ లక్షణాల్ని కొత్త ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఫలితంగా పరీక్షల్ని రద్దు చేసి ప్రశ్నాపత్రాలను పోలీసు స్టేషన్లకు తరలించినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అయితే ఇందులో ఉండే వ్యయ ప్రయాసలు కూడా ప్రభుత్వం అర్థం చేసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాసమస్యలపై తక్షణమే స్పందించాలి

- జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 98 అర్జీలు

బాపట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన వారి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 98 మంది అర్జీల ద్వారా వారి సమస్యలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. జాయింట్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కాల వేదికకు సంబంధించి రెవెన్యూ, రీసర్వే దరఖాస్తుల గురించి ఆరా తీశారు. వచ్చిన ఫిర్యాదులకు సరైన కారణాలు చూపకుండా అసంపూర్తిగా తిరస్కరించటం సరికాదన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను కేటగిరి వారీగా విభజించి నివేదించాలని చెప్పారు. సదస్సులలో వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన తీరుపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

పనులెప్పుడు ప్రారంభం?

- మెడికల్ కళాశాల నిర్మాణ పనుల ప్రారంభంపై లేని స్పష్టత
- అన్నీ సర్దేసుకుని వెళ్లిపోయిన కాంట్రాక్టు సంస్థ
- నిధుల అవకతవకలపై పలు ఆరోపణలు
- తాజాగా ఎస్టిమేషన్లు పంపించిన అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

2020లో ఉత్తర్వులు....2021లో శంకుస్థాపన... 2023లో అరకొరగా పనులు ప్రారంభం....ఇదీ బాపట్లలో మెడికల్ కళాశాల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం అవలంభించిన తంతు....అది కూడా సరిగ్గా ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందు మాత్రమే పనులు ప్రారంభించారు. నిర్మాణ పనుల తంతు ఇలా ఉంటే నాబార్డు నుంచి మంజూరయిన నిధులను యథేచ్ఛగా పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. వీటికి నిరూపణగా కాంట్రాక్టు సంస్థకు పెద్ద ఎత్తున బిల్లులను గద్దె దిగేనాటికి పెండింగ్‌లోఉంచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పిల్లర్ల వరకు పూర్తయిన నిర్మాణాన్ని నిలిపి మెడికల్ కళాశాల మంజూరు దగ్గర నుంచి నిర్మాణం వరకు జరిగిన ప్రక్రియతో పాటు నిధుల వ్యయంపై కూడా నివేదిక తెప్పించుకుంది. ఈ క్రమంలో ఎన్నికల ముందువరకు అక్కడ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ ఒక్కొక్కటిగా తన సామగ్రిని అక్కడ నుంచి తరలించేసింది. దీంతో మెడికల్ కళాశాల నిర్మాణంపై బాపట్ల ప్రజల్లో అనేక అనుమాన మేఘాలు కమ్ముకున్నాయి. ఇదే అదనుగా కళాశాల నిర్మాణాన్ని కూటమి పాలకులు అటకెక్కించారనే తప్పుడు ప్రచారాన్ని సైతం వైసీపీ మొదలుపెట్టింది. కానీ కాంట్రాక్టు సంస్థకు పెద్ద ఎత్తున బిల్లులు పెండింగ్ ఉండడం వల్లే వారు పనులు నిలిపివేశారనేది సమాచారం. మరోవైపు వీటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాతిపదికన నూతన విధానాన్ని తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కాకపోతే మెడికల్ కళాశాల పనులు నిలిపివేసి ఇప్పటికే ఆరు నెలలు దాటుతుండడంతో నిర్ణయం త్వరితగతిన తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది



పిల్లర్ల దశలో నిలిచిపోయిన కళాశాల నిర్మాణ పనులు

వైసీపీ నిర్వాకాలే శాపాలుగా...

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ప్రస్తుతం జాప్యం వెనకాల గత ప్రభుత్వ నిర్వాకాలే శాపాలై వెంటాడుతు న్నాయి. ముఖ్యంగా నాబార్డు తొలి విడత కింద మంజూరు చేసిన రూ.298 కోట్ల నిధుల విషయంలో పారదర్శకతకు పాతరేస్తూ వైసీపీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరించింది. యథేచ్ఛగా ఈ నిధులను దారి మళ్లించినట్లు ఇప్పటికే ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. ప్రస్తుతం పూర్తయిన పిల్లర్ల దశ నిర్మాణం వరకు కాంట్రాక్టు సంస్థ రూ.112 కోట్లు వరకు ఖర్చుపెట్టినట్లు సమాచారం. వీటిలో దాదాపు రూ.58 కోట్ల వరకు బిల్లులను కూటమి ప్రభుత్వం కొలువుదీరాకే చెల్లించినట్లు తెలుస్తోంది. అర్ధంతరంగా పనులు ఆపి అన్నీసర్దేసుకుని కాంట్రాక్టు సంస్థ వెళ్లిపోవడం వెనక గత ప్రభుత్వం పెండింగ్ ఉంచిన బిల్లులు కూడా ప్రధాన కారణంగా ఉన్నాయి. నిధుల తంతు ఇలా ఉంటే కళాశాల నిర్మాణానికి కేటాయించిన భూమి విషయంలో కూడా పెద్ద ఎత్తున క్విడ్ ప్రోకో జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. మెడికల్ కళాశాల నిర్మాణం కోసం కావాల్సిన భూమిని ఓ దాత విరాళమిచ్చినట్లు అప్పట్లో వైసీపీ తెగ హడావిడి చేసింది. ఆ భూమంతా అసైన్డ్ కావడంతో దానిని ప్రభుత్వ అవసరాలకు వేరొకరు దానమివ్వడం ఏంటనే కోణంలో కూడా ప్రస్తుత పాలకులు వివరాలు తెప్పించుకున్నారు.

నూతన విధానంపై కసరత్తు...

పనులు నిలిచిపోయి ఇప్పటికే ఆరు నెలలు అయింది. కానీ ఇంకా కూటమి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పనులు మొదలుపెట్టడానికి కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి తాజా ఎస్టిమేషన్లను కూడా ఇప్పటికే ప్రభుత్వానికి అధికారులు పంపినట్లు సమాచారం. ఇటీవల బాపట్లలో జరిగిన డీఆర్సీ సమావేశం అనంతరం మాట్లాడిన ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి త్వరలోనే మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పడం గమనార్హం. వెంటనే పనులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే పనులు పూర్తయ్యేసరికి కనీసం రెండేళ్లు పట్టే అవకాశం కనబడుతోంది. ఇది కూడా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడితేనే రెండేళ్లు, లేదంటే మరో ఆరు నెలలు సమయం పట్టొచ్చు.

హైవే నిర్మాణానికి అక్రమంగా గ్రావెల్





కొండ మట్టి తరలింపును అడ్డుకుంటున్న కొర్రపాటివారిపాలెం గ్రామస్థులతో బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధుల వాగ్వివాదం .. గ్రావెల్‌ను తరలిస్తున్న కొండ ఇదే

- తరలింపును అడ్డుకున్న కొర్రపాటిపాలెంవాసులు
- గ్రామస్థలకు కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధుల మధ్య వాగ్వివాదం
- అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తూ పోలీస్‌లకు ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆగ్రహం

అద్దంకి/తాళ్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం కొండను తవ్వి గ్రావెల్ తరలించడాన్ని తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. అద్దంకి మండలంలోని మోదేపల్లి రెవెన్యూ పరిధిలో కొండ ఉంది. తాళ్లూరు మండలం కొర్రపాటివారిపాలెంకు సమీపంలో ఈ కొండ ఉంది. కొండ పరిసర ప్రాంతంలో కొ ర్రపాటివారిపాలెం రైతులకు భూములు ఉన్నాయి. గ్రామస్థులు పశువులు, గొర్రెలు, మేకలను ఈ కొండ వద్దకే మేతకు తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో విజయవాడ - బెంగళూరు రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ రోడ్డు నిర్మాణం కోసం కొండ మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో గత నెల 21వ తేదీన కొర్రపాటివారిపాలెం రైతులు గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. దీంతో అప్పట్లో గ్రావెల్ తరలింపును నిలిపి వేసి రెండు రోజుల నుంచి మరలా గ్రావెల్ తరలింపును ప్రారంభించడంతో సోమవారం ఉదయం కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు రాజకీయ పార్టీలను పక్కన పెట్టి అందరు మూకుమ్మడిగా వచ్చి గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్థుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. అనుమతులు చూపించాలని గ్రామస్థులు కోరగా.. ఎలాంటి సమాధానం చెప్పకుండా దాట వేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రావెల్ తరలింపును ఒప్పుకునేది లేదని, పశువులకు గ్రాసం ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో తాత్కాలికంగా గ్రావెల్ తరలింపును నిలిపి వేశారు. రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు తాళ్లూరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కొర్రపాటివారిపాలెం గ్రామంలోకి వెళ్లి గ్రావెల్ తరలింపు అడ్డుకోరాదని చెప్పడంపట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి మండల పరిధిలో ఉన్న కొండ నుంచి గ్రావెల్ తరలింపును అడ్డుకోగా తాళ్లూరు పోలీసులు జోక్యం చేసుకోవడం పట్ల గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వానికి చెందిన కొండ నుంచి గ్రావెల్ తరలింపును అడ్డుకోవాల్సిన పోలీసులు, కాంట్రాక్టర్‌లకు వత్తాసుగా రైతులను హెచ్చరించడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొండ నుంచి గ్రావెల్ తరలింపును నిలిపి వేయాలని కొ ర్రపాటివారిపాలెం రైతులు కోరుతున్నారు.



నీటి సంఘం ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

రైతుల సంక్షేమం కోసమే సాగు నీటి సంఘాల ఎన్నికలు

- వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నదాతలకు తీరని కష్టాలు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ ఎన్నికల్లో రైతులకు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో ఉన్న నాయకులను ఎన్నికల్లో ఎన్నుకున్నారన్నారు. సోమవారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో సాగు నీటి సంఘాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నీటి సంఘాలను బలోపేతం చేయడానికి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆయకట్టు పరిధిలోని రైతులు ఈ సంఘాలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు అయ్యారన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని ఏలూరి అన్నారు. వైసీపీ హయాంలో కాలువను మరమ్మతులు చేయకుండా రైతుల ప్రయోజనాలను దెబ్బ తీశారన్నారు. కనీసం కాలువల్లో చిల్లచెట్లు, ముళ్ల పొదలను తొలగించిన దాఖలాలు కూడా లేవన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కాలువల అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. చిట్టచివరి భూముల రైతులకు కూడా నీరు అందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మళ్లీ రైతులకు మంచిరోజులు వచ్చాయని ఏలూరి స్పష్టం చేశారు. సాగునీటి సంఘాలకు తన నుంచి పూర్తిసహకారం ఉంటుందన్నారు. చంద్రబాబు నేతృత్వంలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి సాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కొమ్మమూరుకు ఇప్పటికే సాగునీరు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ఏలూరిని నూతన కమిటీ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌లు సన్మానించి అభిమానం చాటుకున్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో టీంలుగా ఏర్పాటు అయి బడి మానేసిన విద్యార్థులను గుర్తించి వారిని తీర్చి దిద్దాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిషోర్ బాలిక వికాసం కార్యక్రమంలో భాగంగా సీడీపీవో సుధ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాలలో ప్రతివారం ఒక్కో అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్ర మంలో వైద్యాధికారి రమీజ్ అహ్మద్, ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్, పలు గ్రా మాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భవనాసి కాలువలో పూడిక తొలగింపు



పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నీటి సంఘ అధ్యక్షుడు సుబ్బారావు, టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భవనాసి కాలువలో పూడిక, నాచు తొలగింపు పనులను సోమవారం నీటి సంఘం అధ్యక్షుడు నర్రా సుబ్బారావు ప్రారంభించారు. నాచు, పూడిక పేరుకు పోవడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుబ్బారావు, మిగిలిన కమిటీ సభ్యులతో కలిసి సోమవారి ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేయించి పూడికతీత పనులు ప్రారంభించారు. పూడిక తీత పనులు చేపట్టడం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

గవినివారిపాలెం(చీరాలటౌన్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంలో ఆదివారం కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత సోమవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పిట్టు రవికుమార్, భానుప్రియ దంపతులు. వీరికి మూడేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. అయితే రెండు రోజులుగా వీరిద్దరి మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆదివారం ఇంటిపై అంతస్తులో చీరతో ఉరికి పాల్పడింది. ఈక్రమంలో హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతిచెందింది. ఈమేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

తోటవారిపాలెం (చీరాలటౌన్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని మరో వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తోటవారిపాలెంకు చెందిన మార్పు దీనరాజు సోమవారం నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన సలగల ప్రేమ్‌బాబు అడ్డగించాడు. పాతకక్షలు మనసులో పెట్టుకుని తన ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా పెట్టి అసభ్యంగా దూషించాడు. దీంతో దీనరాజు ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి పనులు

- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో మొదలైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- పీసీపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో గ్రామల్లో మౌలిక వసతులు కల్పనను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విమర్శించారు. పీసీపల్లిలో రూ.82లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో ఆయన మాట్లాడుతూ సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలికవసతులు కల్పించినప్పుడే గ్రా మాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎక్కడా తట్టమట్టి కూడా పోయలేదని విమర్శించారు. మండలంలో ఇప్పటికే ఫేజ్ 1లో 3కోట్ల రూపాయలతో 11గ్రామాల్లో సీసీరోడ్లు వేశామన్నారు. ఫేజ్2లో 2.45కోట్లతో ఎస్సీకాలనీల్లో సీసీరోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించినట్లు చె ప్పారు. ఎంపీడీవో పద్మాకరశ ర్మ, మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రా మయ్య, పు వ్వాడి నాగరాజు, వడ్డెంపూడి వెంకట్(చిన్నా), జనసేన నాయకులు మాదాసు రమేష్, బండారు రాజు, టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు బద్దిపూడి ఎబినేజరు, గుదేవారిపాలెం, నేరేడుపల్లి సర్పంచ్‌లు కనపర్తి శ్యాంసన్, పల్లా మల్లికార్జున్, సత్యంరెడ్డి, లింగారెడ్డి, జోసఫ్, బ్రహ్మారెడ్డి, చిన్నా, వీరయ్య, యోగయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

తొలి స్నాతకోత్సవానికి.. ఎయిమ్స్ ముస్తాబు

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించారు. 2015 అక్టోబరులో కేంద్ర మంత్రివర్గం ఈ నిధులను మంజూరుచేయగా 2017 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలయ్యాయి. నిర్మాణపరంగా అన్ని హంగులను పూర్తిచేసుకున్న మంగళగిరి ఎయిమ్స్‌ను 2024 సెప్టెంబరు 29న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు.

పచ్చని కొండల నడుమ

మంగళగిరి ఎయిమ్స్‌కు పలు ప్రత్యేకతలు కూడా ఉన్నాయని చెప్పుకోవాలి. ఇది రాష్ట్రానికి నడిబొడ్డున ఉండడం ఒక విశేషమైతే రాజధాని అమరావతిలో కూడా ఒక భాగంగా కుదురుకుంది. అంతేకాదు... దాదాపు రెండొందల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో పచ్చని కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటైంది. ఒక విధంగా చెప్పాలంటే దేశంలో ఇప్పటివరకు ఏర్పాటైన ఎయిమ్స్ ఆస్పత్రులన్నింటిలోను దిబెస్ట్ ఎయిమ్స్ అన్న ఖ్యాతి మంగళగిరి ఎయిమ్స్‌కే దక్కింది.

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి డైరెక్టరుగా డాక్టర్ ముఖేష్ త్రిపాఠి పనిచేయగా ప్రస్తుతం డాక్టర్ మదబానందకర్ రెండవ డైరెక్టరుగా ఈ ఏడాది జనవరి 24 నుంచి సేవలను అందిస్తున్నారు. ఈయన సర్జికల్ ఆంకాలజిస్టుగా విశేష అనుభవాన్ని గడించారు. డాక్టర్ టీఎస్ రవికుమార్ వైస్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు. ఇక పాలకమండలి సభ్యులుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తాజాగా ఎన్నికయ్యారు.

రూ. పదికే ఓపీ సేవలు

మంగళగిరి ఎయిమ్స్‌లో రూ. పదికే వైద్యసేవలను అందిస్తున్నారు. అంతేకాదు... ఇతరత్రా శస్త్ర చికిత్సలకు, పలురకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ఫీజులు బయటి లేబొరేటరీలతో పోల్చితే చాలా తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. కంప్లీట్ బ్లడ్ పిక్చర్‌కు రూ. 365, ఫాస్టింగ్ అండ్ ర్యాండమ్ బ్లడ్ షుగర్‌కు కలిపి రూ. 48, లివర్ ఫంక్షనింగ్ టెస్ట్‌కు రూ. 225, కిడ్నీ ఫంక్షనింగ్ టెస్ట్‌కు రూ. 225, లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ టెస్ట్, ఈసీజీకి, ఛాతీ ఎక్స్‌రేకు రూ. 60, మామొగ్రఫీకి రూ. 630, అల్ట్రా సోనోగ్రఫీకి రూ. 323, యూరిన్ ఎనాలిసిస్‌కు రూ. 35, హెచ్ఐవీ రాపిడ్ టెస్ట్‌కు రూ. 150, హెచ్‌బీయస్ ఏజీ రాపిడ్ టెస్ట్‌కు రూ. 28 వంతున ఛార్జీలు ఉన్నాయి.

అందుబాటులో ఉన్న విభాగాలు

మంగళగిరి ఎయిమ్స్‌లో దాదాపు 27 స్పెషాలిటీ సేవా విభాగాలు, మరో 12 సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ సేవా విభాగాలలో కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ, గుండె, హృదయనాళ వ్యవస్థ విభాగం, ఎండో క్రైనాలజీ అండ్ మెటబాలిజం, క్యాన్సర్ విభాగం, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, పిల్లల శస్త్ర చికిత్స, ఊపిరితిత్తుల వైద్యవిభాగం, రుమటాలజీ, కేన్సర్, యూరాలజీ విభాగాలు ఉన్నాయి. మరికొన్ని ప్రత్యేక ఓపీడీ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో సమగ్ర రొమ్ము సంరక్షణ, నొప్పి నివారణ, ప్యాంక్రియాస్ క్లినిక్, జన్యు అరుదైన వ్యాధి క్లినిక్, అంటువ్యాధుల క్లినిక్, సౌందర్య శస్త్రచికిత్స అండ్ రీజెనరేటివ్ మెడిసన్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ క్లినిక్, జన్యుసంబంధిత కౌన్సిలింగ్, ఫుట్ అండ్ చీలమండల క్లినిక్, ఆర్థ్రోస్కోపీ క్లినిక్, కౌమార గైనకాలజీ క్లినిక్, వంధ్యత్వ క్లినిక్, గైనీ అంకాలజీ క్లినిక్, హీమోథెరపీ క్లినిక్ వంటి ప్రత్యేక క్లినికల్ ఓపీడీ సేవలను ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు.

చిన్నారులపై.. చలి పంజా

(5వ పేజీ తరువాయి)

ఇన్‌ఫ్లుయెంజా ఏ, బీ అనే రెండు రకాలు ఉంటాయి. ఏ రకం ఊపిరితిత్తులపై ప్రభావం చూపడంతో పాటు అలసట, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలను కలిగిస్తుంది. చలి కాలంలో ఇది విజృంభిస్తుంది. రోగుల దగ్గులు, తుమ్ముల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తాయి. "నగరంలో ఫ్లూ బాధిత చిన్నారుల్లో మధ్య తరహా వ్యాధి లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయి. బాధితులు ఆసుపత్రుల్లో చేరి చికిత్సలు పొందాల్సినంత తీవ్రస్థాయిలో వ్యాధి లక్షణాలు లేవని" గుంటూరు జీజీహెచ్ పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి వస్తున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉన్న వారిని మాత్రం అడ్మిట్ చేసుకుని చికిత్సలు అందిస్తున్నట్లు ఆయన వివరించార

జాగ్రత్తలు ఇవీ

- పెద్దలు ఏడాదిలోపు చిన్నారులను పట్టుకునే ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. మాస్క్ ధరించాలి. తల్లిపాలే శిశువులకు అందించాలి
- ఏడేళ్లలోపు పిల్లలను సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఏడు గంటల వరకు బయటకు తీసుకెళ్లకూడదు.
- రాత్రి సమయాల్లో ఏసీల వినియోగం పూర్తిగా మానేయాలి. చిన్నారులు నిద్రించే గదుల్లో ఫ్యాన్ల వేగం తగ్గించాలి
- చలి కాలంలో ఐస్‌క్రీములు, కూల్‌డ్రింకులు వంటి చల్లని పదార్థాలను పిల్లలకు ఇవ్వకూడదు. గోరువెచ్చని నీళ్లు తాగించాలి
- ఐదేళ్లు వచ్చే వరకు ప్రతి ఏడాది ఫ్లూ వ్యాక్సిన్ ఇప్పించడం మంచిది. ఆస్తమా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇన్‌హేలర్లు వినియోగించాలి.
- చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచేలా పోషకాహారం అందించాలి.

తక్కువ వ్యాధి నిరోధక శక్తి ఉండటం వల్లే చలికాలంలో ఎక్కువగా వ్యాధుల బారిన పడతారు.

- మూడు రోజులకు మించి జలుబు, దగ్గు ఉంటే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు చేయించాలి.

నేడు డీసీ ఛైర్మన్‌లు, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక

అద్దంకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక మంగళవారం జరగనుంది. అద్దంకి, పంగులూరు డీసీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక అద్దంకి ఎన్నెస్పీ కార్యాలయం వద్ద, సంతమాగులూరు డీసీ ఎన్నిక సంతమాగులూరు ఎన్నెస్పీ కార్యాలయం, కొమ్మాలపాడు డీసీ ఎన్నిక కొమ్మాలపాడు సమీపంలో ఏబీసీ 24వ మైలు సెక్షన్ కార్యాలయం వద్ద జరగనున్నాయి. డీసీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునేం

దొంగ సొత్తు కొన్న వ్యక్తి అరెస్టు

రూ.15.50లక్షల విలువైన సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ



చోరీ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలలో దొంగతనం చేసిన వస్తువులను కొని తిరిగి విక్రయిస్తున్న శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన కాకినాడ కృష్ణారావు అలియాస్ రామకృష్ణను ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద రూ.15.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ఏఆర్.దామోదర్ వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది జనవరిలో నాగులుప్పలపాడు మండలం చదలవాడలో రఘునాయకస్వామి దేవాలయంలో తాళాలు పగులకొట్టి వెండి, బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకెళ్లారు. అదేవిధంగా బీనిడమనూరు సాయిబాబా గుడిలో చోరీకి పాల్పడ్డారు. రెండు చోట్ల చోరీకి పాల్పడింది ఒకే ముఠా. ఈ ముఠా దొంగిలించిన వస్తువులను కాకినాడ కృష్ణారావు కొనుగోలు చేశాడు. ఈ దొంగల ముఠాలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సవర సిపన్న అలియాస్ రవి, సవర బోగేష్, తెలంగాణలోని మెదక్ జిల్లాకు చెందిన బత్తిన శ్రీకాంత్‌లను గతనెల 24న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. ఈ ముఠా వద్ద నుంచి కృష్ణారావు 100 దేవాలయాలకు సంబంధించిన 300 కిలోలు వెండి కొనుగోలు చేశాడని తెలిపారు. ఆదివారం రాత్రి కృష్ణారావు శ్రీకాకుళం నుంచి హౌరా రైలులో దొంగ సొత్తుతో చెన్నై వెళుతుండగా ఒంగోలులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 15 కిలోలు వెండి, 4 గ్రాముల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విలువ రూ.15.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. కాగా కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్ బాబు, నాగులుప్పలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధులకు అతిథులు.. కాలానికి అతీతులు

- గ్రామ, వార్డు సచివాలయాలు వెలవెల
- ఏళ్లు గడుస్తున్నా గాడిన పడని నిర్వహణ
- పర్యవేక్షణలో కొరవడిన స్పష్టత
- నియంత్రణ లేక ఇష్టారీతిన వ్యవహరిస్తున్న సిబ్బంది
- సమయానికి సిబ్బంది రాక జనం అవస్థలు
- సర్వే పేరుతో కొందరు, శిక్షణ కోసం మరికొందరు

ఒంగోలు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలు మొక్కుబడిగా నడుస్తున్నాయి. వాటిలో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారం అంతా ఇష్టారాజ్యంగా మారింది. సమయ పాలన పాటించడం లేదు. పైగా సర్వేలు, ఇతర క్షేత్రస్థాయి పనుల పేరులతో విధులకు డుమ్మాకొడుతున్నారు. ఇందుకు సోమవారం ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించగా సచివాలయాలలో కనిపించిన దృశ్యాలే నిదర్శనం. గత వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయగా ఐదేళ్లు గడుస్తున్నా అవి ఇంకా గాడిన పడలేదు. జిల్లాలో మొత్తం 719 సచివాలయాలు ఉండగా గ్రామాల్లో 14 మంది, పట్టణాల్లో 11 మంది వంతున దాదాపు 8వేల మంది సిబ్బంది వాటిలో పనిచేస్తున్నారు. సగటున ప్రతి ఐదువేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసిన అప్పటి ప్రభుత్వం అందులో అడ్మిన్ సెక్రటరి పర్యవేక్షణలో హెల్త్, ఇంజనీరింగ్, రెవెన్యూ, సర్వేయర్, సంక్షేమ, గ్రామ పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, పశుసంవర్థక, విద్యుత్ ఇలా పలు శాఖల సిబ్బందిని నియమించారు. అయితే ఆ సిబ్బంది రోజువారి పరితీరు, పర్యవేక్షణగా విషయాలు అంతా గందరగోళంగా ఉన్నాయి.

వస్తారో రారో తెలియదు

ప్రధాన శాఖల సిబ్బంది ఆయా శాఖల జిల్లా, మండల స్థాయి అధికారుల సూచనలకు అనుగుణంగా ఉంటుండగా అడ్మిన్ సెక్రటరీలు పట్టణాల్లో మునిసిపల్ కమిషనర్లు, గ్రామాల్లోని వారు ఎంపీడీవో పర్యవేక్షణలో ఉన్నారు. ఎంపీడీవో, కమిషనర్ల ద్వారా జీతభత్యాల చెల్లింపులు జరుగుతాయి. అదేసమయంలో రోజువారీ పనులు ఆయా శాఖల వారీ ఉంటున్నాయి. దీంతో సచివాలయాల్లో సిబ్బంది పర్యవేక్షణ క్రమపద్ధతిలో ఉండటం లేదు. దాంతోనే ఏ సిబ్బంది ఎక్కడకు వెళ్లారు, ఆఫీసుకు వస్తారా రారా అన్న విషయం కూడా తోటి సిబ్బంది చెప్పే పరిస్థితి ఉండటం లేదు. ఇదేవిషయం సోమవారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో మరోసారి స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సోమవారం కలెక్టర్ నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందరూ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ప్రజా విజ్ఞప్తులను స్వీకరించి వాటికి పరిష్కారం చూపాలి. అయితే జిల్లాలోని సచివాలయాల్లో ఆ పరిస్థితి అత్యధిక ప్రాంతాల్లో కనిపించలేదు.

కార్యాలయాలకు డుమ్మా

సుమారు 50కిపైగా సచివాలయాలను ఆంధ్రజ్యోతి బృందం విజిట్ చేయగా 90శాతం సచివాలయాల సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాలేదు. ప్రస్తుతం జిల్లాలో హౌస్‌హోల్డ్ సర్వే జరుగుతుండగా ఆ పేరు చెప్పి అనేకమంది సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఉదయం 10 వరకు సర్వే నిర్వహించిన పదిన్నర గంటలకు కార్యాలయాల విధులకు హాజరుకావాల్సి ఉండగా అత్యధిక ప్రాంతాల్లో సర్వే పేరుతో ఆఫీసుకు డుమ్మాకొట్టారు. మరికొన్ని సచివాలయాల సిబ్బంది మండల కార్యాలయాల్లో శిక్షణ తరగతుల పేరుతో హాజరు కాలేదు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉండగా పైఅధికారులు అలాంటిరోజు శిక్షణ పేరుతో సిబ్బందిని కార్యాలయాలకు పిలవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలా ఒకవైపు సర్వే పేరుతో, మరోవైపు శిక్షణ పేరుతో అధికభాగం సిబ్బంది కార్యాలయాలకు హాజరుకాకపోగా మిగిలిన వారు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో జిల్లాలోని పలు సచివాలయాలు వెలవెలబోగా వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు, సిబ్బంది లేక అవస్థలు పడాల్సి వచ్చింది.

వారం నుంచి తిరుగుతున్నా.. 1బీ, అడంగల్ ఇచ్చే నాథుడే లేడు

రైతు గూడూరి మాల్యాద్రి, మెట్లవారిపాలెం, పీసీపల్లి మండలం బ్యాంకులో రుణం తీసుకునేందుకు వారం రోజుల నుంచి 1బీ, అడంగల్ కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. పెదయిర్లపాడు సచివాలయానికి వెళ్తే పేపర్లు లేవన్నారు. వెంగళాయపల్లి వెళ్లినా అక్కడా అదే మాట చెప్పారు. చింతగుంపల్లి సచివాలయానికి వస్తే ఇక్కడ ఆ ఉద్యోగే లేరు.

- పొదిలి : పట్టణంలోని సచివాలయం-2లో 11.44 నిమిషాలకు సచివాలయ కార్యదర్శి మాత్రమే హాజరయ్యారు. ఆయన వచ్చి తలుపులు తీస్తున్నారు. ఆసమయంలో విజిట్‌క్ వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ప్రశ్నించగా కొందరు సర్వేలో ఉన్నారని, మరికొందరు సెలవులో ఉన్నారని సమాధానం ఇచ్చారు. అదేవిధంగా సచివాలయం-3లో కేవలం కేవలం మహిళాపోలీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే హాజరైయ్యారు. మిగిలిన వారు విధులకు రాలేదాని ప్రశ్నించగా ఏఎన్ఎం సెలవులో ఉన్నారని మిగిలిన వారు సర్వే ఫీల్డ్ మీదకు వెళ్లినట్లు సమాధానం చెప్పారు. ఇదేవిదంగా అన్నీ సచివాలయాల్లో ఇదేపరిస్థితి నెలకొంది.
- ఒంగోలులో కుటుంబ సమగ్ర సర్వే చేయాలని అధికారులు భావించారు. ఈ మేరకు సచివాలయ సెక్రటరీలు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలి. ఆ ప్రక్రియ అంతా కూడా ఉదయం 7 నుంచి 10గంటలలోపు చేపట్టాలి. ఆ తర్వాత యథావిధిగా సచివాలయాలకు వెళ్లాలి. అయితే సిబ్బంది మాత్రం సర్వేల పేరుతో చెక్కేస్తున్నారు. ప్రతి సచివాలయంలో పదిమంది వరకు సెక్రటరీలు ఉండాల్సి ఉండగా, వారు ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. కార్యాలయంలో ఎవరూ లేకపోతే మరీ బాగుండదు కాబట్టి రోజుకు ఇద్దరు సెక్రటరీలు ఉంటారు. మిగిలిన వారు సర్వేల పేరుతో ఫీల్డులో ఉన్నట్లు చెబుతారు. ఇలా సోమవారం పరిశీలించగా ఎక్కడ చూసినా ఇద్దరు లేకపోతే ఖాళీ కుర్చీలు కనిపించాయి.
- జిల్లాలో సచివాలయాల పనితీరు అస్తవ్యస్తంగా ఉంది. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసి ఐదేళ్లు గడుస్తున్నా గాడినపడలేదు. సచివాలయాల పనితీరును పరిశీలన చేసేందుకు సోమవారం ఆంధ్రజ్యోతి బృందం విజిట్ నిర్వహించగా పలు చోట్ల సచివాలయాల్లో సిబ్బంది కనిపించలేదు. చాలాచోట్ల సచివాలయాలకు సిబ్బంది వేళకు రాకపోవడంపై ఆంధ్రజ్యోతి బృందం ఆరాతీయగా కొన్నిచోట్ల హౌస్‌హోల్డ్ సర్వే పేరుతో డుమ్మాకొట్టగా మరి కొన్నిచోట్ల మండల పరిషత్ కార్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాల కోసంవెళ్ళినట్లు తెలిసింది.



కొండాయపాలెంలో తారు రోడ్డుపై నిలిచిన నీరు

ఇది వాగు కాదు.. తారు రోడ్డు

కొండాయపాలెంలో దారిలో నిలిచిన నీరు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ప్రదాన రోడ్డు వాగులను తలపిస్తోంది. వ్యర్థ నీరు రోడ్డుపై నిలిచి అలానే ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెన్నుపల్లి అనంతవరం రోడ్డులో ఉన్న కొండాయపా లెం గ్రామంలోని బీసీ కాలనీ ఎదురుగా తారు రోడ్డుపై నీరు వాగులను తలపిస్తోంది. సైడు కాలువలు లేకపోవడం వలన వర్షాలతో కురిసిన నీరు రోడ్డుపైనే ఉంటుందని ప్రజలు తెలిపారు. ఈ రోడ్డులో ప్రయాణించే ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు వెంటనే నడి రోడ్డుపై నిలిచి ఉన్న నీటిని సైడుకు పంపేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వరికి తుఫాన్ దెబ్బ

- గాలులకు పడిపోయిన పంట
- కాపాడే పనిలో రైతులు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షా లు, గాలులతో పడిపోయిన వరి పంటను రక్షించుకోనే పనిలో రైతులు ని మగ్నం అయ్యారు. మండలం వల్లాపల్లిలో ఏబీసీ కాలు వ దిగువ భాగంలో వరి పంట కోత దశలో ఉంది. పంట కోత కోయకుండానే గాలులు, వర్షాలకు పంట మెత్తం నేలకరించింది. దీం తో రైతులు వరి దుబ్బులను పైకిలేపి వరి గడ్డితో కడుతున్నారు. నేలపై ఉంటే వరి విత్త నాలు నల్లగా వస్తాయని అందుకే ఇలా కొం త పంటను కాపాడుకుంటున్నామని రైతులు తెలిపారు. పంట కోత దశలో ఉండడం వలనే పంట పడిపోయిందని రైతులు తెలిపారు. పడి పోయిన వరి పోలంలో దుబ్బులను పైకి లేపడంతో కొంత విత్తనాలు రాలి పోతున్నాయని కొందరు రైతులు తెలిపారు.



వల్లాపల్లి వద్ద వర్షాలకు పడిపోయిన వరి పంట

మరోసారి అల్పపీడన హెచ్చరిక రైతుల్లో దడ పుట్టిస్తోంది. వానలు పడితే బోరు బావుల కింద వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టాలు తప్పవు అని వారు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి ఉదయం నుండే నల్లగా కారుమబ్బులు కమ్మడంతో రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు. పోలాల మీద కొందరు రైతులు వరి పంటను కోత కొసి నూర్పిడి చేసేందుకు సిద్ధం అవుతుండగా కొందరు రైతులు కోత కొసి ఉంచారు. కొందరు కోత దశలో ఉన్న పంటను వర్షాలు లేకుంటే కోసేందుకు సిద్ధం అవుతున్నారు.



విద్యార్థులతో కాలేజీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నిర్వాహకులు

ఎక్స్‌పోకు చీరాల విద్యార్థుల ప్రాజెక్ట్

చీరాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ స్టేట్ లెవల్ ఎక్స్‌పోకు చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల ప్రాజెక్ట్ ఎంపికయినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రాజెక్ట్ తయారు చేసిన ఈసీఈ బ్రాంచి విద్యార్థులు వికాస్, చంద్రమణికంఠ, గౌరీశివ సాయిప్రసాద్, లోకేష్‌ను ఘనంగా సత్కరించారు. ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్‌లో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఆటోమేటిక్ స్టైర్‌కేస్ లైట్ కంట్రోల్ యూజింగ్ ఆర్డినో తయారు చేయగా మొదటి బహుమతి సాధించినట్లు చెప్పారు. ఫెస్ట్‌లో 11 కళాశాలల నుంచి ప్రదర్శనలు రాగా, చీరాల సెయింట్ ఆన్స్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించి రూ.25వేల నగదు అందుకున్నట్లు చెప్పారు. అలాగే వీటితో పాటు వివిధ బ్రాంచీలలో ఐదు ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు, అధ్యాపకులు సీహెచ్ భానుశ్రీ, డిప్యూటీ డైరక్టర్ విజయ భాస్కరరెడ్డి, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ముడిరాయి తరలింపు

లారీలను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



బల్లికురవ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రానైట్ ముడిరాయి లారీలు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పర్మిట్ లేకుండా గ్రానైట్ క్వారీల నుంచి అక్రమంగా కటింగ్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న నాలుగు ముడి రాయి లారీలను ఆదివారం రాత్రి ఒంగోలు విజిలెన్స్ అర్ఐ రాజు పట్టుకున్నారు. సంతమాగులూరు మండలం గురిజేపల్లి గ్రానైట్ క్వారీల నుంచి ముడి రాయితో వస్తున్న నాలుగు లారీలను కొప్పరం గ్రామం వద్ద నిలుపుదల చేసి తనిఖీలు చేయగా పర్మిట్ లేకపోవడంతో వెంటనే సమీపంలో ఉన్న బల్లికురవ పోలీసు స్టేషన్‌కు ఆ లారీలను అప్పగించారు. లారీలను విజిలెన్స్ అధికారులు తమకు అప్పగించారని ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. పట్టుబడి స్టేషన్‌లో ఉన్న లారీలను చీరాల సేల్ ట్యాక్స్ సీటీవో భాస్కరరెడ్డి పరిశీలించారు జీఎస్టీ చెల్లించక పోవడంతో ఆ లారీలకు తమ శాఖ కూడా పెనాల్టీ విధిస్తుందని వారు తెలిపారు.

నీటి కుంటలో పడి పశువుల కాపరి మృతి

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి పశువుల కాపరి మందా పిచ్చయ్య (30) సోమవారం మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు వల్లాపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మందా రోశయ్య కుమారుడు తనకు ఉన్న పశువులను తీసుకుని మేతకు పొలాలకు వెళ్లాడు. ఉపాధి పథకం కింద గతంలో తీసిన నీటి కుంటలోకి పశువులు నీటి కోసం వెళ్లాయి. వాటిని బయటకు తోలేందుకు పిచ్చయ్య కుంటలోకి దిగడంతో లోతు ఎక్కువగా ఉండటంతో అయన నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందాడు. పిచ్చయ్యకు వివాహం కాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన యువకుడు ఏల్చూరి వెంకటనారాయణ సోమవారం ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. సంతమాగులూరు రోడ్డులో నిలిచి ఉన్న లారీని వెంకటనారాయణ బైక్‌పై వస్తూ ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అతనిని 108లో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.

బైకు అదుపు తప్పి

మార్టూరు : మండలంలోని జొన్నతాలి సెంటర్ వద్ద సోమవారం బైకు అదుపు తప్పి బోల్తా పడడంతో చంద్రయ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. చిలకలూరిపేట మండలం ఏలూరు గ్రామానికి చెందిన చంద్రయ్య బైకుపై ఒంగోలు వెళ్తుండగా బైకు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. హైవే అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి అనంతరం గుంటూరుకు తరలించారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి : ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొనడంతో మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. మద్దిపాడు మండలం కొలచనకోటకు చెందిన ఏసుబాబు సోమవారం మోటార్‌సైకిల్‌పై అద్దంకి వస్తూ నల్లవాగు సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. గాయాలైన ఏసుబాబును 108లో అద్దంకి ఆసుపత్రిలో చేర్పించారు.

వల్లాపల్లి పాఠశాలలో షార్ట్ సర్క్యూట్

విలువైన కంప్యూటర్ వస్తువులు దగ్ధం



కాలిపోయిన కంప్యూటర్

బల్లికురవ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రధానోపాధ్యాయుడు ఉండే గదిలో ఒక్క సారిగా విద్యుత్ వైర్లు నుంచి మంటలు చెలరేగాయి. ఎక్కడో వైర్లు టచ్ అయి షార్ట్ సర్క్యూట్ అయిందని స్థానికులు అంటున్నారు. మంటలలో కంప్యూటర్‌లు, విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విద్యార్థులు లేని గదిలో ఘ టన జరగడంతో పెనుప్రమాదం తప్పింది.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

అద్దంకి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పాస్టర్‌లు పాల్గొన్నారు. పాస్టర్‌లు ఆర్.భాస్కర్, చిట్టిబాబు, ఇజ్రాయిల్, సుశీలశర్మ, ప్రసాద్ క్రీస్తు సందేశాలను వినిపించారు. కార్యక్రమంలో టీవీ కృష్ణారెడ్డి, కాకాని అశోక్, శింగయ్య పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న పాస్టర్లు



పూజచేసి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు

కారంచేడు వాటర్ ట్యాంక్ మరమ్మతులు

ఎమ్మెల్యే చొరవతో రూ.15లక్షల వ్యయంతో పనులు

కారంచేడు/పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారంచేడు మంచినీటి పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంక్ శిధిలావస్థకు చేరుకుంది. ఈవియాన్ని తెలుగుదేశం పార్టీ నేతలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకుపోయారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే దానికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.15లక్షల వ్యయంతో దెబ్బతిన్న వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం అధికారులు, పార్టీ నేతల సారథ్యంలో పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రంలో ఎంపీడీవో నేతాజీ, ఈవో సూర్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ కుమార్, సర్పంచ్ శివపార్వతి, ఎంపీటీసీ సభ్యుడు శేషారత్నం, నాయకులు శ్రీరాములు, ప్రహ్లాద, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

పంగులూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తక్షణమే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ సింగారావుకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, జాన్, సుబ్బారావు, తానికొండ సుధాకరరావు, రావూరి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

మార్టూరు : రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టు బాటు ధరలు కల్పించి గ్రామాలలోనే కొనుగోలు చేయాలని రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మార్టూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం నేతలు ధర్నా చేసి అనంతరం తహ సీల్దార్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు రాంబాబు, హనుమంతురావు, సాంబశివరావు పాల్గొన్నారు

ఇంకొల్లు : స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేసి తహసీల్దార్ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేసారు. కార్యక్రమంలో యర్రం గోవిందరెడ్డి, భానుప్రసాద్, అన్నెం ఆదయ్య, మాదాల అంజియ్య రైతులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

ఇంకొల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు అందజేసిన అర్జీలలో సమస్యల పరిష్కరించే దిశగా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ వెంకటరత్నం అన్నారు. సోమవారం వీఆర్వోలు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన గ్రామ సభలలో అందిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, వాణీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేరాలను విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలి

చీరాలటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలని చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చీరాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ పరిధిలోని ముగ్గురు పాత నేరస్థులను సోమవారం తహసీల్దార్ గోపీకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏడాదికి రూ.లక్షకు బైండోవర్ చేసినట్లు వివరించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించి జైళ్ల పాలు కారాదని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవారితో మర్యాదగా నడుచుకోవాలి

డీఎస్పీ మహ్మద్ మొయిన్

వేటపాలెం/చీరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని డీఎస్పీ మ హ్మద్ మొయిన్ సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా సోమవారం ఆయన వేటపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపౌరుడు యూనిఫాం లేని పోలీసేనని, అపరాధ పరిశోధనలో ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు. అందుకు అనుగుణంగా స్నేహ పూర్వక వాతావరణాన్ని మలుచుకోవాల ని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతతో హైవే పనులు పూర్తి చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
- అధికారులకు ఎమ్మెల్యే ఏలూరి ఆదేశం



హైవే అథారిటీ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్న హైవే నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పిడుగురాళ్ల - ఓడరేవు హైవే పనులకు సంబంధించి పెండింగ్ వివరాలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో భాగంగా రైతుల వద్ద నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పలు సమస్యలను అధికారులు వివరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఏలూరి మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు చూపుతో నిర్మాణాలను చేపట్టాలన్నారు. తిమ్మరాజుపాలెం, కారంచేడు గ్రామాల పరిధిలో హైవే అండర్ డ్రైనేజీ పటిష్టంగా ఉండాలని రైతులు కోరిన విధంగా మూడు మీటర్ల నుంచి పది మీటర్లకు పెంచాలని అధికారులను ఆదేశించారు. వరదలు సంభవించినప్పుడు రైతుల పంట భూములకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో హైవే ప్రాముఖ్యతను వివరించి ఈప్రాంత అభివృద్ధికి దోహదం చేసే అంశాలను తెలియజేసి రైతుల సమ్మతితో భూములను తీసుకోవాలని సూచించారు. హైవే పక్కన వరద కాలువ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వరద కాలువ నిర్మాణం చేపడితే రోడ్డు కూడా పటిష్టంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ పరంగా ఉన్న సమస్యలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ప్రతి గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిమ్మరాజుపాలెం సబ్‌స్టేషన్ వద్ద అండర్ డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉప్పుటూరు వద్ద సువిశాలమైన వెహికల్ అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నల్లమడ నుంచి రొంపేరు వరకు డ్రైన్‌లను ఆధునికీకరిస్తామని ఏలూరి స్పష్టం చేశారు. భూములను కోల్పోయిన రైతులకు పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. కార్యక్రమంలో హైవే అథారిటీ డీఈ, ఈఈ, జేఈలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన ధనుర్మాస పూజలు

చినగంజాం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు దేవాలయాల్లో ధనుర్మాస పూజలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయాల అర్చకులు స్వామివార్లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పలు ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. చినగంజాం, భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానం, కడవకుదురు సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామాలయంలో మహిళా భక్తులు తిరుప్పావై కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుప్పావై ప్రాసురాలు జనవరి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వినియోగం చేశారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జ్యోతిర్లింగ దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

చీరాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మహా కాళేశ్వర జ్యోతిర్లింగ ఆలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈసందర్భంగా స్థల పురాణంను స్థానిక అర్చక స్వాములు వివరించారు. ఆలయ మర్యాదలతో ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే కొండయ్య వెంట ఆయన సతీమణి బాల కొండమ్మ, కుమారులు గౌరీ అమర్నాథ్, టిడిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్, కుమార్తె దేవి ఉన్నారు.



ఉజ్జయిని దేవస్థానంలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే కొండయ్య



వేలం నిర్వహణ ధ్రువీకరణపత్రం అందుకుంటున్న దేవదాయ శాఖ పరిశీలకులు వేణుగోపాల్‌రావు

నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానంలో వేలంపాటలు

- గత ఏడాదికన్నా రూ.5.3.2లక్షలు అదనపు ఆదాయం
- మొత్తం రూ.12.84లక్షలకు దక్కించుకున్న పాటదారులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ పరిధిలో వేంచేసి ఉన్న శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు వివిధ రకాల సేవలు అందించేందుకుగాను సోమవారం సంబంధిత దుకాణాల నిర్వహణకు బహిరంగం వేలంపాటను నిర్వహించారు. దేవదాయ శాఖ పరిశీలకుడు వేణు గోపాల్‌రావు సమక్షంలో కొబ్బరి కాయలు, ఇతర పూజా సామగ్రి, అమ్మవారి మొక్కులు చెల్లించిన వస్త్రాలు, తల నీలాలు తదితరాలకు సంబంధించిన వేలం పాటలకు రూ.12.84లక్షలు చెల్లించే విధంగా పాటదారులు పాటలు పాడారు. గతేడాది కన్నా ఈసారి రూ.5.32 లక్షల అదనపు ఆదాయం సమకూరుతున్నట్లు వేణుగోపాల్‌రావు తెలిపారు. వచ్చే యేడాది జనవరి 1వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు పాటదారులు సంబంధిత పాటలకు సంబంధించి భక్తుల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేసుకునేందుకు అర్హులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పీ శ్రీనివాసరావు, మంగమూరు ఆలయ ఈవో మద్దినేని శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేయాలి

పంగులూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యంగా సర్పంచ్‌లు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. గ్రామాలలో పేదరిక నిర్మూలన, సదుపాయాల కల్పన, పచ్చదనం - పరిశుభ్రత, ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధి లక్ష్యాలుగా ఎంచుకొని వాటి సాధన కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమ్మ, ఈవోఆర్డీ సుమంత్, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, సర్పంచ్‌లు, గ్రేడ్-1,4 కార్యదర్శులు, వెల్ఫేర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, సర్వే, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రణాళికతోనే అభివృద్ధి


చినగంజాం : గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసుకోవాలని శ్రీకేశవరెడ్డి కోర్స్ జాయింట్ డైరెక్టర్, డీఎల్‌డీవో కే.పద్మావతి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్ నందు సుస్థిర అభివృద్ధి నిర్దేశిత లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సోమవారం జరిగిన మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని



మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపారాణి

ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.విజయభాస్కరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలతలు పలు అంశాలపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేదుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం అనూరాధ, పీఆర్ఏఈ ఆనంద్, ఏఈ జ్యోతి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



24న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యారమ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక, ఆర్థిక, పనులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అరుణమ్మ అధ్యక్షతన జరిగే సమావేశాలకు సభ్యులంతా హాజరు కావాలని కోరారు.



పోలీస్ స్పోర్ట్స్ మీట్..

విజేతలతో ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

ఓవరాల్ చాంపియన్ డీఏఆర్

- ఉత్కంఠగా సాగిన ఫైనల్స్
- క్యాంపైర్‌లో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసులు

నెల్లూరు (క్రైం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న జిల్లా పోలీసు వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 సోమవారం ముగిసింది. అనేక క్రీడల్లో పోలీసులు నువ్వానేనా అంటూ తలపడ్డారు. పోటీలు చివరి దశకు చేరుకోవడంతో ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. 126 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను జిల్లా ఏఆర్ విభాగం కైవసం చేసుకుంది. పురుషుల చాంపియన్ షిప్‌ను 23 పాయింట్లతో డీఏఆర్‌కు చెందిన ఏఆర్‌పీసీ 1818 ఎన్ అంకయ్య కైవసం చేసుకోగా, మహిళల చాంపియన్ షిప్‌ను 26 పాయింట్లతో

- మిగతా 6లో..



కుడి కాలువ తూము గోడలను పగలగొడుతున్న ఇరిగేషన్ సిబ్బంది

2 రోజుల్లో గేటు తొలగిస్తాం!

- 'రాళ్లపాడు' వద్ద ప్రకాశం జిల్లా సీఈ వెల్లడి
- తూము గోడలు పగలగొట్టిన అధికారులు
- కుడికాలువకు వంద క్యూసెక్కుల నీరు విడుదల
- రెండవ రోజూ కొనసాగిన రైతుల ఆందోళన

6 లో..



భక్తిశ్రద్ధలతో ధనుర్మాసం సోమవారం ప్రారంభమైంది. ప్రతి ఇంటి ముంగిట రత్నాల ముగ్గులు వేసి శ్రీమహాలక్ష్మిని ఆహ్వానించారు. అలాగే జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవికి శ్రీకృష్ణస్వామిలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. నెల్లూరులోని ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో సోమవారం రాత్రి తిరుప్పావై పారాయణం, భజనలు జరిగాయి.

సిటీ ప్లానింగ్ అధికారిపై వేటు

డైరెక్టర్ కార్యాలయానికి కృష్ణ కిశోర్ సరెండర్

మరో ఇద్దరు ప్లానింగ్ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు (సిటీ), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానింగ్ అధికారి కృష్ణ కిశోర్‌ను టౌన్ ప్లానింగ్ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ కమిషనర్ సూర్య తేజ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భవన నిర్మాణాల విషయంలో కృష్ణకిశోర్ పనితీరు ఆశాజనకంగా లేదని, కఠినంగా వ్యవహరించలేకుండా ఉన్నారంటూ కమిషనర్ పేర్కొన్నారు. అలాగే ఇద్దరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలపైనా

- మిగతా 6లో..

వైభవంగా సింహపురి యునైటెడ్ క్యారల్స్



నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 16వ సింహపురి యునైటెడ్ క్యారల్స్ వైభవంగా జరిగింది. నగరంలోని క్రైస్తవ సంఘాలన్నీ సంయుక్తంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఏబీఎం కాంపౌండ్‌లో నెల్లూరు బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం, సింహపురి అసోసియేట్ ఇన్ క్రైస్ట్ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్, జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, డౌనీ హాలు పాస్టర్ కె.శ్యాంసన్ కుమార్ తదితరులు దైవ ప్రార్థనలు చేసి కొవ్వొత్తులు, బెలూన్స్‌తో ర్యాలీని ప్రారంభించారు. బట్వాడిపాలెం సెంటర్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా డేవిడ్ దయాసాగర్, పి.జానీజో, క్వయర్ డైరెక్టర్‌గా బెల్లి శ్యాంసన్, డైరెక్టర్‌గా మౌంట్‌బాటన్ వ్యవహరించారు.

జూడో సైన్యం

జిల్లా జట్ల ఎంపిక



కావలి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూడో జిల్లా అడ్‌హక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్తసత్రం జెడ్పీ హైస్కూల్ పాఠశాల ప్రాంగణంలో బాల, బాలికల జూడో జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షులు మురళి పర్యవేక్షణలో జరిగిన ఎంపికలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడారు. జూడో ప్రాచీన క్రీడ అని మల్ల యుద్ధాన్ని పోలివుండే ఇలాంటి పోటీలకు ఎంపికలు నిర్వహించడం విద్యార్థులకు ఈ క్రీడల పట్ల మక్కువ పెరుగుతుందన్నారు. ఎంపికల్లో జిల్లావ్యాప్తంగా 80మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఎంపికైన వారు 21, 22 తేదీల్లో విజయవాడలో జరగనున్న అంతర్ జిల్లాల జూడో పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

అచ్చొచ్చిన స్కూటర్‌పై రయ్.. రయ్...!



ఈయన్ను గమనించారా!?. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. అదేంటి సాదాసీదాగా పాతకాలంనాటి బజాజ్ చేతక్ స్కూటర్‌లో వస్తున్నాడని అనుకుంటున్నారా!? అవును... ఆ బండి ఆయనదే. శ్రీధర్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది ఈ స్కూటర్‌పైనే. అపురూపమైన ఆ జ్ఞాపకాన్ని భద్రంగా దాచిపెట్టుకున్నారు. తాజాగా ఆ స్కూటర్‌కు మరమ్మతు చేయించి తన పాతస్మృతులను నెమరు వేసుకుందామని ఇదిగో ఇలా చేతక్ ఎక్కి నడుపుతూ మాగుంట లేఅవుట్‌లోని తన ఇంటి నుంచి కేవీఆర్ కూడలి వద్దనున్న కార్యాలయానికి వచ్చారు. ఈ సన్నివేశాన్ని ఎమ్మెల్యే అభిమానులు, అనుచరులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా అదికాస్త వైరల్ అయ్యింది.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

సాధించిన పతకాలు...

- 2011లో ఆర్టీసీ కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలైన క్రమంలో క్రీడా విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో 2012 ఉద్యోగానికి అర్హత పొంది శిక్షణ పొందారు. అనంతరం కావలి ఆర్టీసీ డిపోలో తొలిసారి చంద్రశేఖర్ విధుల్లో చేరారు.
- 2014లో అనంతపురంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని జావలిన్ త్రో, షార్ట్‌పుట్ బాల్, డిస్కస్‌త్రో విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడమే కాకుండా ఓవరాల్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ మెడల్ కూడా కైవసం చేసుకున్నారు.
- 2024 ఆగస్టులో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయిలో షార్ట్‌పుట్ విభాగంలో బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందుకొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- డిసెంబరు 6,7,8 విశాఖపట్నంలో జరిగిన ఆర్టీసీ క్రీడల్లో షార్ట్‌పుట్‌బాల్ పోటీలో రజిత పతకంతో జాతీయస్థాయిలో మెరిశాడు.
- ఆర్టీసీ ఎండీ, ప్రస్తుతం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేతుల మీదుగా మెడల్, జ్ఞాపికను అందుకున్నారు. ఆర్టీసీలో నిబద్ధత కలిగిన ఉద్యోగిగా చంద్రశేఖర్ పేరు సంపాదించారు. ఉలవపాడులో యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలవడం అభినందనీయమని గ్రామస్థులు కొనియాడుతున్నారు.



ప్రతిభ PRATIBHA

పట్టుదలతో ఎదిగి.. పతకాలు సాధించి!

షార్ట్‌పుట్ బాల్, జావెలిన్ త్రో క్రీడల్లో చంద్రశేఖర్ ఘనత

జిల్లా నుంచి జాతీయ స్థాయిలో రాణింపు ● ఆర్టీసీలో కొలువుకు దోహదపడిన క్రీడా సామర్థ్యం

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా నేపథ్యం లేని కుటుంబం నుంచి జాతీయస్థాయి క్రీడల్లో పతకాలు సాధించే వరకు ఎదిగి గ్రామీణ యువతకు ఆదర్శంగా నిలిచాడు ఉలవపాడుకు చెందిన ఈర్ల చంద్రశేఖర్. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఈయన కష్టపడి చదివి క్రీడల్లో తన ప్రతిభను నమ్ముకొని ఏపీఎస్ ఆర్టీసీలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు.

● చిన్ననాటి నుంచే..

చంద్రశేఖర్ బాల్యం, విద్యాభ్యాసం తన అమ్మమ్మ ఊరు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం జమ్ములపాలెం ఉన్నత పాఠశాలలో సాగింది. చంద్రశేఖర్‌లోని ప్రతిభను ఉపాధ్యాయుడు పులివర్తి బసవయ్య గుర్తించి షార్ట్‌పుట్ బాల్, జావెలిన్ త్రో ఆటల్లో శిక్షణ ఇచ్చారు. స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటూ మెరుగైన ప్రతిభ చూపి పాఠశాలకు ట్రోఫీలు సాధంచి పెట్టాడు. పాఠశాల విద్యాభ్యాసంలోనే రాష్ట్ర త్రైక్వాండో పోటీల్లో కూడా పాల్గొని మెడల్ సాధించాడు. ఆ తర్వాత సింగరాయకొండ గౌతమ బుద్ధ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తయిన వెంటనే హోంగార్డు ఉద్యోగం సాధించాడు. హోం గార్డుల స్టేట్ క్రీడా పోటీల్లో కందుకూరు డివిజన్ స్థాయిలో 100మీటర్ల పరుగు పందెం, హై జంప్, షార్ట్‌పుట్ బాల్‌లో మెరుగైన ప్రతిభ కనబర్చి కందుకూరు డివిజన్‌ను ప్రథమ స్థానంలో నిలిపాడు.



డీజీపీ, ఆర్టీసీ చైర్మన్ నుంచి అవార్డు అందుకుంటూ..

కలెక్టర్ చెబుతున్నా...

హెల్మెట్ ధారణపై ప్రజలకు రవాణా, పోలీసు అధికారులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా, వాహనదారుల్లో మార్పు రావడం లేదు. రాష్ట్రంలో హెల్మెట్ నిబంధన అమలుపై మూడు రోజుల క్రితం హైకోర్టు, పోలీసు, రవాణా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో జిల్లా అధికారులు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరింపచేసే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే ప్రతి నెలా జరిగే రోడ్డుప్రమాదాల సమీక్షలో కలెక్టర్, ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు పదేపదే సూచిస్తున్నారు. అయినా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

ప్రమాదాల బారిన యువత

ద్విచక్రవాహనాలు నడుపుతూ రోడ్డుప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. దాదాపు 80 శాతానికిపైగా యువత జిల్లాలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నారు. జాతీయ రహదారిపై జరుగుతున్న ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో ఎక్కువుగా యువతే ఉంటున్నట్లు అధికారులు తెలియచేశారు. రూ. లక్షలు విలువ చేసే బైక్‌లు కొంటు న్న యువత రూ. వందల విలువ చేసే హెల్మెట్ కొనుగోలు చేసి వాడేందుకు ముందుకు రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

- శిరస్త్రాణం లేకుంటే ప్రాణాపాయమే
- హైకోర్టు ఆదేశాలతో కనువిప్పు కలిగేనా!?

యువత మేలుకో.. హెల్మెట్ పెట్టుకో !



నెల్లూరు (క్రైం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి వేగానికి ఉన్న ప్రాధాన్యతను భద్రతకు ఇవ్వడం లేదు. దీంతో భారీ మూల్యం చెల్లించుకోక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం మూలంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. జిల్లాలో ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్లే అధికంగా జరుగుతున్నాయి. గత మూడేళ్లలో వందలాది మంది అక్కడికక్కడే మృతి చెందినా, గాయాలపాలైన గణాంకాల పరిస్థితి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఓ పక్క పోలీసు అధికారులు, మరో పక్క రవాణాశాఖ అధికారులు ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని పదే పదే చెబుతున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.



హెల్మెట్ లేకుండా బైక్‌పై ముగ్గురు యువకులు

జిల్లాలో ద్విచక్రవాహనాల ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు	చలానాలు
2022	305	126	265	రూ.2,45,818
2023	306	148	302	రూ.1,19,969
2024	250	140	195	రూ.29,728

నెల్లూరు నగర పరిధిలో ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు	చలానాలు
2022	48	20	30	రూ.84,684
2023	52	16	51	రూ.19,226
2024	50	24	43	రూ.3,784

సొంతూరుకు వెళుతూ పరలోకాలకు..

నెల్లూరు(క్రైం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సొంతూరుకు బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నెల్లూరు నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. ఉలవపాడు మండలం భీమవరానికి చెందిన రామకృష్ణ(41)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన కుటుంబంతో పాటు తొమ్మిదేళ్ల క్రితం సర్వేపల్లికి వచ్చి బేల్దారు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సోమవారం ఉదయం సొంతూరులో పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయలుదేరిన ఆయన జాతీయ రహదారిపై వస్తుండగా సరిగ్గా ఎన్టీఆర్ నగర్ ఎస్వీజీఎస్ కళాశాల వద్దకు వచ్చేసరికి వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీరిచ్చేవరకు తగ్గేదేలా..!

- 'రాళ్లపాడు' వద్ద కొనసాగిన రైతుల ఆందోళన
- రెండు రోజుల్లో దెబ్బతిన్న గేటు తొలగిస్తాం : సీఈ

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము నుంచి త్వరగా నీరిచ్చి ఆదుకోవాలని కోరుతూ రెండవ రోజు సోమవారం కూడా రైతులు ఆందోళన కొనసాగించారు. ఉదయం 11 గంటలకు చినపవని, పెదపవని, అన్నెబోయినపల్లి, భీమవరప్పాడు, శాయిపేట, మక్కెనవారిపాలెం గ్రామాల రైతులు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. రూ.లక్షలు పోసి సాగు చేసిన వరినార్లు, వరినాట్లు ఎండి పోతున్నాయని, త్వరగా నీరివ్వాలంటూ అధికారులతో వాదనకు దిగారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అక్కడున్న ప్ర కాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మితో వాదనకు దిగారు. అనంతరం రోడ్డుపై బైఠా యించారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రోడ్డుకు బైక్‌లను అడ్డుపెట్టి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బస్సుల్లోని ప్రయాణికులు తాము ఇబ్బంది పడుతున్నామని రైతులతో అనగా, వారు ఆందోళన విరమించారు.

● నివేదిక సిద్ధం చేయండి : దివి శివరాం

అంతకముందు ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తూము వద్ద జరుగుతున్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఎస్ ఈ వరలక్ష్మితో మాట్లాడారు. వెంటనే కాలువకు సాగునీరు ఇవ్వాలని కోర డంతోపాటు అధికారులు, సిబ్బంది లేకుండా ప్రాజెక్టు నిర్వహణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు ఏమేమి అవసరమో జాబితా తయారు చేసి తనకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు అందజేస్తే, తాము సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ఎస్ఈ వరలక్ష్మితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

● కాలువలో వంద క్యూసెక్కుల నీరు

అయితే కుడి కాలువ తూములో దెబ్బతిన్న గేటు పైకి రాకపోవడంతో ఎస్ఈ వరలక్ష్మి ఆధ్వర్యంలో డీఈఈ ఎం వెంకటేశ్వర్లు ఇతర అధికారులు, సిబ్బంది కంప్రెషర్ ద్వారా దెబ్బతిన్న స్టాప్‌లాక్ గేటుకు, సర్వీసు గేటు మధ్యలో ఉన్న గోడలను పగలగొట్టారు. దీంతో నీరు తూములోని బావిలోకి వెళ్లి అక్కడ నుంచి కాలువలోకి పారుతోంది. అలాగే సైఫన్ పద్ధతిలోనూ నీరు పంపిస్తుండగా, ప్రస్తుతం కాలువలో 90 నుంచి 100 క్యూసెక్కుల మేర నీరు ప్రవహిస్తున్నట్టు డీఈఈ తెలిపారు. కాగా, సాయంత్రం 6 గంటల సమయంలో ప్రకాశం జిల్లా సీఈ శ్యాంప్రసాద్, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థ బెకామ్ సాంకేతిక నిపుణులు పరశురాంరెడ్డి, మరికొందరు సాంకేతిక నిపుణులు కుడి కాలువ తూము గేట్లను పరిశీలించారు. సీఈ మాట్లాడుతూ రెండు రోజుల్లో దెబ్బతిన్న గేటును తొలగించి నీరిస్తామన్నారు.

అధికారుల అలసత్వం లేదు : ఎస్ఈ

రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ స్టాప్‌లాక్ గేటు మరమ్మతు పనుల్లో అధికారుల అలసత్వం లేదని ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గేటు మరమ్మతులకు గురైన విషయం తమకు తెలిసిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేసి రాష్ట్రస్థాయి సాంకేతిక నిపుణులను రప్పించి, అన్ని రకాల ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు రోజుల వ్యవధిలో రిప్యూటెడ్ కంపెనీ ద్వారా గేటును ఎత్తి పూర్తి స్థాయిలో నీటిని ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. గేటును బాగు చేసి రైతులకు నీరిచ్చేందుకు పది రోజులుగా శ్రమిస్తున్న అధికారులను నిందించడం సరికాదని పేర్కొన్నారు.



రోడ్డుపై వాహనాలు అడ్డుపెట్టి ఆందోళన చేస్తున్న రైతులు

విద్యుదాఘాతంతో హేచరీ ఓనర్ మృతి

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కరేడు పంచాయతీ పరిధిలోని బట్టియ సోమయ్య పాలెం గ్రామ సముద్ర తీర ప్రాంతంలో సోమవారం విద్యుదాఘాతంతో సంధ్య హేచరీ నడుపుతున్న శ్రీకాకుళం జిల్లా బత్తిలి గ్రామానికి చెందిన కొంపల శ్రీనివాస రావు (45) మరణించాడు. హేచరీకి నీటి సరఫరా కోసం మోటార్లు స్విచ్ ఆన్ చేసేందుకు సముద్రం ఒడ్డున నిర్మించిన మోటార్ల షెడ్ వద్దకు వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో తోటి పనివాళ్లు వెళ్లి చూడగా శ్రీనివాస రావు విగత జీవుడై ఉండటాన్ని గమనించి ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆయన విద్యుత్ షాక్‌తో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ అంకమ్మ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్ఏ-1 గణితం ప్రశ్నపత్రం లీక్!

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అస్సెస్మెంట్ (ఎస్ఏ-1) సోమవారం జరగాల్సిన గణితం పరీక్ష పేపర్ లీక్ కావడంతో వాయిదా పడింది. 1 నుంచి 10వ తరగతి వరకు ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతున్నాయి. ఎంఈవో కార్యాలయాలకు ప్రశ్నపత్రాలు చేర్చగా, అక్కడ నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సబ్జెక్టు వారీగా గంట ముందు పాఠశాలలకు తీసుకెళ్తారు. ఈ క్రమంలో సోమవారం జరగాల్సిన గణితం పేపరు ముందురోజు ఆదివారం వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో చక్కర్లు కొట్టింది. దీంతో 6 నుంచి 10వ తరగతుల గణితం పరీక్ష వాయిదా వేయాలని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు ఎంఈవో-2 రమణయ్య తెలిపారు. మంగళవారం నుంచి జరగాల్సిన సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. కాగా, వాయిదా పడిన గణితం పరీక్షను 20వ తేదీన నిర్వహించనున్నట్లు సమాచారం.

● వాస్తవాలు వెలికితీయాలి : పీఆర్టీయూ

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : గణితం ప్రశ్నపత్రాన్ని వాట్సాప్‌కు పంపిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి నాటకం తిరుమలయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సైబర్ నేరగాళ్ల వల్ల లీక్ అయిందా, అధికారులే లీక్ చేశారా అన్న అంశాలపై వాస్తవాలను వెలికితీయాలన్నారు.



ఉదయగిరి : పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు అప్పగిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు



వరుస పందెంలో మహిళా పోలీసులు

ఓవరాల్ చాంపియన్ డీఏఆర్

(5వ పేజీ తరువాయి)

ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ 1956 ఎ చందన దక్కించుకుంది. పలు పోటీల్లో హోంగార్డులూ ప్రతిభ కనపరిచారు. అనంతరం విజేతలుగా నిలిచిన పోలీసులకు, హోంగార్డులక ఎస్పీ జీ కృష్ణకాంత్ బహుమతులు ప్రదానం చేశారు. గెలుపోటములను ఒకేలా తీసుకుంటూ అందరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్యాంప్ ఫైర్‌లో అధికారులు, సిబ్బంది అన్న తేడా లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు.

సిటీ ప్లానింగ్ అధికారిపై వేటు

(5వ పేజీ తరువాయి)

వేటు వేశారు. చిల్డ్రన్స్ పార్కు వద్ద నివా హాస్పిటల్ నిర్మాణంలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఇందులో బాధ్యతా రాహిత్యం, నిర్లక్ష్యం వహించిన 17/1 సచివాలయంలోని సెక్రటరీ టీ రాఘవేంద్రరావును విధుల నుంచి తప్పించారు. సమీప సచివాలయ కార్యదర్శి సుధీర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని టీపీబీవో కే వెంకటేష్‌ను ఆదేశించారు. కాగ రవీంద్రనగర్‌లో (21/1) అనుమతులకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించిన కమిషనర్ ఇందుకు బాధ్యుడైన స్థానిక ప్లానింగ్ సెక్రటరీ ఎన్ వెంకట కిషోర్‌ను విధుల నుంచి తప్పించి సమీప సచివాలయ కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నేటి నుంచి శిక్షణ

ఉదయగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం నుంచి రెండు రోజులు సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మౌలిక వసతులు కల్పించేందుకు తొ మ్మిది అంశాలపై శిక్షణ నిర్వహించనున్న ట్లు ఆయన తెలిపారు. శిక్షణకుశాఖల ఉద్యోగులు, సర్పంచు లు హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనంతసాగరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించాలని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్వర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రాళ్లపాడు ప్రాజెక్టు బ్రిడ్జి రోడ్డు

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు బ్రిడ్జి రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా ఉన్నది. 2013లో జైకా నిధులు రూ.20 లక్షలతో మంజూరు అయితే అధికారులు గుంతలు పూడ్చిన ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. వేసిన కొన్నిరోజులకే రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు సందర్శనకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు సందర్శిస్తుంటారు. అలాగే ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు రోడ్డు కనెక్టివిటీగా ఉంది. ప్రతి నిత్యం ఈ రోడ్డుపై లింగసముద్రం నుండి కావలి, కలిగిరి మీదుగా నెల్లూరు, కందుకూరు, ఒంగోలు పట్టణాలకు బస్సులు తిరుగుతుంటాయి. ముఖ్యంగా శని, ఆదివారాల్లో రోడ్డు మీదుగా మాకొండ, దత్తాత్రేయస్వామి ఆలయాలకు వాహనాల్లో భక్తులు వస్తుంటారు.



బంగ్లావీధి సిమెంట్ రోడ్డులో కాలువలా తీసిన గుంట

రోడ్డు నిర్మాణానికి అడ్డుగా తాత్కాలిక పాక



సిమెంట్ రోడ్డులో నిర్మించిన తాత్కాలిక పాక

ఉలవపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరేడు ఎస్సీకాలనీలో రావినూతల మాధవ ఇంటి నుంచి ఎస్సీల శ్మశానం వరకు 100మీటర్లు రూ.6 లక్షలతో నిర్మాణం చేపట్టారు. మిగిలిన భాగం నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ తీర్మానం చేసి సిమెంట్ రోడ్డు మంజూరు చేయించారు. అదే కాలనీకి చెందిన కత్తి ఆదిలక్ష్మీ కుటుంబం ప్రస్తుతం నిర్మాణం చేపట్టాల్సిన రోడ్డుకు అడ్డంగా పాలిథన్ కవర్‌తో తాత్కాలిక పాక వేసు కుని స్థలాన్ని వాడుకుంటున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణం జరగుతుందని వేసిన పాకను తొలగించాలని కాలనీవాసులు సూచించినా ఖాతరు చేయడం లేదు. ఈ విషయంపై కార్యదర్శి భాస్కర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక అధికార పార్టీ నాయకుల్లో ఒకవర్గం సదరు వ్యక్తికి మద్దతు ఉండ టం వలనే పాకను తొలగించడం లేదని ఎస్సీ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ కాలనీకి మం జూరైన రోడ్డును గ్రామంలోని రెడ్డి సామాజికవర్గం ప్రాంతానికి మార్చినట్లు పంచాయతీ రాజ్ ఏఈ మూర్తి తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మాజీ ఎమ్మెల్యే కంభం

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో శనగ పంట సాగుచేసి దెబ్బతిన్న రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో మొలక దశలో ఉన్న పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీంతో ప్రభుత్వం పంట దెబ్బతిన్న రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ లో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు అం దించనున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుంద న్నారు. కార్యక్రమంలో ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి ఎన్ వెంకట సుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంభం

తనఖాలు లేకుండా రైతులకు రుణాల మంజూరు

● కెనరా బ్యాంకు ఆర్ఎం ఆడారి నాగరాజు

అల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తనఖాలకు లేకుండా తమ బ్యాంకు రైతులకు రుణాలు అందజేస్తుందని కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు ఆడారి నాగరాజు తెలిపారు. ఇస్కపల్లి కెనరాబ్యాంకుశాఖ 50ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన సభలో ఆయనతో పాటు టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, ఫైడేరు ఎస్కేప్-2 అధ్యక్షుడు బీద గిరిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. కెనరా బ్యాంకు వ్యవస్థాపకులు అమ్మెంబాల్ సుబ్బారావు నాటిన బీజం నేడు మహా వృక్షంగా ఎదిగి కోట్ల మందికి ఆదెరువుగా మారిందని చెప్పారు. ఎంతోమంది ఖాతాదారులు, రుణ లబ్ధిదారులు, ఉద్యోగులు రుణాలు పొంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. మత్స్యకారులకు బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని గిరిధర్ కోరారు. కార్యక్రమంలో మేనేజరు రాంజీ గౌతమ్, ప్రధాన ఖాతాదారులు పుచ్చలపల్లి సూర్యప్రకాష్, పోలయ్య, సిబ్బంది నజీర్ బాషా పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న బ్యాంకు అధికారులు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒక్కొక్క గ్రామ పంచాయతీకి వివిధ రూపాలలో ఏడాదికి రూ.రెండు నుంచి రూ.3కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీల్లో సంపద సృష్టించి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ హేమంత్ భరత్‌కుమార్, ఎంఈఓ-2 మల్లికార్జునరావు, సీహెచ్ఓ శివరామయ్య, సర్పంచ్‌లు సాధు శ్రీలత, సతీష్, చెన్నిబోయిన ఓబులుకొడయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కందిపప్పు ఇవ్వడం లేదని ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 16: పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధికి చెందిన పలువురు తమకు గత మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని సోమవారం తహసీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చౌక దుకాణం ద్వారా ప్రభుత్వం కిలో కందిపప్పు రూ.67కు అందజేస్తుండడంతో అందరం తీసుకునేవారమని, మూడు నెలలుగా ఇవ్వడం లేదని, పంపిణీ చేసేవారిని అడిగితే లేదని సమాధానం చెబుతున్నారన్నారు. ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. వీఆర్వోలతో చర్చించి పంపిణీ చేసేలా చూస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

బాలికల గురుకుల పాఠశాలలో వసతులు కల్పించండి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

● కలెక్టరుకు సీమాంధ్ర బీసీ సంక్షేమ నేతల వినతి

అల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నార్తుఆములూరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గదులతో పాటు మౌలిక వసతులు కల్పించాలని సోమవారం కలెక్టరుకు విన్నవించినట్లు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నేతలు బాబురెడ్డి, శ్రీనివాసులు, దయాకర్‌యాదవ్ తెలిపారు. ఈ విషయంపై సోమవారం మండలకేంద్రంలో మాట్లాడారు. 200మంది బాలికలకు నిద్రపోయేందుకు సౌకర్యం లేదని వాపోయారు. వీరి కోసం ఉన్న పాఠశాల భవనంపైనే ఐదు అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని లేదా కొంతమంది బాలికలను వెంకటాచలం, గొలగమూడి, విద్యానగర్ పాఠశాలలకు తాత్కాలింగా తరలించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మురళి, జయరామరాజు, సందానిబాషా, మురళి, జి.శివకుమార్, పి.సుబ్రహ్మణ్యం, పి.వాసు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి

అల్లూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పండుగ నెలారంభాన్ని పురస్కరించుకొని స్థానిక అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ భూముల అన్యాక్రాంతం

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం, రెవెన్యూ అధికారుల అలసత్వంతో వలేటివారిపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన మాన్యం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. కొందరు ఆక్రమ ణదారులు ఈ భూములను ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. మరికొందరు రెవెన్యూ అధికారుల చే యి తడిపి ఆన్‌లైన్ పేర్లు ఎక్కించుకుని పాసుబు క్కులు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న ట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆలయానికి సం బంధించిన మాన్యం భూములు ఏ గ్రామాల్లో ఎక్కడెక్కడ ఉన్నాయో దేవాదాయశాఖ అధికారులకే తెలియ దంటే వారి పనితీరు బట్టి అర్థం అవుతుంది. ఆలయ భూ ము లు రికా ర్డులలో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. అధికారుల లెక్కల ప్రకారం 260.62 మాన్యం భూములు న్నాయి అయితే మండలంలోని జమీన్‌ఉప్ప లపాడులో 70 ఎకరాలు, పోలినేనిపాలెంలో 14ఎకరాలకు మాత్రమే ఆలయ అధికారులు మూడేళ్లకోసారి కౌలు వేలం నిర్వహిస్తున్నారు. మిగిలిన 170 ఎకరాలు ఎక్కెడెక్కడ ఉన్నాయో తెలియదు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి సర్వేచేసి అన్యాక్రాంతమైన మాన్యం భములను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అనంతరం భూములకు కౌలు వేలం నిర్వహించి వచ్చిన ఆదాయంతో అభివద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.



వలేటివారిపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం

ఉత్సాహంగా నెహ్రూ యువకేంద్ర క్రీడా పోటీలు

కావలిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జెడ్పీ క్రీడా మైదానంలో జరిగిన డివిజన్‌స్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆ స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో జరిగిన పోటీలకు ముఖ్య అతిథులుగా జిల్లా యువజన అధికారి మహేంద్ర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ఎంఈవో గోవిందయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేంద్రరెడ్డి మాట్లాడారు. ఆరోగ్యం, ఆనందం ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. పురుషులకు వాలీబాల్, పరుగు పందెం, షాట్‌పుట్ అంశాలలో పోటీలు, మహిళలకు ఖోఖో, పరుగు పందెం, షాట్‌పుట్, డిస్కస్‌త్రో అంశాల్లో పోటీలు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో విజేతలు 21 తేదీ నెల్లూరులో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు అర్హులని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి అలీమ్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిరంజీవి, మణికంఠ, రాజ్యలక్ష్మి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బ్రహ్మయ్య, వినయ్, ఖాదర్‌బీ, ప్రసాదరావు, వినయ్ పాల్గొన్నారు.



విజేతలను సర్టిఫికెట్లతో అభినందిస్తున్న మహేంద్ర రెడ్డి

తూర్పుఎర్రబల్లిలో రెవెన్యూ సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు కోటేశ్వరరావు

కొండాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుఎర్రబల్లిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 8 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాల బ్యానర్ ఆవిష్కరణ




బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు

కావలి, డిసెంబరు 16: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల బ్యానర్‌ను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా సోమవారం కావలిలో విద్యుత్‌శాఖ అధికారులు ఆవిష్కరించారు. విద్యుత్‌పొదుపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20వరకు జాతీయ పొదుపు వారోత్సవాలను చేపడు తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో ప్రజలలోకి వెళ్లి విద్యుత్ పొదుపు చేసుకునేందుకు వియోగించే పరికరాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసినట్లని తెలిపారు. విద్యుత్‌పొదుపుపై ప్రజలలో మరింత చైతన్యం తెచ్చేందుకే వారోత్సవాలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ, కావలి, కలిగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు రవికుమార్‌రెడ్డి, క్రిష్ణ మోహన్, కావలి టౌన్, రూరల్ ఏఈలు వసంతరావు, శ్రీనివాసులు రెడ్డి సబ్‌డివిజన్‌లోని పలువురు ఏఈలు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ

కందుకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా పట్టణంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డివిజన్‌లోని విద్యుత్ ఇంజనీర్లు, సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతను వివరిస్తూ బ్యానర్లు, ప్లేకార్డులు చేతబట్టి నినాదాలు ముదుకు సాగారు. ప్రధాన కూడళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసి విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు.



పోరంబోకు భూములు అప్పగించాలని వినతి

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొడుగోదను మేపుకునేందుకు పోరంబోకు భూములు గ్రామస్థులకు అప్పగించాలని నకిలీ పత్రాలతో దోచుకునే వారికి ఎలా ఇస్తారని స్థానికులు సోమవారం పోలీసులను ప్రశ్నించారు. బోగోలు మండలం అక్కరాజువారి కండ్రిక గ్రామ శివారులోని భూములను కొనుగోలు చేశామని కొందరు సోమవారం భూములు దున్నుతుండగా చెంచులక్ష్మీపురం, అక్కరాజువారి కండ్రికు చెందిన గ్రామస్థులు వచ్చి మరోసారి అడ్డుకున్నారు. ఇదివరకు కూడా ఇదే విధంగా దున్నకాలను అడ్డుకున్నట్లు వారు చెప్పారు. అటవీ, మేతపోరంబోకు భూములు ఇవ్వాలని స్థానికులు తహసీల్దారు సురేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి ప్రయోజనం లేక ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. పోలీసులు ఇరువురికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బిట్రగుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ అరవపాలెంలో సోమవారం టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరావు, బోగోలు ఇన్‌చార్జి ఎం.వెంకయ్యలు సీసీ రోడ్డు పనులకు పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నాగరాజు, బి.ప్రభాకర్, అర్పత్‌రాజ్, ఎంపీటీసీ స్వరూపరాణి, వార్డు సభ్యులు ఎం.కిరన్‌కుమార్, మురళీ ఉన్నారు.

కావలి ఎమ్మెల్యేను కలిసిన మంత్రి ఆనం

కావలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సోమవారం సాయంత్రం కావలికి వచ్చారు. అమరావతి నుంచి నెల్లూరు వెళుతూ ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆహ్వానం మేరకు ముసునూరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అక్కడ అల్పాహార విందు చేశారు. స్థానిక రాజకీయాలు, అభివృద్ధిపై మంత్రితో ఎమ్మెల్యే ముచ్చటించారు.



మంత్రి ఆనంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కెఫా అవార్డ్స్‌కు కలిగిరి యువకుడి ఎంపిక

కలిగిరి/వింజమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) :రెండు తెలుగు రాష్ట్రాల్లో కరనమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్ అవార్డ్స్ (కఫా)-2024లో ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్ డైలాగ్ రైటింగ్ కేటగిరిలో మండలానికి చెందిన ఎరుకలరెడ్డిపాలెం యువకుడు కోట అనిల్‌కుమార్‌రెడ్డి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని ఏపీఎన్ జీజీఓస్ వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ను స్వగ్రామంలో సోమవారం సత్కరించారు. భవిష్యత్‌లో ఉత్తమ డైరెక్టర్‌గా రాణించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.



అభినందిస్తున్న వెలుగోటి మధు

నేడు పెన్షనర్ల సంఘ సమావేశం

కావలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంఘ తాలూకా సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రమణయ్య, ఆదిశేషులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్డీవో వంశీక్రిష్ణ, డీఎస్పీ శ్రీధర్, అసిస్టెంట్ ఉప ఖజానా అధికారి రాయపాటి జగజ్జీవన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేయండి

లింగసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీలో నాడు-నేడు పథకం కింద రెండోవిడతలో రూ.7.10 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు చేపట్టి మధ్యలోనే పనులు నిలిపివేశారు. పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం వీటి చూట్టూ చిల్లచెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపో వడంతో వంటగదిలో చిన్నారులు, బాలింతలు కాలం వెల్లదీస్తున్నారు.

హైవేపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసులు

మర్రిపాడు,16 (ఆంధ్రజ్యోతి):నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.



? ప్రమాదాల నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నారు.

! జంక్షన్ల వద్ద వాహనాల వేగం అదుపునకు జిగ్‌జాగ్ రూపంలో డ్రమ్ములు చేశాము.

? ఆవులు, గేదెలు రోడ్డు మీదకు రాకుండా కట్టడి చేయగలరా.

! రహదారిపై ప్రమాదాలకు కారణమైన పశువు యజమానిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో దండోరా వేయిస్తున్నాము. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

? ఎక్కువగా ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి.

! భూ తగాదాలు అధికంగా వస్తున్నాయి. అట్టివారిని రెవెన్యూ, సివిల్ కోర్టులకు వెళ్లమంటున్నాము.